# అక్కల్‌కోటనివాసి

# శ్రీస్వామి సమర్థ

కోటంరాజు శ్రీనివాసరావు

# ముందుమాట

**–కోటంరాజు శ్రీనివాసరావు**

మా ఇంట దైవము శ్రీ శిరిడీసాయిబాబా వారి అనుగ్రహముతో **"అక్కల్‌కోటనివాసి శ్రీస్వామి సమర్థ"** అనే ఈ గ్రంథము రచింపబడినది. "అల్లా అచ్ఛాకరేగా" అనే సాయిసచ్చరితము పూర్తి చేసిన కొన్ని రోజులకు ఒక అనుభవము కలిగినది. ఆ అనుభవము తప్పక చెప్పవలసినది కావున ఇక్కడ చెప్పబడినది. ఒకరోజు బాబాకు హారతి ఇచ్చిన పిమ్మట శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటమహారాజుగారి ఫోటో వద్ద హారతిని చూపిస్తుండగా, ఎప్పుడు కోపముతో, రుద్రరూపముతో కనిపించే ఆ స్వామి సమర్థ ఆనాడు చిరునవ్వు నవ్వుతూ దర్శనమిచ్చి "నా చరితము ఎప్పుడు రాస్తావు?" అని ప్రశ్నించెను. ఇది నా మనస్సులో కలిగిన భావనో లేక ఆ విధముగా నాకు అనిపించినదా? అనే సందేహము కలిగి దానిని గురించి పట్టించుకొనుట మానివేసితిని. కొన్ని రోజుల పిదప ఉదయము లేవగానే మళ్ళీ అదే ప్రశ్న శ్రీస్వామి సమర్థ ఆదేశించినది కలుగుతూనేయున్నది. రెండు మూడు రోజులు అలాగే రావటం వలన తేదీ 24-10-2010 నాడు బాబాను ఇట్లు ప్రార్థించినాను. "నా ఈ అనుభవము నిజమా లేదా భ్రాంతియా ? ఒకవేళ అది నిజమైతే నీ (సాయి) యొక్క ఆజ్ఞగా భావించి ఆ గ్రంథము మొదలుపెట్టెదనని, అయితే అది నీ ఆజ్ఞ ప్రకారము అయినచో 'అల్లా అచ్ఛాకరేగా' అనే గ్రంథములో నిన్ను (సాయి) తలుచుకుని తీసెదను. ఆ పుస్తకములో వచ్చిన పేజీ శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటస్వామివారి లీల మరియు శ్రీసాయిబాబా, శ్రీస్వామి సమర్థ ఒక్కరేనని 64 & 65 పేజీలలో వ్రాయబడినది. ఆ పేజీలు వస్తే తప్పక మొదలు పెట్టెదనని తలంచి ఆ 'అల్లా అచ్ఛాకరేగా' శ్రీబాబా వ్రాయించిన గ్రంథాన్ని తీయగా సరిగ్గా 64 & 65 పేజీలు రావటం శ్రీ షిరిడీ సాయిబాబా అనుగ్రహించినారని ఈ గ్రంథం ఆనాడే అనగా 24-10-2010న ప్రారంభించి కార్తీకమాసం పౌర్ణమి రోజున 21-11-2010న శ్రీస్వామి అనుగ్రహముతో ముగిసినది.

**'అక్కల్‌కోట నివాసి శ్రీస్వామి సమర్థ'** అనే పేరు కూడా శ్రీసాయిబాబా వారు నిర్ణయించి యిచ్చినది. ఈ గ్రంథము నా తల్లితండ్రులైన శ్రీమతి కోటంరాజు బాలా త్రిపురసుందరి మరియు శ్రీ కోటంరాజు జనార్ధనరావుగార్లకి అంకితము చేయబడినది. ఎందుకనగా మా అమ్మ 2005వ సం॥ ఆగష్టు 21న పరమపదించారు. అదే సంవత్సరము నవరాత్రులలో మొట్టమొదటిసారిగా అక్కల్‌కోటకు వెళ్లినప్పుడు అక్కడ ఒక స్వప్నము గాంచితిని. స్వప్నములో మా అమ్మ మార్కెట్‌లో మాతోపాటుగా తిరుగుతూ ఒక్కసారిగా స్వప్నములో అదృశ్యమయ్యెను. నేను, నా సోదరుడు అమ్మకోసము విచారిస్తుండగా స్వప్నములోనే శ్రీస్వామిసమర్థ సమాధి కనిపించి ఆ సమాధి నుండి మా అమ్మ మాటలు వినిపించాయి. అవి ఏమంటే నా

గురించి విచారించకండి. వెతకకండి. నేను శ్రీస్వామి సన్నిధిలో ఎంతో ఆనందముగా ఉన్నాను. ఈ విషయము ఇంట్లో వారికందరికి చెప్పమని చెప్పింది. స్వప్నము వెంటనే ముగిసినది. కళ్ళు తెరిచి చూచేటప్పటికి అక్కల్‌కోటలో నేనున్న రూములో ఎదురుగా గోడకు వ్రేలాడుచున్న శ్రీస్వామి సమర్థ ఫోటో కనిపించింది. మరియొక కారణము 5 సం॥ల క్రితము మొట్టమొదటిసారిగా శ్రీస్వామి సమర్థ చరితము ఇంగ్లీషు మరియు తెలుగులో చదివితిని. ఆ గ్రంథములు చదివిన పిదప మరెన్నో గ్రంథములు ఊహించనివి చదివితిని. శ్రీస్వామి సమర్థ చరితము చదువుట ముగిసిన రోజున భారీవర్షము పడుచుండగా మా యింటి గేటుకు ఏదో ఒక రాయి తగిలి పెద్ద శబ్దమురాగా వెళ్లి చూడగా అక్కడ శివలింగము రూపములో ఉన్న పెద్దసాలగ్రామము వంటి రాయి లోపల పడియున్నది. శ్రీస్వామి సమర్థ ఆ రూపములో వచ్చినారని తలంచి మా పూజామందిరములో పెట్టుకొనబడినది.


మాఅమ్మగారి జన్మదినము 13 డిసెంబరు కావున ఆ సందర్భముగా అక్కల్‌కోటనివాసి 'శ్రీస్వామిసమర్థ' అనే ఈ గ్రంథము శ్రీస్వామివారి అనుగ్రహముతో శ్రీశిరిడీసాయిబాబా ఆజ్ఞతో మా పూజ్య గురుదేవులు శ్రీమాన్ మహాభాష్యం రంగాచారిగారి సంపూర్ణఆశీస్సులతో వ్రాసి ఆవిష్కరించబడినది. పైగా ఇదే నెలలో దత్తజయంతి ఉన్నది మరియు మా నాన్నగారు శ్రీకోటంరాజు జనార్ధనరావుగారు డిసెంబరు, 30వ తేదీ, 2009న సాయిసన్నిధికి చేరినారు. మా తల్లితండ్రుల జ్ఞాపకార్థంగా అంకితమిస్తూ మరియు దత్తజయంతి సందర్భముగా కూడా ఈ గ్రంథము చదివి ఎందరో మహానుభావులు అందరికి వందనములతో నన్ను ఆశీర్వదించమని కోరుతూ –

కోటంరాజు శ్రీనివాసరావు
1-9-129/16/1/బి/3,
రాంనగర్
హైద్రాబాద్
సెల్ : 9346823570
9848438884

# అక్కల్‌కోటనివాసి శ్రీస్వామి సమర్థ

–కోటంరాజు శ్రీనివాసరావు

శిరిడీ సాయిబాబా 1918వ సం॥ము విజయదశమి పర్వదినమైన అక్టోబర్ 15వ తారీఖు, మంగళవారము, సుమారు గం॥ 2–30 ని॥లకు (మధ్యాహ్నము) సమాధి చెందినారు. శ్రీ స్వామి సమర్థ అక్కల్‌కోట మహారాజ్ 1878వ సం॥ము మంగళవారము నాడే సుమారు 4 గం॥లకు (సాయంకాలము) సమాధి చెందినారు. వారిరువురు ఒక్కరే. నామ రూపములు మాత్రము వేరుగా ఒకరు శిరిడీలోను, మరియొకరు అక్కల్‌కోటలోను అవతరించిన దత్తస్వరూపులు. శ్రీదత్తాత్రేయులు మహావిష్ణువు అవతారములైన 27 అవతరాములలో 7వ అవతారము శ్రీ దత్తాత్రేయుడు. దత్తాత్రేయులవారు మరల ఎన్నో అవతారములు దాల్చి లోకకళ్యాణముకై అవతరించినారు. ఆ అవతారములలో ముఖ్యమైనవి శ్రీపాదశ్రీవల్లభుడు, పిఠాపురమున, శ్రీ నృసింహసరస్వతి, గాణ్గాపురమున, శ్రీమాణిక్యప్రభువు, మాణిక్‌నగరమున, శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటన, శ్రీసాయిబాబా, శిరిడీన, శ్రీగజానన మహారాజ్ షేగావ్‌న ఇలా ఎన్నో రూపాలలో శ్రీ దత్తుడు అవతరించినారు. శ్రీసాయిబాబా సుమారు 1838వ సం॥ము ప్రాంతములందు అవతరించి ఉండవచ్చునని శ్రీసాయిసచ్చరిత్రలో తెలుపబడినది. శ్రీ స్వామి సమర్థ 1878వ సం॥న సమాధి చెందిరి. ఐతే శ్రీసాయిబాబా, శ్రీస్వామిసమర్థ (అక్కల్‌కోటమహారాజ్) యొక్క అవతారము అనగా స్వామి సమర్థ (ఇక నుండి అక్కల్‌కోట స్వామిని స్వామి సమర్థగా వ్రాయుచున్నాము) ఉన్న సమయమున శ్రీసాయిబాబాగారు శిరిడీలో వున్నారు కదా ఇరువురు ఒకే సమయమున వేరు వేరు చోట్ల వేరు నామాలతో ఉన్నప్పుడు ఎలా సాధ్యం? అనే సంకోచం తప్పక కలుగుతుంది. మహావిష్ణుస్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మ ఒకే సమయములో అనేక ఇళ్ళలో తమ లీలలను చూపించినారు. ఆ మహావిష్ణుస్వరూపుడైన శ్రీదత్తుడు ఒకే సమయములో మహారాష్ట్రలోని శిరిడీ గ్రామములో మరియు అక్కల్‌కోటలో వేరు రూపాలలో అవతరించి వేరు నామములతో ఉండి మభ్యపెట్టినారు. వారిరువురు ఒక్కరే. శ్రీదత్తుని అవతారపురుషులు. సాక్షాత్ శ్రీశిరిడీ సాయిబాబా ఒకసారి అక్కల్‌కోటస్వామి భక్తుడు బాబాను దర్శించుటకు శిరిడీకి వచ్చినప్పుడు శ్రీసాయి ఈ విధముగా పలికిరి, "అక్కల్‌కోటలో ఏమున్నది? అక్కడి మహారాజ్ ఇక్కడే, ఆ మహారాజ్ నేనే" అనినారు. అలాగే బాయికృష్ణాజీ అను శ్రీస్వామి సమర్థ భక్తుడు శ్రీస్వామి చిత్రపటమును పూజించెడివారు. ఒకసారి ఆ భక్తుని స్వప్నము నుందు శ్రీస్వామి సమర్థ దర్శనమిచ్చి "ప్రస్తుతము శిరిడీ నా నివాసస్థలము. అచ్చటికి పోయి నీ పూజ ఒనరింపుము" అనెను.



పైరెండు సంఘటనలు సాక్షాత్ శ్రీసాయిబాబాగారు మరియు శ్రీస్వామిసమర్ధ నిర్ధారించిన సంఘటనలు. దీనిని బట్టి వారిరువురు ఒక్కరే అని ఋజువైనది. శ్రీసాయి సమర్ధ మరియు శ్రీస్వామి సమర్ధ ఇరువురు ఒక్కరే. శ్రీ సాయిబాబా అష్టోతరత శతనామావళి నందు 108వ నామం ఓం సమర్ధ శ్రీసద్గురు సాయినాథాయనమః అని శ్రీస్వామి సమర్ధ అష్టోత్తర శతనామావళినందు 11వ నామము ఓం శ్రీ సమర్థాయ నమః మరియు 108వ నామం ఓం శ్రీ అక్కల్‌కోట శ్రీస్వామి సమర్ధాయ నమః అని కొలువబడినది. ఈ రెండు అవతారములే కాదు. పైన చెప్పబడిన మిగిలిన అవతారములు శ్రీపాదశ్రీవల్లభుడు, శ్రీ నృసింహసరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు మరియు శ్రీ గజానన మహారాజ్‌లు కూడా ఒక్కరే. దత్తపరంపరగా అవతరించిన అవధూతలు వేరు నామాలతో వేరు రూపాలలో వేరే ప్రదేశములలో అవతరించి శ్రీదత్తుడు తన లీలలను శ్రీకృష్ణపమరాత్మడు చూపిన విధముగా ప్రదర్శించిరి.

అసలు శ్రీదత్తుని జననము, రూపము కలియుగంలో శ్రీదత్తుని అవతారం గురించి మొదట తెలుసుకొనవలసిన అవసరము ఎంతో ఉంది.

## అధ్యాయము-1

## శ్రీదత్తాత్రేయుని జననము

అత్రిమహర్షి ఋక్షపర్వతమునకు వెళ్ళి నూరు సంవత్సరములు ఘోరతపస్సు గావించెను. ఆ కారణముగా మహర్షి శిరస్సు నుండి అగ్ని బయట వెడలి సర్వలోకాలను భయభ్రాంతులను చేసినది. లోకులు త్రిమూర్తులను వేడుకొనగా, వారు అత్రిమహర్షి ఎదుట ప్రత్యక్షమై అత్రి మహర్షి కోరిక ప్రకారం పుత్రునిగా ఉండుటకు అంగీకరించెను. మూడు శిరస్సులతో ఆరు భుజాలతో దత్తపుత్రుని వలె అంగీకరించమని అత్రి మహర్షి కోరగా అవతరించెను. ఆ బాలుని దత్తాత్రేయుడని నామము చేసి అత్రి అనసూయలు త్రిమూర్తి రూపుడగు దత్తుని స్వీకరించెను. ఆ దంపతులు ఆ పుత్రుని దత్తపుత్రునిగా గాక సుపుత్రుడై ఉన్న బాగుండునని తలువగా వారి కోరిక కూడా త్వరలో తీర్చెదమని దత్తుడు అనుగ్రహించెను.

దత్తాత్రేయుని జననమునకు మరియొక కథ కూడా కలదు. సప్తఋషులలో అత్రి మహర్షి ఒకరు. వారు బ్రహ్మదేవుని పుత్రులు. వారి భార్య మహాపతివ్రత అనసూయ మాత. పుత్రుడు కలుగవలెనని కోరికతో ఆ మహర్షి తపస్సు చేసెను. వారి తపస్సుకు మెచ్చి త్రిమూర్తులు ప్రత్యక్షమైరి. ఆ మహర్షికి ఆ త్రిమూర్తులు ముగ్గురు పుత్రులై జన్మించెదరని వరమిచ్చిరి. త్రిమూర్తుల భార్యలు తమను మించిన పతివ్రతలు ఏ లోకములోను లేరని భావించు సమయమున నారదమహర్షి కొన్ని గింజలను తెచ్చి వండిపెట్టమని ఒక్కొక్క దేవిని వేడగా అవి సాధారణమైన తిండి గింజలు కావని ఇనుపవని వాటిని వండుటకు ఎవరివల్ల సాధ్యము కాదని ఆ మగ్గురు తల్లులు నారదునకు చెప్పిరి. నారదుడు పతివ్రతలు చేయలేని పని సృష్టిలో ఉండదని అనగా ఆ ముగ్గురు తల్లులు, **"మా కంటె పతివ్రతలు ఎవరున్నారు; ఏ లోకములోనైనా?"** అని అనగా నారదుడు అనసూయా మాత గురించి వారికి చెప్పిరి. నారదుడు అదే గింజలను అత్రి ఆశ్రమమునకు వెళ్ళి అనసూయా మాతకు ఇవ్వగా ఆ మాత తన భర్తను ఒక్కమారు స్మరించి గిన్నెలో పోసి క్షణములో వాటిని ఉడికించి అన్నము తెచ్చెను. ఈ అద్భుత సంఘటనను చూసి ఆశ్చర్యచకితులైరి. త్రిమూర్తుల భార్యలు అసూయ కూడా చెందిరి. తమ భర్తలను ఆమెను పరీక్షించుటకై పంపిరి. అనసూయా మాత ఒక్కరే ఉన్న సమయమున త్రిమూర్తులు ముగ్గురు బ్రాహ్మణవేషములో ఆశ్రమమునకు వచ్చి, భిక్ష నడిగిరి. అనసూయ మాత ఆ ముగ్గురిని లోనికి పిలిచి భిక్ష నివ్వబోగా, మారువేషములో నున్న శ్రీమహావిష్ణువు ఇట్లనెను. "అమ్మా! నీ వంటిపై వస్త్రములు లేకుండా మాకు వడ్డింపువలెనని అది వారి దీక్ష" అని తెలిపెను. వెంటనే అనసూయా మత జ్ఞాన దృష్టితో గ్రహించి త్రిమూర్తులే వచ్చి తనను పరీక్షించుటకై ఆడిన నాటకమని గ్రహించి ఆమె తన చేతిలో నీటిని తీసుకుని ఇట్లనుకొనెను. **"నిజమైన ప్రతివ్రతను నేనయినచో ఈ ముగ్గురు అతిథులు పసిబాలురుగా అగుదురు"** అనిన వెంటనే త్రిమూర్తులు ముగ్గురు పసిపాపలై ఏడ్వసాగిరి. అనసూయ

మాత ఆ ముగ్గురికి పాలిచ్చి పరుండబెట్టెను. **ఆహా! సాక్షాత్తు త్రిమూర్తులకె ఆ మాత తన స్తన్యమును నోటపెట్టి పాలిచ్చిరంటే ఎంత అదృష్టమోగా!** అత్రి మహర్షి జరిగిన సంఘటనను ధ్యానదృష్టితో గ్రహించి ఆనందించినారు. త్రిమూర్తుల భార్యలకు ఈ సంఘటన తెలిసి వారి తప్పును గ్రహించి అత్రి ఆశ్రమమునకు వెడలిరి. అనసూయ మాతను క్షమింపమని వేడగా అనసూయ మాత తన చేతిలో నీళ్ళను తీసుకొని ఆ పాపలై చల్లగా, పసిపాపలు తిరగి త్రిమూర్తులైనారు. త్రిమూర్తులు అనసూయ మాత యొక్క పాతివ్రత్యమును ప్రశంసించి వరము కోరుమనగా అనసూయ మాత ఆ త్రిమూర్తులను తన గర్భమున జన్మించమని వేడుకొనగా, త్రిమూర్తులు ప్రసన్నులై అభయమిచ్చిరి. తరువాత త్రిమూర్తుల అంశలు అనసూయ మాత గర్భములో విష్ణుఅంశతో దత్తాత్రేయుడు, బ్రహ్మఅంశతో చంద్రుడు, శివుని అంశతో దూర్వాసుడు పుత్రులై జన్మించిరి. కొంతకాలమునకు చంద్రుడు, దూర్వాసుడు వారి వారి శక్తులను దత్తునకిచ్చి తపస్సుకై వెడలిపోయిరి.

దత్తాత్రేయుని జననం గురించి మరియొక కథ కూడా కలదు. కౌశికుని భార్య సుమతి మహాపతివ్రత. కౌశికునికి కుష్టురోగము కలదు. సుమతి తన భర్తను దేవునిగా భావించి సేవ చేయుచుండెను. ఒకసారి కౌశికుడు ఒక వేశ్యను చూసి వేదనపడగా సుమతి తన పతియొక్క కోర్కెను తీర్చుటకై నడువలేని తన భర్తను తన భుజములపై పెట్టుకొని వేశ్య ఇంటికి వెళ్ళుదారిలో, మాండవ్యుడను ముని యొక్క తలకు చీకటిలో కౌశికుని కాలు తగిలెను. మాండవ్యుడు **"నా తలను తన్నిన వాడు రేపు తెల్లవారుఝాములోగా మరణించు"**నని శపించెను. సుమతి సూర్యోదయము కాకుండుటకై శపించెను. తన పాతివ్రత్యమహిమ వల్ల లోకమంతయు చీకటితో నిండి సూర్యోదయము ఎన్నటికీ కాలేదు. దేవతలందరు ఇదంతయు పతివ్రతయైన సుమతిశాపమున వల్లనే అని గ్రహించి మరియొక మహాపతివ్రతయైన అనసూయ మాతను వేడుకొనగా అనసూయా మాత సుమతని సూర్యదేవుని ఆహ్వానించి పూజించమని చెప్పగా సుమతి సూర్యుని ప్రార్థించగా తెల్లవారెను. కౌశికుడు మరణించెను. అనసయ మాత ఆమె తన శక్తితో కౌశికుణ్ణి బ్రతికించెను. తద్వారా కూష్టువ్యాధి కూడా నయమయ్యెను. త్రిమూర్తులు ఆమెను వరము కోరుకొనమనగా **"మీ ముగ్గురు మాకు పుత్రులుకండు"** అని అనసూయమాత కోరెను. త్రిమూర్తులు తథాస్తని దీవించిరి.

## అధ్యాయము-2

## జగద్గురు రూపం - పరీక్ష

దత్తప్రభువు సాక్షాత్ జగద్గురువు. వారు త్రిమూర్తుల యొక్క అవతారము. ఎన్నో దివ్యశక్తులతో లీలలను చూపుచెందెడివారు. వారు సృష్టి, స్థితి, లయకారకులు. పచ్చని పసిడివన్నె కాంతితోను, లేత తమలపాకుల వంటి సౌందర్యముతోను, చక్రాలాంటి కన్నులతోను, చిరునవ్వులొలికే పెదవుల తోను కుడివైపు మూడు చేతులలో పద్మము, జపమాల, త్రిశూలము మరియు ఎడమవైపు మూడు చేతులలో శంఖము, చక్రము, కమండలముతోను దివ్య సుందరాంగ సౌందర్యరూపమున అవధూత దత్తదిగంబరుడు అవనిపై అవతరించి త్రిమూర్తిగా త్రిలోకనాథునిగా దయా, కరుణ, ప్రేమ కలిగి తన భక్తులకి సుఖశాంతి సౌభాగ్యాలను కలిగించే భగవానునిగా అతి స్వల్పవ్యవధిలోనే ప్రసన్నమై కోరిన వరములను కటాక్షించే భగవానునిగా ప్రఖ్యాతి గాంచినారు. స్వామి ప్రక్కన శ్వేతవర్ణము గల గోమాత ఎప్పుడు ఉండేది. ఆ గోమాతయే సాక్షాత్తు భూదేవి మాత. దత్తునిపాదముల కడ నాలుగు శునకములు ఉండును. అవే నాలుగు వేదములైన ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము మరియు అధర్వణవేదము. వేల చంద్రులు ఇవ్వలేని కాంతితోను, మిలమిల మెరిసే దివ్యతేజముతోను, సన్నటి కరములతోను, సరళ స్వభావముతోను, శంఖము వంటి మెడకలిగి సుగంధ సువాసనలతోను, నాజుకు నడుముగల నారాయణమూర్తి శ్రీదత్తుడు. ఇంతటి చక్కటి సౌందర్యరూపుడైన దత్తుడు తన భక్తుడ్ని పరీక్షించుటకు మాత్రము అతి ఘోరమైన అందవిహీనమైన దుర్వాసనతో భయంకరమైన రూపముతో తన భక్తునికి దర్శనమిస్తారు. అవధూతల లక్షణముల అవే. వారిని కనిపెట్టుట మన తరం కాదు.

శ్రీదత్తుడు ఒకసారి నదిలో అదృశ్యులైరి. యోగిజనులు దత్తుని సాంగత్యము మరువక తిరిగి వచ్చుననే ఆశతో నూరు సంవత్సరములు వేచి యుండిరి. కాని కొందరు మాత్రము నిరాశులై వెళ్ళిపోయిరి. ఇది తమ విశ్వాసాన్ని పరీక్షించుటకై దత్తుడు అదృశ్యమయ్యెను. ఆ సరోవరము నుండి ఒక చేతితో మధుపాత్రను, మరొక చేతితో ఒక స్త్రీని పట్టుకొని దత్త ప్రభువు బయటకు వచ్చిరి. మధుపాత్ర మరియు కాంత కూడా తమ విశ్వాసాన్ని పరీక్షించుటకై ఆడిన నాటకమని యోగిజనులు కొందరు గ్రహించిరి.

తల్లితో కాలం గడిపిన పిదప దత్తప్రభువు సహ్యాద్రి పర్వత గుహలకు తపస్సుకై వెడలుచు తల్లి ఆజ్ఞకోరగా, తల్లి దత్తుని వదిలి ఉండలేక వెళ్ళవద్దని బ్రతిమాలెను. శ్రీదత్తుడు దానికి అంగీకరించకపోవుటచే దత్తప్రభుని శరీరంపై తల్లిగా అధికారము కలదని ఆ తల్లి చెప్పి, తాను ఆయనకిచ్చినదంతా తిరిగి ఇమ్మని కోరగా దత్తుడు తన శరీరమందున్న చర్మాన్ని ఒలిచి తల్లికి ఇచ్చెను. తల్లి దత్తుని చర్యను చూసి బాధపడి, పూర్వరూపమును ధరించమని వేడెను. దత్తభగవానుడు నమ్ముకొన్న యోగి జనులను ఎట్లు పరీక్షించెనో

సాక్షాత్తు ఆ భగవానుని తల్లి మాట వరుసకు తన కుమారుడైన దత్తుని శరీరంపై అధికారము కలదని తాను ఆయనకు ఇచ్చినది తిరిగి ఈయవలెనని తల్లి పరిక్షించగా వెంటనే దత్త భగవానుడ తన చర్మాన్ని ఒలిచి ఇచ్చెను. సాధకుడు కూడా తాను నమ్ముకున్న సద్గురువు కోసం ఏ పరీక్షకైనను సిద్ధపడి ఉండవలెనని శ్రీ దత్తుడు ప్రదర్శించిన చర్యను మార్గముగా తీసుకుని ఏ పరీక్షలో నైనా వెనుకాడక తాను నమ్ముకున్న సద్గురువు కోసం సిద్ధమై ఉండిన సద్గురువు యొక్క అనంతమైన కృపాకటాక్షములు ఆ నమ్ముకున్న సాధకునికి లభ్యమగును. అత్రి అనసూయల కోరికపై దత్తుడు వారి పుత్రునిగా అవతరించెను. భక్తుల కోరికలను తీర్చుటకు భగవంతుడు ఎన్ని కష్టములైనా పడెదరని నిరూపించుటకు కాబోలు తన తల్లి దత్తప్రభువుని శరీరముపై అధికారము కలదని అని అనినప్పుడు మరియు తల్లిగా తాను ఆయనకు ఇచ్చినదంతా ఈయెవలెనన్నప్పుడు దత్తుడు తన శరీరమందున్న చర్మాన్ని ఒలిచి తల్లి చేతిలోపెట్టెను. **భగవంతుడు తన భక్తులకోసం ఏమైనా చేసెదరు.**

## అధ్యాయము-3

## జగద్గురువుని గురువులు

దత్తాత్రేయుడు జగద్గురువు. మరి ఆ జగద్గురువునికి గురువులు ఏమిటి? శ్రీదత్తునికి 24 మంది గురువుల వద్దనుండి విద్యను గ్రహించినారని చెప్పిరి. ఆ గురువులు –

**1. పృథ్వి :** మానవులు, జంతువులు భూమిపై నడిచినను పృథ్వి దుఃఖింపక సహనశక్తితో ఉండుట గమనించి సహనమునకు మరో పేరు పృథివ అని శ్రీదత్తుడు పృథ్విని తన గురువుగా చేసికొనెను.

**2. వాయువు :** వాయువునకు ఎటువంటి వాసన అనునది ఉండదు. కాని ఇతర వస్తువులచేత వాయువునకు సుగంధ, దుర్గంధములు ఏర్పడును. చిత్తమును ఈ విధముగా నిర్లిప్తతతో వున్న యోగికి ఎటువంటి దోషములు ఉండవు. కావున దత్తుడు వాయువును తన గురువుగా భావించెను.

**3. ఆకాశాము :** అంతయు వ్యాపించునది ఆకాశము. కాని ఆ ఆకాశము సంగరహితముగా ఉండునట్లే ఆత్మయు శరీరాదులతో ఎటువంటి సంబంధము లేక సంగరహితమై ఉండును. ఆకాశము శ్రీదత్తుని మరియొక గురువు.

**4. జలము :** సత్పురుషులు ఎటువంటి రాగద్వేషములు లేకుండా జలము ఎట్లు స్వచ్ఛముగా నుండునో అట్లుండవలెనని శ్రీదత్తుడు  జలము ద్వారా తెలిసికొనెను.

**5. అగ్ని :** అగ్ని ప్రకాశిస్తూ అన్నిటిని భక్షించును. కాని ఎవరి దోషములను గ్రహించదు. ఒకచోట కనిపించి, కనిపించక మరియొక చోట కన్పిస్తూ ఉండును. ఉత్తమమైనవాడు గుప్తముగా ప్రకటమై వేరొక చోట ఉండవలెను. శ్రీదత్తుడు అగ్నిని గురువుగా భావించెను.

**6. చంద్రుడు :** చంద్రుడు ఒక పక్షమందు పెరుగును. మరియొక పక్షమున నందు క్షీణించుచుండును. ఇట్టి పెరుగుదల, తరుగుదల లేని విధమునను చంద్రుని ప్రభావితము చేయజాలదు. అట్లే సుఖదుఃఖములు శరీరమునకే గాని ఆత్మకు కాదని యోగి గ్రహించవలెను. చంద్రుడు శ్రీదత్తునికి మరియొక గురువు.

**7. సూర్యుడు :** నీటిని ఆవిరిగా సూర్యుడు గ్రహించి తద్వారా వర్షమును భూమిపై కురిపించును. యోగి అయినవాడు ఇంద్రియముల ద్వారా విషయములందు లోను గాక, వాని యందలి మంచి స్వభావాన్ని గుర్తించవలెనని సూర్యుని కూడా దత్తుడ తన గురువుగా చేసికొనెను.

**8. పావురము :** ఒంటరి పావురమునకు ఎంతో సౌఖ్యము ఉండును. అదే పావురము ఒక భాగస్వామిని చేసికొని బందము పెంచుకొని, సంతతిని కల్గినప్పుడు ఎప్పుడో ఒకప్పుడు బోయవాని చేతిలో పడక తప్పదు. కావున ప్రాపంచిక వ్యవహారాలలో వ్యామోహం చెందరాదని, అది తన నాశనానికే కారణము అవుతుందని

పావురము ద్వారా విద్యను గ్రహించనారు గురుదేవులు.

**9. సముద్రము :** చూచుటకు ప్రశాంతముగా కన్పించినను, లోన అతి గంభీరముగా ఉండును. జ్ఞానిలోన గాంభీర్యముగా ఉండవలెను. విషయభోగములు ఎక్కువైన సంతోషపడరాదు. తక్కువైన దుఃఖించరాదు. సముద్రము శ్రీదత్తునికి మరియొక గురువు.

**10. మిడుత :** దీపకాంతిపై వ్యామోహములో పడి మిడుత కాలినట్లు జ్ఞాని అయినవాడు రూపముచే ఆకర్షణ ఎన్నడు చెందరాదని, మిడుత వలన తెలిసికొనెను. మిడుత ఒక గురువు.

**11. కొండచిలువ :** ఆహారానికి ప్రయత్నించదు. దొరికిన దానినే తినును. కావున కొండచిలువ మరియొక గురువు.

**12. భ్రమరము :** సువాసనలపై మోహము చేత తుమ్మెదలు కమలములో పడును. అట్లే జ్ఞాని ప్రలోభపరుడు కాకుండ ఉండవలెను. శ్రీదత్తుని మరియొక గురువు భ్రమరము.

**13. ఏనుగు :** మగ ఏనుగు ఆడ ఏనుగు యొక్క శరీరస్పర్శకు లోనై బురదలో దిగి బంధన పాలగును. అట్లే జ్ఞాని ప్రలోభ పడరాదు.

**14. లేడి :** ఇది సంగీతము వలన ఆకర్షించబడి పట్టుబడే అమాయక జంతువు. అట్లే యోగి ప్రాపంచిక విషయములచే ఆకర్షింపబడినచో లేడివలె చిక్కుకొనును.

**15. చేప :** చేపలు పట్టువాని గాలానికి ఉన్న ఆహారాన్ని తీసికొనవలెనని ఆదుర్దాతో చేపఎరను మ్రింగి గాలానికి చిక్కుకొనును. యోగి రుచికరమైన ఆహారమువైపు ఆకర్షించబడరాదు. కావున చేప మరియొక గురువు.

**16. తేనెటీగ :** మధువును దాచుకొనును. ఈ దాపరికం వలన మరణహేతువని గ్రహించవలెను.

**17. పింగళ :** ఈమె ఒక వేశ్య. ధనవంతుని రాకకై అర్ధరాత్రి వరకు వేచి వుండును. కాని అట్టివాడు రాలేదు. నిరాశచెంది నిద్రించి క్షణభంగురములగు విషయములపై ఆశను వదిలెను.

**18. లకుముకి పిట్ట :** మాంసపు ముక్కను తన ముక్కున పట్టుకొని పోవుచున్న ఈ పిట్టను గ్రద్ధ చూచి వెంటాడి పొడిచెను. ఆ పిట్ట ముక్కను విడిచెను. కావున త్యాగమే పరమసుఖము నిచ్చును.

**19. చిన్న పిల్లలు :** ఏ చీకు చింతా లేనివాళ్ళు ఉత్తములట్లే యుండవలెను.

**20. కన్య :** కన్య యొక్క తల్లి తండ్రులు లేని సమయమున పెళ్ళిచూపులకై వచ్చిన వాళ్ళని వారి భోజనమునకై పనులు మొదలుపెట్టినప్పుడు, గాజుల చప్పుడు విని ఆ యింటిలో తిండి గింజలకు కూడా కొదువాయె అని అనుకొందురని తన గాజులను చేతులకు తీసి వద్దు దంచెను. ఆధ్యాత్మిక చింతన కలవారు

ఒంటరిగా ఉండి కూర్చొని సాధన చేయవలెను.

**21. బాణములు చేయువాడు :** ఇది ఏకాగ్రతయైన పని. యోగి అయినవాడు ఆత్మచింతన యందు ఏకాగ్రుడై యుండవలెను.

**22. పాము :** ఒక చోట ఉండక ఒంటరిగా తిరుగును. అట్లే జ్ఞాని ఒక చోట ఉండడు. ఒకరి సహాయము కోరరాదు.

**23. సాలెపురుగు :** తన దారముతో గూడు కొట్టుకొని దానినే పాడుచేయును. అట్లే సర్వేశ్వరుడు సృష్టించును, నశింపజేయును.

**24. సీతాకోకచిలుక :** రంగుల సీతాకోకచిలుకగా మారి బయటకు వచ్చును. అట్లే యోగి రాగద్వేషరహితుడై ఆధ్యాత్మిక చింతనాపరుడై ఉండవలెను.

**శ్రీదత్తునికి పై చెప్పిన 24 మంది గురువులు అగుటకు, ఆ 24 మందికి అర్హత ఏ విధముగా కలిగెనో పైన చెప్పిన విధముగా వివరించెను.**

ఇంతమంది క్రిమి, కీటక, మానవ, జంతువుల నుండి విద్యను గ్రహించి ఆత్మవిదునిగా చేసిన 24 మంది గురువులుగా స్వీకరించిన శ్రీదత్తుని అవతారమగు శ్రీషిరిడీసాయిబాబా కొందరు శిరిడీ సాయిబాబాకి గురువుండిరని, వారే వెంకూసా అని మరికొందరు సాయిబాబాకు గురువే లేరని వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నవి ఈనాటికి కూడా. శ్రీ షిరిడీ సాయిబాబా సచ్చరిత 32వ అధ్యాయములో పరమాత్మను వెతుకుటకు శ్రీసాయి ముగ్గురితో బయలుదేరినప్పుడు వారి ఎదుట గురువు ప్రత్యక్షమైనప్పుడు బాబా వారిని గురువుగా స్వీకరించారు అనుటలో తప్పులేదు. 24 మంది గురువుల వద్దనుండి విజ్ఞానతత్త్వాన్ని గ్రహించిన దత్త అవతారమగు శ్రీసాయికి వెంకూసా గురువు ఉన్నను లేదా 32వ అధ్యాయములో బాబా ఎదుట గురువు ప్రత్యక్షమైనప్పుడు శ్రీసాయి వారిని గురువుగా భావించుటలో తప్పులేదు. ఆ గురువుల నుండి కూడా దత్తసాయి విజ్ఞానతత్త్వాన్ని అవగాహన చేసికొని వారిని గురువులుగా స్వీకరించినారు.

## అధ్యాయము-4

## ముఖ్యమైన దత్తక్షేత్రాలు - కలియుగములో దత్త అవతారములు

శ్రీదత్తుని లీలలను ఇంకా వివరంగా తెలిసికొనవలెనన్న గురుచరిత్రను పూర్తిగా చదివిన మనకు తెలియును. దత్తక్షేత్రములు ముఖ్యమైనవి 1. ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురము 2. కర్ణాటకలో కురుగడ్డ 3. మహారాష్ట్రలోని కరంజా 4. మహారాష్ట్రలోని ఔదుంబరం 5. మహారాష్ట్రలోని నరసోబావాడి 6. మహారాష్ట్రలోని గాణ్గాపూర్ 7. ఆంధ్రప్రదేశ్‌లోని కదళీవనం 8. కర్ణాటకలోని మాణిక్యనగర్ 9. మహారాష్ట్రలోని అక్కల్‌కోట 10. మహారాష్ట్రలోని శిరిడీ 11. మహారాష్ట్రలోని షేగావ్.

కలియుగంలో శ్రీదత్తుని అవతారములు ముఖ్యమైనవి ఆరు అవి -

1. పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభుడు
2. గాణ్గాపూర్‌లోని శ్రీ నృసింహసరస్వతి
3. మాణిక్యనగర్‌లోని శ్రీ మాణిక్య ప్రభువు
4. అక్కల్‌కోటలో శ్రీ స్వామి సమర్థ
5. శిరిడీలోని శ్రీ సాయిబాబా
6. షేగావ్‌లోని శ్రీ గజానన మహారాజ్

### 1. శ్రీపాద శ్రీ వల్లభులు - జననం :

శ్రీపాద శ్రీవల్లభుడు శ్రీ దత్తుని ప్రథమ అవతారం. కలియుగంలో అవతరించిన త్రిమూర్తి. శ్రీపాదశ్రీవల్లభుని గూర్చి వివరముగా వెలిసికొనవలెనన్న గురుచరిత్ర చదివినచో పూర్తి వివరములు తెలియును. ఇక్కడ సూక్ష్మముగా ముఖ్యమైన సంఘటనలు మాత్రమే తెలియజేయటమైనది. పిఠాపురమున అప్పలరాజు మరియు అతని భార్య సుమతి ఉండెడివారు. వారికి ఇద్దరు కుమారులు. ఒకడు గుడ్డివాడు. మరియొకడు వికలాంగుడు. వారి ఇంటి వాకిట శ్రీదత్తుడు విప్రరూపుడై భిక్షను కోరగా శ్రీదత్తుని సుమతి సత్కరించి అతిథి మర్యాదలతో భోజనము పెట్టి ఆదరించెను. శ్రీదత్తుడు ప్రసన్నుడై వరము కోరుమనగా ఆ తల్లి శ్రీదత్తుని వంటి కుమారుణ్ణి ప్రసాదించమని కోరగా శ్రీదత్తుడు అనుగ్రహించెను. కొన్ని నెలల పిదప శ్రీదత్తుడు ఆ పుణ్యదంపతులకు శిశువుగా జన్మించెను. **పుట్టుకతోనే ఆ శిశువు పాదముల యందు శంఖ చక్రరేఖలతో పుట్టెను. కనుక అతనికి శ్రీపాదుడని పేరు పెట్టెను.**

**రెండవ అవతారమగు నరసింహసరస్వతి అవతరించుటకు కారణం** - కురుగండి యందు ఒక బ్రాహ్మణుడు అతని భార్య సుశీలయను కలరు. ఆమెకు అంబిక అను నామాంతరము కలదు. వారికి లేక

లేక ఒక బాలుడు జనించెను. కాని చదువునందు వెనుకబడి ఉండుటచే తల్లిదండ్రుల బాధ పడుచుండిరి. తండ్రి వేదపండితుడు. కాని కుమారుడు పండిత పుత్ర పరమశుంఠ అనునట్లు అక్షరం ముక్కలేనివాడు. ఆ బాధతో తండ్రి మరణించెను. అంబిక దిగులతో ఆ కుమారుడితో సహ ఆత్మహత్య గావించుకొనవలెనని తలిచినపుడు శ్రీపాదశ్రీవల్లభుడు వారిని కరుణించి పూర్వజన్మకర్మము  అనుభవించవలెనని కర్మశేషము మిగిలిఉండగనే అనుభవింపక ఆత్మహత్య కావించిన వారికి ఆ పాప కర్మము మూటకట్టుకుని మళ్ళీ మరుజన్మలో అనుభవించక తప్పదని కావున అనుభవించవలసినది ఈ జన్మమునందే అనుభవించవలెనని శ్రీపాదశ్రీవల్లభుడు ఆ తల్లి అంబికకి భోదించి అనునిత్యము శివపూజ చేయమని ఆ పూజ ఫలితముతో మరుజన్మనందు మహాపండితుడు ఆ భగవంతుడే ఒక అవతారము దాల్చి నీ కడుపున ప్రసవించునని ఆ భగవంతుడే తానని శ్రీపాదశ్రీవల్లభుడు ఆ తల్లి అంబికకు వరమునిచ్చెను.

**సమాధి :** ఇట్లు శ్రీ పాదశ్రీవల్లభుడు 1320–1350 వరకు ఉండి 1351 సం॥న ఆశ్వయుజ బహుళ ద్వాదశి గురువారము మృగశిరా నక్షత్రములో గంగాదేవికి నమస్కరించి నీటిపై సమాధి స్థితి యందు ఉండి అదృశ్యులై ఎక్కడి నుండి శ్రీపాదులు వచ్చిరో అక్కడికే వెళ్ళినారు. శ్రీపాదులు జననం, శ్రీదత్తుడు అప్పలరాజు, సుమతిదంపతులకు మాట ఇచ్చెను. కనుక శ్రీపాదశ్రీవల్లభరూపమున జన్మించెను. శ్రీదత్తునికి మరణము అనేది లేదు. కావుననే నీటిపై సమాధిస్థితి యందు ఉండి అదృశ్యులైరి కాని మరణము చెందలేదు.

**2. శ్రీనృసింహ సరస్వతి – జననం :** శ్రీదత్తుని కలియుగంలో రెండవ అవతారము శ్రీనృసింహసరస్వతి. శ్రీదత్తుని మొదటి అవతారమగు శ్రీపాదుడు అంబికకు మాట ఇచ్చెను. తానే కుమారునిగా జన్మించెదనని, ఆ మాట నిలుపుకొనుటకై కరంజా అను గ్రామమున 1376వ సం॥లో శ్రీనృసింహసరస్వతి జన్మించెను. స్వామి తల్లిపేరు అంబ. తండ్రి పేరు మాధవుడు. స్వామి వారు వారిరువురికి జన్మించిన పరమపురుషుడు పుట్టినది మొదలు ప్రణవమునే ఉచ్ఛరించేవాడు. శ్రీనృసింహ సరసర్వతి లీలలను వివరముగా తెలిసికొనవలెనన్న శ్రీగురుచరిత్ర చదివినచో తెలిసికొనగలరు.

**సమాధి :** శ్రీనృసింహసరస్వతి తన భక్తులకు తన పాదుకలనిచ్చి గాణ్గాపురమన ఉంచమని చెప్పి తాను అదృశ్యరూపమున ఎప్పటికి గాణ్గాపురంలోనే ఉండెదనని తన నిర్గుణ పాదుకలను పూజ చేయువారికి ఆ పాదుకలు దర్శించిన వారిని తప్పక కటాక్షించెదని చెప్పి శ్రీశైలమునకు వెళ్ళెను. శ్రీస్వామి వెంట సాయందేవుడు, నంది, నరహరి, సిద్ధముని అనే నలుగురు శిష్యులు కూడా శ్రీశైలమునకు వెళ్ళిరి. శ్రీనృసింహసరస్వతి శ్రీశైలము వద్ద పాతాళగంగను చేరి నదీ ప్రవాహముతో ముందుకు సాగిపోయెను. ఉత్తరాయణము, మాఘమాసము, కృష్ణపక్షము శుక్రవారము బహుదాన్య సంవత్సరము క్రీ.శ.1456 తన

శిష్యులను దీవించి తన నిజస్థానమునకు వెళ్ళిపోయెను. ఆ నదీ ప్రవాహము నుండి నాలుగు పుష్పములు వచ్చి శ్రీస్వామి వెంట వచ్చిన ఆ నలుగురి శిష్యుల వద్ద చేరినవి. ఆ పువ్వులను కండ్ల కద్దుకొని వారును వెను తిరిగిపోయిరి. శ్రీనృసింహ సరస్వతి ఇట్లనెను. **"నేను గాణ్గాపురమునందు, నర్సోబావాడి యందు, ఔదుంబరక్షేత్రము నందు సదా గుప్తరూపమున నివసింతును"** కావున ఏ భక్తుడైనను శ్రద్ధ, భక్తి మరియు నమ్మకముతో ఆ మూడు పుణ్యక్షేత్రములలో చూడగా స్వామి దర్శనము తప్పక కలుగును. స్వామి వాగ్దానము ఇచ్చినచో తప్పక నెరవేర్చును. **అంబికకు వాగ్దానము ఇచ్చినందుకే కదా శ్రీదత్తుడగు శ్రీపాదుడు రెండవ అవతారము ఎత్తవలసి వచ్చినది. వాగ్దానము నిలబెట్టువాడే దేవుడు. వాగ్దానము దగా చేయువాడే మానవుడు.**

**3. మాణిక్యప్రభువు – జననము :** శ్రీదత్తుని అవతారములలో మూడవది శ్రీమాణిక్యప్రభువు. వీరి దివ్యలీలలను తెలిసికొనవలెనన్న 'శ్రీమాణిక్యప్రభు చరిత్ర' అనే గ్రంథము చదివినచో తెలిసికొనగలరు. క్రీ.శ.1817వ సం॥ డిసెంబరు 22వ తేదీన కర్ణాటక రాష్ట్రంలో కళ్యాణ్ అను గ్రామములో మనోహర్ నాయక్, బయాదేవి అను దంపతులకు జన్మించిరి. ఆ దంపతులు దత్త భగవానుని భక్తులు. శ్రీదత్తుడు ఆ దంపతులకు స్వప్న దర్శనమిచ్చి వరము కోరుకొనమగనా వారు, **"నీ అంశతో మాకు పుత్రుడు కావలెను"** అని కోరగా శ్రీదత్తుడు అభయము నొసంగెను. ఆ స్వప్న ఫలితమే మాణిక్యప్రభువు జన్మకు కారణమయ్యెను. శ్రీదత్తుడు ఎంతటి కరుణ, దయాసాగరుడో తన భక్తులగు అప్పలరాజు సుమతి కొరకు శ్రీపాదునిగా అంబిక కోరిక నెరవేర్చుటకు శ్రీనృసింహసరస్వతిగా మరియు మనోహర్‌నాయక్, బయాదేవి దంపతులకు స్వప్నములో కోరిన కోర్కెను తీర్చుటకై జాగృతిలో మాణిక్య ప్రభువుగా అవతరించిన కరుణామూర్తి శ్రీదత్తభగవానుడు. పుట్టినప్పటి నుండి మాణిక్యమువలె మెరియు చుండెడివాడు. కావుననే అతనికి మాణిక్యప్రభువు అని నామకరణము చేసిరి.

**సమాధి :** మార్గశిరశుద్ధ విదియనాడు ప్రభువు తన శిష్యులను పిలిచి ఈ ఏకాదశినాడు "నేను ఈ అవతారమును చాలించెదనని నన్ను గురించి చింతించవద్దని దత్తజయంతి పూర్తయిన పిదప నా నిర్యాణము తెలువవలెనని అంతవరకు రహస్యముగానే ఉండెవలనని శిష్యులతో చెప్పెను. మాణిక్య ప్రభు సమాధి స్థలమున ప్రవేశించినారు. శ్రీమాణిక్య ప్రభువు తన భక్తులను ఆశీర్వదించుటకు తన సమాధి నుండియే వచ్చే జనులను చూస్తూ దివ్య ఆశీస్సులను ఈనాటికి ఇస్తున్నారు.

## అధ్యాయము-5

## శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోట స్వామి చరిత్ర ప్రారంభము

కలియుగంలో శ్రీదత్తుని నాల్గవ అవతారం – శ్రీస్వామిసమర్థ (అక్కల్‌కోటలో)

**సమాధి –** శ్రీ స్వామ సమర్థులు చూపిన మహిమాన్వితములు వారి లీలలను చూసి వేలాది వేలజనులు అక్కల్‌కోటకు వచ్చి పోవుచుండెడివారు. శ్రీస్వామి సమర్థులు తమ సమాధి చెందుటకు ముందు కొన్ని సూచనలు వారి భక్తులకు చూపెను. అవి ఏమనగా –

1. ఆఖరి సమయములో వంటిపైన కంబళిని కప్పుకున్నారు.

2. వారి పడుకునే పరుపును చెట్టుకొమ్మపై వ్రేలాడదీసినారు.

3. హారతి ఇచ్చు సమయమున ఆ హారతిని బోర్లించేవారు.

4. బాలప్ప అనే భక్తునితో ఇట్లనెను, “నేను చాలా దూరపు ప్రయాణం చేయదలచుచున్నాను. నాతో రాగలవా?”

5. 500 పిడకలను తెప్పించి శివలింగము చుట్టును మరియు శివలింగముపైన కప్పి వాటికి నిప్పంటించినారు. ఆ మంటల్లో పళ్ళు, బియ్యము, నెయ్యి మొదలగునవి వేశారు. ఆ కాలిన బూడిద తొలగించగా శివలింగము దివ్యతేజస్సుతోనే వున్నది.

6. స్వామి భక్తుడగు తాత్యా సుబేదార్ ఇంటిలోని తులసిని కోనేరులో పారవేసినారు.

7. శివునిపై పాట పాడుచు భజన చేసినారు.

8. రాళ్ళతో సమాధులను కట్టుచుండెడివారు.

9. మామూలు జ్వరము వచ్చి తిరిగి రెండురోజుల్లోనే కోలుకున్నారు. మళ్ళీ తరువాత తీవ్రమైన జ్వరం వచ్చింది.

10. శ్రీ స్వామి వారికి ఎంతో ఇష్టమైన వటవృక్షం వద్దకు తీసుకెళ్ళమని కోరారు.

11. కనీసం రెండు ముద్దల ఆహారమైనా తీసుకోలేదు.

12. “నేను నా స్థానమునకు పోవాలి” అనేవారు.

13. ఏ మందులూ వాడనూ లేదు. భక్తులు బలవంతము చేయగా ఒకే ఒకసారి మందు మ్రింగి వాంతు చేసికొనినారు.

14. తమ ప్రియమైన భక్తుడు గోపాలుడు అనే మంగలిని పిలిపించుకొని క్షౌరము చేయించుకొని

స్నానము చేసినారు.

15. శ్రీపాద భట్ అను భక్తుడిని సాధన చేయమని మఱ్ఱిచెట్టు క్రింద సాధన చేయమని చెప్పిరి.

16. గణపతిరావు అను మరియొక భక్తుని దేవాలయమే తన ఇల్లుగా భావించమన్నారు.

17. తమ ప్రియతమ భక్తుడు బాలప్పను అక్కల్‌కోటలోనే వుండమని ఆజ్ఞాపించారు.

18. ఒక శాలువ దానం చేసినారు.

19. భగవద్గీతలోని 9వ అధ్యాయంలోని 22వ శ్లోకం చెప్పించిరి

(అనన్యాశ్చింతయంతో మాం యే జనా పర్యుపాసతే.................)

20. బాలప్ప అను భక్తుడు స్వామికి తాంబూలము సమర్పించాడు.

21. ఆవు దూడలను విడిచిపెట్టమన్నారు.

22. చెట్టులో కలసిపోవాలి అని అన్నారు.

23. ఎవరు బాధపడవద్దని అంతటా తానున్నాని భక్తులు పిలిస్తే పలుకుతానని చెప్తూ పద్మాసనమున కూర్చొని ఉన్న శ్రీస్వామి సమర్థ కనులు మూసినారు.

24. వారినోట నుండి దివ్యవెలుగు కనిపించెను.

25. 1878వ సం॥ మంగళవారము సాయంత్రం 4 గం॥లకు కలియుగమున శ్రీదత్తుని నాల్గవ అవతారమగు శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటస్వామి సమాధి చెందినారు.

శ్రీస్వామి సమర్థ సమాధి చెందిన పిదప భక్తులు దుఃఖములో మునిగినారు. ఆ వార్త నలుమూలలా ప్రాకి వేల భక్తులు స్వామిని దర్శించుటకు వచ్చినారు. శ్రీస్వామి వెళ్ళిన తరువాత ఇక దిక్కెవరని ఎందరో ఏడ్చినారు. శ్రీస్వామి అంతిమ యాత్రను ఎంతో ఘనముగా సాగించినారు. శ్రీస్వామి ముఖ్యభక్తుడగు చోళప్ప ఇంటి వద్ద చేరి, చోళప్ప కోరిక ప్రకారము మరియు శ్రీస్వామి సమర్థ అనుమతి ప్రకారము శ్రీస్వామిని చోళప్ప ఇంటిలో సమాధి చేసినారు. శ్రీస్వామి సమర్థ ముందుగానే వారు తన దేహమును వదలివేయుచున్నారని సూచించుట గమనించినచో ఎంతటి మహిమాన్వితులో మరి.

అంత ఘనంగా శ్రీస్వామిని అంతిమ యాత్రకు పాల్గొనిన భక్తులను మరియు ఆ భక్తుల దుః ఖమును చూచినచో శ్రీస్వామి సమర్థ అసలు ఎవరు? వారు పేరు మరియు తల్లితండ్రులు ఎక్కడి నుండి వచ్చారు? ఏ లీలలు ప్రదర్శించారు? అన్న దానికి శ్రీ స్వామి జననము నుండి వారు ప్రదర్శించిన లీలలు, మహిమలు రాబోవు అధ్యాయాలనుండి పరిశీలిద్దాం.

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము-6

### స్వామి పుట్టుపూర్వోత్తరాలు (ఎలా దర్శనమిచ్చారు! - వివరములు)

పై అధ్యాయములో శ్రీస్వామిసమర్థ అక్కల్‌కోట స్వామి యొక్క సమాధి ఎట్లు చెందినారో చెప్పబడినది. మొట్టమొదటే స్వామి నిర్యాణముతో మొదలుపెట్టుటకు గల కారణము శ్రీస్వామి సమర్థ లీలలను మొదలు చెప్తే ఆ లీలలు వినిన తరువాత శ్రీస్వామి సమర్థ నిర్యాణము గూర్చి వ్రాసినచో వారి లీలలను, మహత్యము వారి చర్యలు జీర్ణించుకొనిన తరువాత స్వామి నిర్యాణము చదివిన బాధ కలుగును. తట్టుకొనుటకు కష్టమగును. కనుకనే మొదటి నిర్యాణము చెప్పబడినది.

క్రీ.శ. 1856వ సం॥ ఆశ్వయుజ మాసము, బుధవారమునాడు శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటయందు దర్శనమిచ్చారు. శ్రీస్వామిని చూచిన తరువాత వారి పుట్టుపూర్వోత్తరాలు, రాకను గురించి అడిగిన వారికి శ్రీస్వామి సమర్థ పలు రకములైన జవాబు ఇచ్చేవారు. అందులో కొన్ని ముఖ్యమైనవి.

1. "నాది దత్త నగరము. నా తల్లితండ్రులు మఱ్ఱిచెట్టు.
2. "మా కులము చెప్పులు కుట్టే కులము"
3. "కదళీవనము నుండి వచ్చినాను"
4. "నా పేరు నరసింహభాను"
5. "నేను బ్రాహ్మణుడను"
6. "నాది కాశ్యపగోత్రం"
7. "నాది మీనరాశి"

మరొక సందర్భమున స్వామి యొక్క కులగోత్రములను ఒకరు అడుగగా **"నా చేత తన్నులు తిందువు"** అని అన్నారు.

మొట్టమొదట శ్రీస్వామి సమర్థ ఖండోబా దేవాలయములో (అక్కల్‌కోటలో) కనపడ్డారు.

దత్తాత్రేయుని తదుపరి అవతారమైన అనగా ఐదవ అవతారమైన శ్రీశిరిడీ సాయిబాబా కూడా మొట్టమొదట శిరిడీ అను గ్రామమున ఖండోబా మందిరమున దర్శనమివ్వగా భక్త మహాళ్సాపతి ఆ ఫకీరును చూసి "ఆవో సాయీ..." అని పిలువగా అప్పటినుండి ఆ ఫకీరుకి సాయి అనే నామముతో యావత్ ప్రపంచములోని జనులు పిలువసాగిరి. ఆ ఫకీరుకు కూడా కులమతములు, పేరు, తల్లితండ్రులు, ఎక్కడినుండి వచ్చారో తెలియదు. కావున శ్రీస్వామి సమర్థ, శిరిడీ సాయిబాబా ఒక్కరే. ఇద్దరూ దత్తుని రూపాలే.

మొట్టమొదట శ్రీస్వామి సమర్ధ అక్కల్‌కోటలో పశువుల కాపరులకు స్వామి దర్శనమిచ్చారు. వారి వద్ద భిక్షను స్వీకరించి అరుగుపై పడుకుని మరుసటి ఉదయమున చింతోపంత్ తోల్ అనే భక్తునికి దర్శనమిచ్చారు. ఈ చింతోపంత్ తోల్ దీని కన్నా మొదట షోలాపూర్‌లో శ్రీస్వామి సమర్థ దర్శనము పొందిన మహనీయుడు. వారి కోరికపై వారి ఇంట దిగినారు. మహీమతి రామచంద్ర అనునతను శ్రీస్వామి సమర్థను దర్శించి ఇట్లనెను. **"వారు మాణిక్య ప్రభువు శ్రీస్వామి వారిని మాణిక్యనగర్‌లో దర్శించినప్పుడు శ్రీమాణిక్యప్రభువు నేను అక్కల్‌కోటకు వచ్చెదను"** అని చెప్పిరి. దీనినిబట్టి శ్రీదత్తుని మూడవ అవతరామగు మాణిక్యప్రభువుయే శ్రీస్వామి సమర్థ మరియు శ్రీ స్వామిసమర్థయే శ్రీ సాయిబాబా. శ్రీస్వామిసమర్థ ఒక్కొక్క భక్తుని ఇంట కాలుమోపి అక్కల్‌కోట గ్రామమును పావనము చేశినారు. ఒకసారి ఖండోబా మందిరము వద్దనున్న శ్రీస్వామి సమర్థను మహ్మమద్ ఖాన్ అను మహమ్మదీయుడు పరీక్షించదలచి ఖాళీ చిలుమును శ్రీస్వామికి ఇచ్చి తాగమనిరి. శ్రీస్వామి గంజాయి లేకుండానే పొగ పీల్చడము, నోటినుండి పొగరావటము మొదలిడినది. శ్రీస్వామి సిద్ధపురుషుడు కాక మరెవరు. ఇక్కడ కూడా గమనించవలసిన విషయం శ్రీమాణిక్య ప్రభు, శ్రీస్వామి సమర్థ, శ్రీ షిరిడీ సాయిబాబా మరియు శ్రీ గజానన మహారాజ్ హుక్కా పీల్చేవారు. వారందరు ఒక్కరే. శ్రీదత్తుని రూపాలు. శ్రీస్వామి సమర్థ గంజాయి లేకుండా పొగపీల్చి నోటినుండి వదలితే శ్రీషిరిడీ సాయిబాబా నూనె లేకుండా నీళ్ళతో దీపాలు వెలిగించారు. మహమ్మద్ ఖాన్ తాను చూసిన విచిత్ర చర్యను చోళప్ప అనే బ్రాహ్మణుడికి చెప్పగా ఆనాటినుండి చోళప్ప శ్రీస్వామికి మహాభక్తుడు అయినాడు.

జై శ్రీసద్గురు సమర్థ

## అధ్యాయము-7

## చోళప్ప పూర్వజన్మవృత్తాంతము

శ్రీస్వామిసమర్థ మొట్టమొదటసారిగా చోళప్పను చూసినప్పుడు వారి చేయి చోళప్పను తగులగనే చోళప్పకు పూర్వజన్మ గుర్తుకు వచ్చింది. శ్రీస్వామి చోళప్పతో, **"మనది జన్మజన్మల బంధం"** అని అన్నారు. శిరిడీ సాయిబాబా కూడా తన ప్రియభక్తుడైన శ్యామాతో, **"72 జన్మల నుండి నిన్నెరుగుదును"** అని అన్నారు. శ్రీస్వామి సమర్థ పూర్వజన్మలో చోళప్ప, రామచంద్ర శరాబ్ అనే పేరుతో భక్తునిగా ఉండి శ్రీస్వామి సమర్థను సేవించినారని గుర్తుకు చేసినారు. శ్రీస్వామి సమర్థ చేయి చోళప్పకు తగిలిన మరుక్షణమే చోళప్పకు అంతా గుర్తుకు వచ్చింది. శ్రీస్వామి చేయి తొలగగానే మళ్ళీ చోళప్ప మాములు స్థితికి వచ్చినాడు. ఆనాటి నుండి చోళప్ప స్వామికి భక్తుడై తన గృహమునకు ఆహ్వానించి స్వామికి పాదపూజతో హారాతులతోను సేవించుకునేవాడు. శ్రీస్వామి సమర్థ చోళప్ప గృహములో ఆహారమును స్వీకరించే మునుపు భగవంతునికి అర్పించమని బోధ చేసినారు. భగవద్గీతలో 'బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః.....' అనే శ్లోకము నందు శ్రీకృష్ణపరమాత్ముడు ఏదైనను స్వీకరించే ముందు తనకు అర్పించమని చెప్పారు. శ్రీస్వామి సమర్థ మహమ్మదీయులను, బ్రాహ్మణుడగు చోళప్ప ఇంటిలో పిలిచి వారితో కలిసి భోజనము చేసేవారు. స్వామివారికి కులమత భేదములు లేవని హిందూ మహమ్మదీయులు ఒక్కరే అని నిరూపించినారు. శ్రీసాయిబాబా ద్వారకామాయిలో హిందువులకు, ముస్లింలకు ప్రవేశ అర్హత కలిగించుటయే కాక వారిరువురును కలిపి భోజనము వడ్డించేవారు శ్రీసాయి. వారికి కులమత భేదములు లేవు. శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటలో చోళప్ప గృహములోనే ఉండేవారు. శ్రీస్వామి సమర్థ గురించి చుట్టు ప్రక్కల గ్రామములో ప్రజలందిరికి తెలిసి శ్రీస్వామిని దర్శించుటకు చోళప్ప గృహానికి వచ్చి పోవుచుండెడివారు. ప్రతిరోజు హారతు లిచ్చేవారు. శ్రీస్వామిని శివస్వరూపునిగా తలచి అభిషేకము చేసేవారు కొందరు. నుదుటిపైన చందనముతో బొట్టు పెట్టేవారు. వారి భుజములపై, గుండెలపై నామమును పెట్టేవారు. బేసిన్ (సెనగపిండి) లడ్డు నైవేద్యముగా పెట్టేవారు. చోళప్ప సాక్షాత్తు శ్రీదత్తుని తన ఇంటిలో ఉంచుకొని సేవ చేస్తూ కాలం గడిపిన ధన్యజీవి! ఎంతో పుణ్యాత్ముడో కదా!

జై శ్రీసద్గురు సమర్థ

## అధ్యాయము-8

## అక్కల్‌కోట రాకమునుపు భారతదేశమంతట శ్రీస్వామి సమర్థుల పర్యటన – లీలలు

శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోట రాకమునుపు భారతదేశములో అనేక ప్రదేశములలో పర్యటించారు. హిమాలయాలలో శ్రీస్వామి సమర్థ నేపాల్ దగ్గర తిరుగుచున్న రోజులలో చైనీయ దంపతులు శ్రీస్వామి సమర్థను దర్శించారు. మతిలేనివానిగా తలచి వారి ఎదుటనే కామక్రీడలు చేయసాగారు. శ్రీస్వామి, వారి లింగములు (చైనీ దంపతులు) మారిపోయే విధముగా చేసినారు. అంతట ఆ దంపతులు శ్రీస్వామి మహిమను ఎరిగి క్షమాపణ కోరినారట. ఇలాంటి చమత్కారమే శ్రీస్వామి సమర్థ మహారాష్ట్రలో అంబాజోగై పర్వతప్రాంతములో చూపారు. అది ఏమనగా ఒక యాదవ బాలిక స్వామిని అను నిత్యం దర్శించేది. ఆ బాలిక తల్లి ఒక షావుకారుకి సంతానము లేదని గ్రహించి ఆ బాలికకు పురుషవేషము వేసి దత్తత ఇచ్చెను. ఆ షావుకారు తన దత్త పుత్రునికి వివాహము చేయ నిశ్చయించెను. అప్పుడా పిల్ల జరిగిన విషయము బయటపెట్టగా, ఆ పిల్లను చంపించమని ఆ షావుగారు తన సేవకులకు ఆజ్ఞాపించాడు. అంత ఆ పిల్ల శ్రీస్వామి సమర్థను వేడుకొనగా శ్రీస్వామి, **"ఈ బాలుని ఎందుకు హింసిస్తున్నారు?"** అని షావుకారుని అడిగారట. అంతేగాక, "ఈ బాలుని వివాహము చేయ"మని ఆజ్ఞాపించినారట. షావుకారు అక్కడకు రాగా ఆ యాదవబాలిక బాలునిగా మారిపోయిందట. షావుకారు ఆశ్చర్యపోయినాడు. ఇటువంటి శక్తులు గొప్ప మహర్షులకు తప్ప ఎవ్వరికి సాధ్యము కాదు.

హిమాలయాలలో శ్రీస్వామి సమర్థ ఒక గుహ దగ్గర మహర్షులతో చర్చించుచుండగా రెండు పెద్దపులులు ఆ గుహద్వారము దగ్గరకు వచ్చి నిలబడగా శ్రీస్వామి సమర్థ వారి రాకకు గల కారణము అడుగగా ఆ పెద్దపులులు వారికి ఈ జన్మలేల కలిగినవో శ్రీస్వామిని వేడుకొనగా శ్రీస్వామి, "మీరు పూర్వజన్మలో జ్ఞానులైనప్పటికి అహంకారముతో సాధువులను, బ్రాహ్మణులను హింసించుట వలన ఈ విధముగా శిక్షించబడిరి" అని స్వామి నుడివిరి. శ్రీస్వామి సమర్థ పూర్వజన్మలే కాకుండా ఆ పెద్దపులులకు రాబోవు జన్మలో వారిరువురు బ్రాహ్మణులుగా పుట్టి జ్ఞానులై భక్తితో సేవలు చేస్తూ జయించగలరని దీవించిరి.

హరిద్వార్‌లో శ్రీస్వామి సమర్థ ఉన్నప్పుడు ఇద్దరు బ్రాహ్మణులు అహంకారముతో ఎంతో మందిని బాధపెడుతూ దొంగతనము చేస్తూ చివరికి ప్రాణాలు కూడా తీసే పనులకు వెనుకాడక చలామణి అయ్యేవారు. వారి పాపకృత్యములకు ఎవరు ఆపలేకపోయినారు. కాని భగవంతుడు వారికి కుష్టు వ్యాధిని కలిగించి శిక్షించినాడు. వారి పూర్వజన్మలో పుణ్యం చేసిన ఫలితముగా శ్రీస్వామి సమర్థను దర్శించి సేవించుకొని వారి పాపములను క్షమింపమని వేడగా శ్రీస్వామి సమర్థ వారిరువురిని స్పర్శించగానే వారికున్న కుష్టురోగనివృత్తియై, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారిపోయినారు!

హరిద్వార్‌లోనే శ్రీస్వామి సమర్థ ఉన్న రోజులలో ఒక బ్రాహ్మణుడు గర్వముతో స్వామి సమర్థను చూసి శ్రీస్వామి యొక్క వివరములను ఎక్కడనుండి వచ్చినారో అని అడుగగా శ్రీస్వామి సమర్థ ఆ బ్రాహ్మణుడి పూర్వజన్మలో చేసిన పాపము చిట్టా బయటకు తీసి చెప్పినారు. అతను పూర్వజన్మలో మద్యపానమునకు బానిసై, స్త్రీవామోహపీడితుడై అనేక ఘోరపాపకృత్యములను సయితం వెనుకాడక చేసినవాడై, తత్ఫలితముగా హస్తినాపుర రాజు అతని ముక్కు కోసి మరియు తలను పగులకొట్టినారని చెప్పి, ఆ పై జన్మలో కొన్ని మంచి పనుల ఫలితముగా ఈ జన్మలో బ్రాహ్మణుడైనాడని శ్రీస్వామి చెప్పినారు. శ్రీస్వామి చెప్పినవి విని బ్రాహ్మణుడు ఆశ్చర్యచకితుడై చూస్తూ ఉండగా శ్రీస్వామి ఇట్లనినారు. **"నిన్న రాత్రి నీవు ఒక ఆవును చంపినావు"** అని అన్నారు. శ్రీస్వామి అతని ఇంటికి వెళ్ళి చూడగా చచ్చిన ఆవు అక్కడ పడియుండుట గమనించినారు. ఆ బ్రాహ్మణుడు శ్రీస్వామి కాళ్ళపై పడి క్షమాపణ కోరగా శ్రీస్వామి ఇట్లనినారు. **"నీవు నిజముగా చేసిన తప్పు ఒప్పుకొని పశ్చాత్తాపము పడినయెడల ఈ నీళ్ళు మృతిచెందిన గోమాతపై చల్లుము. అది బ్రతుకగలదు"** అని ఆజ్ఞాపించినారు. ఆ బ్రాహ్మణుడు స్వామివారి ఆజ్ఞానుసారము చేయగా ఆ మృతిచెందిన ఆవు నిదురనుండి మేల్కొనిదానిలవె లేచి నిలబడింది.

ఒక బ్రాహ్మణుడు శ్రీస్వామి సమర్థను తన యింటికి విందుకై ఆహ్వానించగా శ్రీస్వామి ఆ బ్రాహ్మణుని తల్లితండ్రులను గూర్చి అడుగగా ఆ బ్రాహ్మణుడు వారి తల్లితండ్రులు మరణించినారని చెప్పెను. శ్రీస్వామి ఇట్లనిరి. **"నీ తండ్రి నీ కొడుకు ఊయాలలో ఉన్నాడు"** చూడమనెను. ఆ బ్రాహ్మణుడు వెళ్లి చూడగా ఊయలలో తన కొడుకు ప్రక్కనే ఒక పాము ఉండుట గమనించెను. ఆ బ్రాహ్మణుడు కఱ్ఱతో చంపబోగా శ్రీస్వామి ఆ చర్యను ఆపి పామును చేతితో పట్టుకుని ఇట్లనెను. **"నీ కొడుకు నిన్నే చంపుటకు వస్తున్నాడు"** అని అనెను. అప్పుడు పాము "స్వామి! నన్ను అనుగ్రహించి కాపాడుము. ఈ జన్మనుండి విముక్తి చేయు"మనెను. అప్పుడు శ్రీస్వామి "వెళ్లి గుహలో దాగుకొనుము. మరు జన్మలో మంచి యోగికుటుంబములో పుట్టెద"వనెను. ఒకసారి శ్రీస్వామి సమర్థ గుజరాత్‌లోని ద్వారకకు వచ్చెను. ఆ ద్వారకలో కళ్ళులేని సూరదాసు శ్రీకృష్ణభక్తుడు కృష్ణదర్శనమునకై కాంక్షించు సమయమున శ్రీస్వామి సమర్థ వారి ఆశ్రమమునకు వెళ్లి ఇట్లనెను. **"సూరదాస్ నీవు ఎవరినైతే భక్తిభావముతో దర్శించవలెనని కాంక్షిస్తున్నావో నీ ఎదుట నిలబడి వున్నాను"** అని శ్రీస్వామి వాని కళ్ళను తాకగనే సూరదాసుకి వెంటనే చూపు వచ్చెను. తన కళ్ళు తెరచి చూడగానే సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడు ఎదుట నిలబడియుండెను. సూరదాసు తృప్తిచెందిన తరువాత మళ్ళీచూడగానే శ్రీస్వామి సమర్థయే నిలబడియుండెను. శ్రీ స్వామి సమర్థ వానిని ఆశీర్వదించెను.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-9

## అక్కల్‌కోటకు రాకమునుపు శ్రీస్వామి వివిధ ప్రదేశములలో మరికొన్ని లీలలు

శ్రీస్వామి సమర్థ గుజరాత్ రాష్ట్రములో వాపీతీర్థమున చేరి ఆ పవిత్ర తీర్థములో స్నానము చేయదలచెను. కాని అక్కడి నిబంధన ప్రకారము సరస్సులో స్నానము చేయువారి వద్ద రొక్కము చెల్లింపవలెను. శ్రీస్వామిని కూడా రొక్కము అడిగిరి. శ్రీస్వామి ఒక చమత్కారము చూపెను. అక్కడి ఉన్నవారందరూ చూచుచుండగా గాలిలో తేలి ఆ పుణ్యతీర్థము ఒడ్డున కూర్చొనెను. అక్కడి వారందరు ఈ దృశ్యమును చూసి ఆశ్చర్యపడిరి. శ్రీస్వామి సిద్ధపురుషులని గ్రహించెను.

రామేశ్వరంలో కూడా శ్రీస్వామి సమర్థ కోటితీర్థములో ఒక చమత్కారమును చూపెను. ఆ కోటి తీర్థములో స్నానము చేసినచో పాపములు తొలగునని అనేకమంది దూరప్రదేశముల నుండి వచ్చి ఆ నదిలో స్నానము చేసేవారు. ఆ కోటి తీర్థములో కూడా డబ్బు చెల్లించిన వారినే స్నానము చేయుటకు అనుమతించేవారు. శ్రీస్వామి సమర్థ కోటితీర్థములో స్నానము చేయుటకు వెళ్ళగా దక్షిణ ఇమ్మని బ్రాహ్మణులు అడిగి డబ్బు చెల్లించనిచో అనుమతి లేదని శ్రీస్వామిని అడ్డగించిరి. శ్రీస్వామి సమర్థ డబ్బులు చెల్లించుటకు నిరాకరించిరి మరియు ఇట్లనెను, **"ఈ కోటితీర్థములో ఉన్న మహిమ మరియు పవిత్రత పోవుగాక"** అని పలికి వెళ్ళిపోయిరి. మరుక్షణమే ఆ నీరు అంతా దుర్వాసనతో నిండి పురుగులతో మారిపోయినది. జనులందరు శ్రీస్వామిని క్షమింపమని వేడుకొనగా తిరిగి శ్రీస్వామి ఆ తీర్థానికి పవిత్రతను కలిగించారు. శ్రీస్వామిని ఒక అవధూతగా గుర్తించి సిద్ధపురుషుడని భావించి పూజలు చేసిరి.

శ్రీస్వామి పండరీపురము దగ్గర భీమానది వద్దకు వచ్చిరి. ఆ సమయములో ఆ నది పొంగుతూ పొర్లుచున్నది. శ్రీస్వామి ఆ నది దగ్గర ఉన్న జనులు చూచుచుండగా వరదలతో పొంగుతున్న ఆ భీమానదిపై శ్రీస్వామి సమర్థ నడుచుకుంటూ వెళ్ళి పండరీపురం చేరినారు.

ఈ పై మూడు సంఘటనలలో శ్రీస్వామి సమర్థ మొదట మాములుగానే ఒక సామాన్యునివలె ప్రవర్తించి, అందరిలా పుణ్యనదులలో స్నానము చేయుటకు యత్నించగా జనులు రొక్కము చెల్లించనిదే వీలుపడదని అడ్డగించుట వలన శ్రీ దత్త అవతారమగు శ్రీస్వామి సమర్థ చమత్కారము చూపవలసి వచ్చెను. లేనిచో అవధూతలను గుర్తించుట చాలా కష్టము. శ్రీదత్తుడు ఒక సామాన్యునివలె తిరుగును. అవసరము వచ్చినప్పుడే వారు చమత్కారము చూపి తన అవతారమును ఋజువు చేయును.

బరోడాలో శ్రీస్వామి సమర్థ మరియొక అద్భుతలీలను చూపెను. బరోడాకు చెందిన బువా అనునతడు మరికొందరితో ఒరిస్సాలో గల జగన్నాథ పూరీకి వెళ్లిరి. అక్కడి వారందరు అనారోగ్యముతో మరియు

జ్వరములతో బాధపడుచుండిరి. ఆ సమయములో వారు బయటకు వెళ్లి ఆహారమును తెచ్చుకొనుటకు కూడా శక్తి లేక ఉన్న సమయాన శ్రీస్వామి సమర్థ బువాకు దర్శనమిచ్చిరి. బువా శ్రీస్వామి సమర్థని చూడగానే ఎక్కడినుండి వచ్చినారని. ఎక్కడ ఉండెదరని అడుగగా శ్రీస్వామి **"అన్నిచోట్ల నేనే అంతటా నేనుండెద"**నని అక్కడి నుండి వెళ్ళిపోయిరి. బువా మరియు అతనితో వచ్చిన యాత్రికులు ఈ సంఘటన చూసి ఆశ్చర్యచకితులైరి. మరుక్షణమే వారికి ఎవరో ఒకరు వచ్చి ఆహారమును సరఫరా చేసి వెళ్లిరి. ఆ ఆహారము తినిన తరువాత వారు ఆరోగ్యవంతులై సంతోషముతో తిరుగుప్రయాణము చేసిరి.

మరియొకసారి శ్రీస్వామి సమర్థ హనుమాన్ దారి తీర్థమునకు చేరిరి. అక్కడ ఉన్న సాధువులలో ఒకతనికి రెండు కాళ్ళు పుట్టినప్పటినుండి లేక బాధపడుచుండిరి. శ్రీస్వామి సమర్థను చూడగానే అతను శ్రీస్వామి సామాన్యులు కారని సాక్షాత్తు దత్త భగవంతుడే అని గ్రహించి ముందుకు వెళ్లి పాదనమస్కారము చేయదలచెను. కాని అది అసంభవమని తలచిన క్షణమునే శ్రీస్వామి సమర్థ దూరము నుండి చూచుచు ఇట్లనెను. **"నమ్మకముతో నీ కనులను మూసుకొని నీ తలన ఎటుప్రక్క తిప్పకుండ లేచి నిలబడుటకు ప్రయత్నించుము"** అని అనెను. అతను శ్రీదత్తుని తలచి అట్లే చేయగా సునాయాసముగా నిలబడుటయే కాక నడుచుటకు వెళ్లి శ్రీస్వామి పాదముల కడ చేరినాడు

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-10

### శ్రీస్వామిసమర్థ మంగలవేదాకు చేరుట - శ్రీ నృసింహసరస్వతి, శ్రీస్వామి సమర్థ ఒక్కరే

1838వ సం॥లో శ్రీస్వామి సమర్థ పండరీపురం దగ్గరగా నున్న మంగళవేడా అను గ్రామమునకు చేరినారు. అది షోలాపూర్ జిల్లాకు చెందినది. సుమారు 12 సం॥లు అక్కడే వుండి తమ లీలలను చూపినారు. మొదట స్వామిని ఎవ్వరూ గుర్తించలేదు. వారిని చూసిన ఆ గ్రామప్రజలు ఒక పిచ్చివాడనుకొనిరి. స్వామి ఆహారము ఎవరిని అడుగలేదు. ఎవరేమి ఇస్తే దానిని తినేవారు. ఊరిలో దిగంబరముగా తిరిగేవారు. మట్టిలో కూర్చొనేవారు, పడుకునేవారు. ఈ లక్షణములన్నీ అవధూతకు కలిగి వుండును. వారి చేష్టలు గుర్తించుట బహుకష్టము. మంగళవేడాలో మొట్టమొదటగా శ్రీస్వామిని గుర్తించిన వారు బాలకృష్ణ బువా. అతను శ్రీస్వామిని సేవిస్తూ పూజించేవాడు. శ్రీస్వామి సమర్థ ఆజానుబాహురూపములో తన చేతులను నడుముపై దాల్చి సాక్షాత్తు పాండురంగనివలె ఆ బాలకృష్ణ బువాకు దర్శనమిస్తూ ఉండేవారు.

మంగళవేడాలో కృష్ణాజీపంత్ అనే బ్రాహ్మణుడు కూడా శ్రీస్వామి సమర్థను పూజించేవాడు. అతను కటిక దరిద్రముతో బాధపడుచుండెను. ఒకసారి శ్రీస్వామి సమర్థను తన ఇంటికి ఆతిథ్యమునకై తీసుకువెళ్లాడు. ఆ దంపతులు శ్రీస్వామికి పాదపూజ చేసిరి. శ్రీస్వామిసమర్థ పాలును కోరెను. వారి ఇంట ఆవు ఉన్నను ఆ ఆవు పాలు ఇవ్వటం లేదు. స్వామి కోరిన పాలును ఏ విధముగా ఇవ్వవలెనో అన్న సమస్య ఆ దంపతులకు కలిగినది. శ్రీస్వామి సమర్థకు వారి ఇంట ఉన్న ఆవు పాలు ఇవ్వదని చెప్పగా శ్రీస్వామి సమర్థ ఆవు దగ్గరకు వెళ్లి ఇట్లనిరి, **"తల్లీ ! ఈ బ్రాహ్మణుడు నిన్ను పూజించువాడు. నీవు దయచూపి ఈ దంపతులను కరుణించ"**మని స్వామి పలికెను. మరుక్షణమే ఆ గోమాత గిన్నెడు పాలనిచ్చెను. ఆ దంపతులిరువరు ఆశ్చర్యచకితులైరి. అప్పటి నుండి వారి సమస్యలు తీరిపోయినవి. ఆ గోమాత వారికి జీవనోపాధి అయ్యెను. ఈ లీల ఆ గ్రామమునే కాక చుట్టుప్రక్కల అంతయు వ్యాపించినది. పిచ్చివాడని అనుకొన్న వారందరు శ్రీస్వామి లీలను విన్న తరువాత శ్రీస్వామి ఒక అవధూతలని గుర్తించిరి.

శ్రీదత్తుని అవతారమగు నృసింహసరస్వతి కూడా ఇదే లీలను చూపెను. ఒకసారి శ్రీనృసింహసరస్వతి ఒక బ్రాహ్మణుని ఇంట భిక్షకై వెళ్ళెను. ఆ బ్రాహ్మణుని భార్య స్వామి పాదములను కడిగి పూజించెను. శ్రీస్వామివారు భిక్షను కోరగా తన భర్తరాకకై వేచి ఉన్నానని బదులు చెప్పెను. ఎందువలనంటే తన భర్తకు ఊరిలో కేగి బిచ్చమెత్తుకుని వస్తేగాని ఆ దంపతులకు ఇల్లు గడవదు. శ్రీస్వామి ఆ బ్రాహ్మణుని యింట ఉన్న గేదెను చూపి పాలు తెమ్మనెను. అప్పుడు ఆ తల్లి ఆ గేదె గొడ్డుగేదనని పాలు ఇవ్వదని చెప్పెను. శ్రీ నృసింహసరస్వతి ఇట్లనిరి **"అబద్ధము ఏల ఆడుతున్నావు. ఈ ఇంటిలో గల గెదె యొక్క పాలను త్రాగవలెనని కాంక్షతో వచ్చినాను ఏది గేదె వద్ద కెళ్లి పాలను పితుకుము"** అని అన్నారు. చిత్రము ఆ తల్లి స్వామి మాట

ప్రకారము ఆ గొడ్డుగేదె పాలు పితుకగా గిన్నెడు పాలను ఇచ్చెను. ఆ దంపతుల ఇంటి సమస్య ఆనాటినుండి శ్రీస్వామి కృపచే తొలగిపోయెను.

శ్రీదత్తని అవతారములు అయిన శ్రీ నృసింహసరస్వతి మరియు శ్రీస్వామి సమర్థ అక్కల్ కోట మహరాజ్ ఇరువురు ఒక్కరే. గురుపరంపర వరుసగా అవతరించినప్పుడు ఒక అవతారములో చేయు లీలలు మరియొక అవతారములలో కూడా చేయుననిపై సంఘటనల ద్వారా ఋజువైనది. శ్రీదత్తుని రెండవ అవతారము అగు శ్రీనృసింహసరస్వతి మరియు నాల్గవ అవతారమగు శ్రీస్వామి సమర్థ ఒక్కరే. అందుకే శ్రీస్వామి సమర్థను పేరు అడిగినప్పుడు "నరసింహభాను" అని చెప్పినారు. శ్రీదత్తుని అవతారములు ఎన్నో కలవు. ఏ అవతారమును అయినా పూజించిన సాక్షాత్తు ఆ త్రిమూర్త్యాత్మక రూపుడైన శ్రీ దత్తుని పూజించనట్లే.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-11

## మంగళవేడాలో మరికొన్ని లీలలు - బసప్ప అనే మరొక ముఖ్య భక్తుని అనుభవం

ఒకసారి శ్రీస్వామి సమర్థ మురికి వున్న ప్రదేశములో పడుకొని యున్నారు. మంగళవేడాలో బసప్ప అనునతడు శ్రీస్వామిని చూచి మహాపురుషుడని గ్రహించినాడు. బసప్ప తన మనస్సులో ఈయన ఎవరై యుంటారని అనుకొనుచుండగా పడుకొనివున్న శ్రీస్వామి సమర్థ వెంటనే ఇట్లనినారు. **"నేను ఎవరైతే నీకెందుకు"**. తన మనస్సులోని అనుకొన్న మాటను వెంటనే గ్రహించిన శ్రీస్వామిని ఒక మహాపురుషుడని గ్రహించాడు బసప్ప. ఆ క్షణము నుండి స్వామిని సేవిస్తూ కాలు గడిపాడు. బసప్ప భార్య తన భర్త ఒక పిచ్చివాడితో తిరుగుచున్నాడని తన కాలము వృథా చేస్తున్నాడని దానివలన తన వ్యాపారము కూడా దెబ్బతినుచున్నదని తలంచినది. ఒకసారి స్వామి సమర్థను బసప్ప అనుసరిస్తూ శ్రీస్వామి నడిచే దారిలో నడువసాగెను. ఒక దట్టమైన అడవిలో చేరగా ఒక్కసారిగా కుప్పకుప్పలుగా రకరకాల పాములు దారిలో పడి యుండుట చూసిరి. బసప్ప భయముతో స్వామిని శరణువేడిరి. శ్రీస్వామి సమర్థ ఆ విషసర్పములను చూపుతూ ఇట్లనిరి, **"నీకెన్ని పాములు కావలెనో అన్నిటినీ తీసుకో. ఇంతటి అవకాశము తిరగి రాద"**నెను. బసప్ప స్వామి ఆజ్ఞను జవదాటక ఒక పెద్ద పామును మూటన కట్టుకొనెను. భుజాన వేసుకొని ఇంటికి చేరి మూటవిప్పి చూడగా ఆ మూటలో పాముకు బదులు ఒక బంగారు కడ్డీ ఉండెను. ఆ దెబ్బతో వారి ఇంటిలోని దారిద్ర్యము తొలగిపోయినది. ఈ లీల దేశమంతటా వ్యాపించినది. శ్రీదత్తుడు తన భక్తుడిని భయంకముగా పరీక్షించెదరని అనుటకు దత్తావతారరూపుడైన శ్రీస్వామి సమర్థ చూపినారు. తన భక్తుడు

తన దారిలో అనుసరిస్తూ వస్తున్న సమయములో ఒక్కసారిగా రకరకాల పాములను చూపి భయము కలిగించి ఆ భక్తుని దారి మరల్చుటకు పరీక్షించెను శ్రీస్వామి సమర్థ. ఇటువంటి సమయములోనే తాను నమ్ముకున్న గురువు సహాయమువల్ల భక్తుడు మనోధైర్యముతో నిష్ఠతో నిలబడినచో ఎటువంటి ఆపద కలుగదు. బసప్ప శ్రీస్వామి సమర్థ మాట జవదాటక చివరకు ఒక పెద్ద విషసర్పమును స్వామి ఆజ్ఞ ప్రకారము మూటకట్టినాడు. తత్ఫలితముగా శ్రీదత్తుని అనుగ్రహము పొందినాడు. శ్రీదత్తుడు పరీక్షలు ఎంతో కఠినముగా, అగోచరముగా ఉండును.

శ్రీగురుచరిత్రలోని ఒక సంఘటనను ఇక్కడ చూద్దాం. శ్రీదత్తుడు ఎంత కఠినమైన పరీక్ష చేసి తన భక్తుని కరుణించెదరో తెలుస్తుంది. విష్ణుదత్తుడనే బ్రాహ్మణుడు నిత్యకర్మలను శ్రద్ధతో నిర్వర్తిస్తూ తన ఇంటి ముందు ఉన్న మఱ్ఱి చెట్టు వద్ద తన ఇష్టదైవానికి నైవేద్యము పెట్టి ఆ పదార్థములను మఱ్ఱిచెట్టు క్రింద పెట్టి పితామహులకు, ప్రపితామహులకు భూతబలిగా ఇచ్చేవాడు. దానివల్ల ఆ మఱ్ఱిచెట్టుపై శాపగ్రస్తుడైన రాక్షసుడు ఆ నైవేద్యాన్ని ఆరగిస్తూ ఒకరోజు విష్ణుదత్తునికి ప్రత్యుపకారము చేయవలెనని ప్రత్యక్షమై వరము కోరుమనగా ఆ విష్ణుదత్తుడు తన ఇష్టదైవమైన శ్రీదత్తుని చూపమని కోరెను. ఆ రాక్షసుడు, శ్రీదత్తుడు తన మాయారూపములో భ్రమ చూపెదడని దర్శనము కోరేవారికి పరీక్ష పెట్టునని సూచించెను. విష్ణుదత్తుని ఆ రాక్షసుడు ఒక మాంసపు అంగడికి తీసుకువెళ్ళెను. ఆ అంగడిలో మాంసమును ముక్కలు ముక్కలుగా కొడుతున్న భయంకరమైన రూపము ఉన్నవాడు ఎఱ్ఱని కళ్ళతో వికృతరూపముతో ఉన్నవాడిని చూపి అతడే శ్రీదత్తప్రభువని రాక్షసుడు చెప్పెను. ఆ దృశ్యమును చూచిన తరువాత విష్ణుదత్తుడు అతను దత్తుడని నమ్మలేదు. సంకోచముతో ఉన్న సమయములోనే దత్తుడు అదృశుడయ్యెను. రాక్షసుడు విష్ణుదత్తునికి రెండవ అవకాశమిచ్చెను. ఒకచోట భయంకరమైన దృశ్యమును చూపెను. ఒక గాడిద కళేబరముపై నున్న చర్మాన్ని ఒలుస్తున్న ఒక వ్యక్తిని చూపి, రాక్షసుడు అతను శ్రీదత్తుడు అని చెప్పెను. ఆ దృశ్యమును కూడా అతడు నమ్మలేదు. శ్రీదత్తుడు అని నమ్మకము కుదరలేదు. దగ్గరకు పోగా ఆ మనిషి ఒక పెద్ద ఎముకను విష్ణుదత్తునిపైకి విసరెను. దానికి విష్ణుదత్తుడు భయపడి వెనుకకు పరుగెత్తి అవకాశమును జారవిడిచినాడు. రాక్షసుడు ముచ్చటగా మూడవ అవకాశము ఇచ్చెను. ఒకచోటకు తీసుకువెళ్లెను. అది స్మశానము. అక్కడ ఒక వ్యక్తి ఒంటినిండా రక్తము పూసుకు వచ్చి పుఱ్ఱెలను దండగా వేసుకొని చితినుండి సగము కాలిన దేహాన్ని బయటకు తీసే దృశ్యాన్ని చూసాడు. విష్ణుదత్తుడు తన భయాన్ని తొలగించుకొని ఆ వ్యక్తి పాదములపై బడి శరణువేడినాడు. ఆ వ్యక్తి విష్ణుదత్తుని ముఖముపై ఉమ్మి, చంపుతానని బెదిరించినాడు. అయినా విష్ణుదత్తుడు ఆ వ్యక్తి పాదములు పట్టి విడువలేదు. ఆ వ్యక్తి ఇట్లు అనెను. **"ఓరీ ! మూడుసార్లు ఎందుకు నావద్దకు వచ్చావు?"** అని అనగా విష్ణుదత్తుడు పైకి చూడగానే శ్రీదత్తుడు దర్శనమిచ్చెను.

పై సంఘటనను బట్టి శ్రీదత్తుడు చిత్రమైన రూపములలో, విచిత్రమైన పరీక్షలను తనను నమ్ముకున్న భక్తునికి పెట్టును. భక్తుడు నమ్మకముతో భయమును వీడి శరణువేడినచో శ్రీదత్తుడు ప్రసన్నమగునని తెలుసుకొనవలెను. కాబట్టి శ్రీ స్వామి సమర్థ సాక్షాత్తు శ్రీదత్తుని అవతారమే.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-12

## మంగళవేడాలో మరికొన్ని లీలలు

ఒకసారి శ్రీస్వామి సమర్థ మండుటెండలో మంగళవేడా గ్రామములో బాబాజీ భట్ అనే బ్రాహ్మణుని ఇంటికి వెళ్లి చల్లటి మంచితీర్థము కావలెనని అడిగెను. ఆ ఇంటావిడ వారి ఇంటి దొడ్లోగల బావి పూర్తిగా ఎండిపోయినదని చెప్పగా **శ్రీస్వామి సమర్థ ఆమె చూస్తుండగానే చిన్న పిల్లవాడిలా ఆ ఎండిపోయిన బావి ప్రక్కనే మూత్రము పోసెను.** మరుక్షణమే బావి నీటితో నిండిపోయెను. ఆ ఇంటి ఇల్లాలు ఆ నీటితోనే శ్రీస్వామి సమర్థకు పాదపూజ చేసి త్రాగుటకు నీరు కూడా ఇచ్చెను. శ్రీషిరిడీ సాయిబాబా శిరిడీలో శ్రీరామనవమి ఉత్సవము జరుపుటకు మునుపు ఆ గ్రామములో నీటి బెడద ఉండుటవలన వచ్చే జనులకు నీరు సరిపోయేదికాదు. ఆ గ్రామమంతటికి రెండు నూతులు ఉండెడివి. ఒకటి ఎండిపోయినది. రెండవదానిలో నీరు ఉప్పుగా ఉండేవి. ఆ సమస్యను తీర్చుటకు **శ్రీసాయిబాబా ఆ ఉప్పునీటిబావిలో పూవ్వులు వేయగా ఆశ్చర్యకరముగా ఉప్పునీరంతా మంచినీళ్ళగా మారిపోయనది.** గత అధ్యాయములో శ్రీస్వామి సమర్థ తన ముందు అవతారము దత్తుని రెండవ అవతారము అగు శ్రీ నృసింహసరస్వతి గొడ్డు గేదెచే పాలు ఇప్పించుట మహిమను, తన అవతారములో పాలు ఇవ్వని గోమాత చేత పాలు ఇప్పించి శ్రీస్వామి సమర్థ సాక్షాత్తు శ్రీదత్తుని అవతారమగు నృసింహ సరస్వతియే అని ఋజువుచేసెను. మరి ఈ అధ్యాయములో శ్రీస్వామి సమర్థ నీరు లేని బావి వద్ద మూత్ర విసర్జన చేసి నీరు తెప్పించి తన తదుపరి అవతారములో (అనగా దత్తుని ఐదవ అవతారములో) ఉప్పునీటిబావిలో పూవులు వేసి మంచినీరు తెప్పించి శ్రీదత్తుని అవతారమగు సాయిబాబాగా అవతరించి శ్రీసాయిబాబాయే స్వామిసమర్థగా ఋజువుచేసెను.

శ్రీస్వామి భక్తుడగు బసప్ప ఇంటి వద్ద ఒక పేద కుటుంబము ఉండేది. ఆ దంపతులకు సంతానము లేకపోవుటచే బసప్ప ఆ దంపతులను శ్రీస్వామి సమర్థ కడకు తెచ్చి వారి బాధను తెలియజేసిరి. శ్రీస్వామి సమర్థ వటవృక్షము చూపి ఆ చెట్టు యొక్క జిగురును తీసుకొని దానిలో చక్కెర కలుపుకొని ఆ పేదవాని

భార్యచేత తినిపించమని చెప్పి ఆశీర్వదించెను. స్వామి ఆజ్ఞను పాటించిన ఆ దంపతులకు కొద్దిరోజులలోనే ఆమె గర్భవతియై సంతానము కలిగినది.

మంగళవేడాలో ఒక బీదవాడు శ్రీస్వామి సమర్థను ఏమి యాచించకుండా నిస్వార్థముతో సేవించుకొను చుండెడివాడు. కొన్ని రోజుల పిదప శ్రీస్వామి వాని సేవకు సంతసించి స్వప్నదర్శనమిచ్చి తన ఇంటిలోని తులసి చెట్టువద్ద ఆ బీదవాని తండ్రి ధనము పాతిపెట్టెనని, దానిని పొంది అతని పేదరికమును శాశ్వతముగా నిర్మూలించుకొనమని ఆదేశించి స్వప్నము నందు అదృశ్యమయ్యెను. ఆ పేదవాడు మరుసటి దినమున స్వామి ఆదేశానుసారముగా తులసీబృందము వద్ద త్రవ్వి చూడగా ఎనలేని ధనము దొరికినది. అతను స్వామి లీలను తలచి ఆశ్చర్యపోయాడు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-13

## యతి పుంగవుల రాక - శ్రీస్వామి సమర్థ పాండురంగడే

మంగళవేడాలోనే శ్రీస్వామి సమర్థ ఆ గ్రామము బయట కూర్చొని ఉండగా శ్రీస్వామి సమర్థ భక్తులగు బసప్ప, కృష్ణాజీపంత్ మరియు బాలకృష్ణ బువా మరికొందరు కూర్చునియుండగా మెరుపులాగా ఇద్దరు బ్రహ్మతేజస్సుతో యతిపుంగవులు వచ్చిరి. వారిరువురు మరియు శ్రీస్వామి సమర్థతో కలిపి ఆ ముగ్గురి ప్రకాశము వర్ణించుట ఎంతో కష్టము. వారు తెలియని భాషలో మాట్లాడుకొనిరి. అక్కడ ఉన్నవారికి ఎవరికి అర్థమ కాలేదు. వారు ఆశ్చర్యచకితులై ఆ ముప్వురిని చూస్తూ ఉండిపోయిరి. ఆ ముగ్గురు వెంటనే దగ్గరలో ఉన్న కొండపైకి వెళ్ళిపోయిరి. అక్కడ ఏమి మాట్లాడుకొనినారో ఎవరికీ తెలియదు. ఆ వచ్చిన ఇద్దరు యతిపుంగవులు కూడా ఎవరో తెలియదు. కొద్ది సమయము తరువాత కొండ మీద నుండి శ్రీస్వామి సమర్థులు మాత్రమే తిరిగివచ్చిరి. మిగతా ఇద్దరు ఏమైనారో ఎవరికి తెలియదు. వారు శ్రీపాద శ్రీవల్లభులు, నృసింహ సరస్వతి అయివుండవచ్చునని భవిష్యత్‌కాలమున ధర్మములను గురించి చర్చించుటకొనుటకు మరియు శ్రీసాయినాథుని అవతారమునకు కూడా కారణమై ఉండవచ్చునని తరువాత ఎందరో అనుకొనినారు.

మంగళవేడాలోనే పాండురంగని భక్తురాలైన జనాబాయి అనే వృద్ధ స్త్రీ ఉండేది. ఆమె ప్రతి సంవత్సరము పండరీపురమునకు బయలుదేరి స్వామిని దర్శిస్తూండేది. ఒకసారి తన పండరీయాత్రలో భయంకరమైన వర్షము వలన ఆమె ప్రయాణమునకు ఆటంకము కలిగినది. ఆమె పాండురంగనిపై భక్తి చేత తన ప్రయాణము ముందుకు సాగదేమోనని చింతించుచున్న సమయమున అకస్మాత్తుగా శ్రీస్వామి

సమర్థ ప్రత్యక్షమై ఇట్లనిరి. **"ఇక్కడ నీకు పాండురంగడు కనబడుట లేదా? ఆయన పండరీపురములోనే ఉన్నారా?"** అనగానే ఆ వృద్ధ స్త్రీ కనులు నలిపి చూడగా సాక్షాత్ పాండురంగని దర్శనము కలిగినది. ఆమె ఆనందముతో పాదములపై పడి నమస్కరించినది. అప్పటినుండి జనాబాయి శ్రీస్వామివారిని పాండురంగని అవతారముగా భావించినది.

అవధూత సదానంద పరబ్రహ్మ స్వరూపిణే

విదేహదేహ రూపాయ దత్తాత్రేయ నమోస్తుతే ॥

పరబ్రహ్మము మహేశ్వరుడైన శ్రీవిష్ణువే ప్రబోధకుడు. ఆది మాధ్యాంతరహిత పరబ్రహ్మమే. అట్టి పరమ గురువగు శ్రీదత్తాత్రేయునికి ప్రణామములు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-14

## మంగళవేడా వదిలిపోవుట

శ్రీస్వామి సమర్థ ఎన్నెన్నో లీలలను మంగళవేడాలో చూపించి ఆ గ్రామ ప్రజలనే గాక చుట్టుప్రక్కల ఉన్నవారిని కూడా ఆశ్చర్యచకితులను చేసిరి. శ్రీస్వామి వారి లీలలను చూసి పొరుగు గ్రామముల నుండి కూడా జనులు తండోపతండాలుగా శ్రీస్వామి సమర్థ దర్శనానికై వచ్చి పోవుచుండెడివారు. కొందరికి వారి ఆశీస్సులతో ఆరోగ్యములను కూడా బాగుచేసిరి. ఉదాహరణకు శ్రీస్వామివారి లీలలను తెలిసికొని పొరుగూరు నుండి ఒక స్త్రీ తన కుమారునికి చూపులేని కారణమున చేత ఆ బాలునితో సహా శ్రీస్వామి కడకు వచ్చి ప్రార్థించగా శ్రీస్వామి సమర్థ పొదలలోని ఆకులను తెంపి ఆ బాలుని కండ్లకు కట్లుకట్టి ఆ పిల్లవానికి మూడురోజులు ఉపవాసముంచమని చెప్పి నాల్గవ రోజున కట్లు విప్పమని చెప్పెను ఆ తల్లి శ్రీస్వామి చెప్పినట్లు చేయగా తన కుమారునికి పోయిన చూపు వచ్చెను.

మంగళవేడాలోనే 'రామదాసు' అనునతను ఉండెడివాడు. అతని అధీనములోనే ఒక మఠము ఉండెడిది. ఆ మఠములోని శ్రీస్వామి సమర్థులు ప్రతిరోజు నిద్రపోయేవారు. ఒకసారి ఆ రామదాసు బయటకు వెళ్లవలసిన కారణము చేత శ్రీస్వామి సమర్థ మఠములో పడుకొని వున్న సమయమున ఆ మఠ తలుపులు బిగించి తాళము వేసి బయటకు వెళ్ళెను. శ్రీస్వామి సమర్థుల సంగతి మరచి ఊళ్లోనే చాలాసేపు తిరుగగా జ్ఞాపకము వచ్చిన తరువాత తన మఠం వైపు తిరిగి వచ్చుచుండగా దారిలోనే శ్రీస్వామిసమర్థ పసిబాలుడిలాగా ఆడుకొనుచుండుట చూచెను. **శ్రీదత్తుని ఎవరు బంధించగలరు?**

1850వ సం॥న శ్రీస్వామి సమర్థ మంగళవేడాలో చూపిన లీలలను చాలించి ఆ గ్రామమును వదిలి వెళ్ళుటకు సంసిద్ధుడయ్యెను. మండుటెండలో తిరుగుతూ ఆ ఊరి పొలిమేరలో పని చేసుకుంటున్న పండరీనాథ్ అనునతని వద్దకు వెళ్లి అతని చెప్పులను శ్రీస్వామిసమర్థ అడుగగా పండిరినాథ్ ఇచ్చెను. వెంటనే శ్రీస్వామి వేగముగా వెళ్ళిపోయెను. అక్కడ ఉన్న పండరీనాథ్ స్నేహితుడు ఇక చెప్పులు రావని ఇంట్లో తిట్లు తప్పవని చెప్పగా తన స్నేహితుడి మాటవిని పండరీనాథ్ దుఃఖించెను. వెంటనే శ్రీస్వామి సమర్థ వారి ముందు ప్రత్యక్షమై చెప్పులను తిరిగిఇచ్చి ఇట్లనిరి. **"మిమ్మల్ని ఎవ్వరూ తిట్టరులే!"** అని మాయమయిరి. ఇది జరిగిన కొద్ది నిముషములలోనే షోలాపూర్ దగ్గరలో శ్రీస్వామిసమర్థను చూశారని దారిన పోయే వారు చెప్పసాగారు. అప్పటినుండి శ్రీస్వామి సమర్థ తిరిగి మంగళవేడాకు రాలేదు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-15

## మొహల్ గ్రామమునకు రాక - బ్రహ్మసాక్షాత్కారము చూపుట - మరికొన్ని లీలలు

శ్రీస్వామి సమర్థ మంగళవేడాలో కొన్ని లీలలు చూపిన పిదప మొహల్ గ్రామమునకు వచ్చెను. ఆ ఊరిలోనే 'గవేస్వామి' అనే ఒక యోగి వుండేవాడు. వారు శ్రీస్వామి సమర్థను చూడగానే ఒక అవధూత అని సిద్ధపురుషుడని మహాయోగిగా గుర్తించి ఆ గవేస్వామి శ్రీస్వామి సమర్థ సన్నిధిలోనే తమ కాలాన్ని గడిపాడు. శ్రీస్వామిసమర్థ అనేక విషయాలలో గవేస్వామికి బోధించి బ్రహ్మజ్ఞానాన్ని కలిగించినారు.

అదే గ్రామములో ఒకతను శ్రీస్వామి సమర్థను దర్శించి తనకు బ్రహ్మసాక్షాత్కారము కావాలని శ్రీస్వామి సమర్థ వెంటపడినారు. శ్రీస్వామి దానిని గురించి పట్టించుకొనక తన ధోరణిలో ఉండేవారు. కాని ఆ బ్రహ్మసాక్షాత్కారము కోరిన అతను పట్టువదలక శ్రీస్వామి సమర్థను వదలక అనునిత్యం అడుగుచుండుట వలన ఒకరోజు స్వామి సమర్థ తన చూపుడు వేలుతో ఒక మూల చూపించి, **"అదిగో బ్రహ్మం. చూడు"** అని అనగా అతను స్వామి చూపించిన వైపు చూడగా అక్కడొక పెద్ద త్రాచుపాము కనిపించినది. ఆ దెబ్బతో అతను పరిగెత్తుకుపోయి చాలా రోజులు భయభ్రాంతులతో ఉండిపోయాడు. కొన్నాళ్ళకు శ్రీస్వామి సమర్థ కరుణించి అతనిని యథాస్థితికి తీసుకుని వచ్చారు. అప్పటినుండి అతను శ్రీస్వామిని బ్రహ్మసాక్షాత్కారము ఎన్నడు అడుగలేదు. బ్రహ్మసాక్షాత్కారము పొందటానికి ఎంతో ఆవశ్యకతమైన అర్హత ముందు పొందవలెను. అర్హత లేకుండా బ్రహ్మసాక్షాత్కారము కోరుట అత్యాశయే. కావుననే శ్రీస్వామి సమర్థ అతనికి బుద్ధి చెప్పవలెనని

ఉద్దేశ్యముతో అట్లు ప్రవర్తించెను.

శిరిడీ సాయిబాబా మశీదులో ఉన్నప్పుడు ఇట్లాగే ఒక ధనికుడు బాబా పాదములపై పడి బ్రహ్మమును చూపమని వేడుకొనినప్పుడు బాబా అతనిని మాటలలో దింపి మధ్యలో ఒక కుర్రవానిని పిలిచి రూ. 5॥లు బయటకు వెళ్ళి తెమ్మని అడిగెను. ఆ బ్రహ్మజ్ఞానము కోరినవాడు జేబులో రూ. 250/-లు ఉన్నను బాబా కోరిన రూ. 5॥లు తన జేబు నుండి తీసి ఇవ్వలేదు కదా పైగా బ్రహ్మమును చూపమని తొందరపెట్టెను. బాబా అతని పేరాశను పదిమందిలో బయటకు పెట్టి రూ. 5॥లు ఇవ్వలేని వాడకి బ్రహ్మమును చూపవలెనా అని మరియు బ్రహ్మజ్ఞానమును పొందుటకు కావలసిన అర్హతలన్ని విశదీకరించెను. ఈ సందర్భమును చూసిన శ్రీస్వామి సమర్థ మరియు శ్రీ షిరిడీ సాయిబాబా ఇరువురు ఒక్కరే అని మళ్ళీ ఋజువౌతున్నది. వారిరువురు సాక్షాత్తు దత్త స్వరూపులే !

అదే గ్రామమున పాండురంగ భక్తుడు ఒకతను ప్రతి సంవత్సరము పండరీపురము యాత్ర చేసేవాడు. శ్రీస్వామి సమర్థ మహిమలు విన్న తరువాత అతను శ్రీస్వామి సమర్థ దర్శనమునకై వచ్చినారు. స్వామిని చూడగానే మైమరచిపోయి విఠలునిపై ఎన్నో పాటలు పాడి ఆనందముతో తన్మయము పొందినాడు. అక్కడి భక్తులు కారణము అడుగగా శ్రీస్వామి సమర్థ స్థానములో పాండురంగని చూచినానని చెప్పినాడు. శ్రీస్వామి సమర్థ మొహల్ అను గ్రామములో షుమారు 5 సం॥లు ఉండి అక్కడి నుండి షోలాపూర్‌కి ప్రయాణమైనారు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-16

### శ్రీస్వామి సమర్థ షోలాపూర్‌కి రాక – దత్తదర్శనము చూపుట – చింతోపంత్ ఇంటికి రాక

శ్రీస్వామి సమర్థ షోలాపూర్‌లో నున్న దత్తమందిరములో తిరగసాగిరి. వారిని చూసిన జనులు పిచ్చివాడే అని అనుకొనిరి. ఆ దత్తమందిరములో ప్రతిరోజు అన్నదానం చేస్తూ ఉండేవారు. శ్రీస్వామి సమర్థ ఆ సమయానికి మొట్టమొదట విస్తరాకు వద్ద కూర్చొనెడివారు. కాని అజ్ఞానులైన జనులు శ్రీస్వామిని గుర్తించలేక లేచిపొమ్మని బెదిరించేవారు. శ్రీస్వామి సమర్థ శ్రీదత్తుడైనప్పటికి ఆ దేవాలయము తనదే అయినప్పటికి బయటపడక తన దేవాలయమును విడిచి ఆ గుడికి దగ్గరలోనున్న మఠమునకు చేరేవారు. ఆ మఠములో కూర్చొని చిన్నపిల్లవాడిలా ఆడుకునేవారు. ఒకసారి ఆ మఠములో కూర్చొనిఉన్న స్వామి సమర్థను ఒక స్త్రీ చూచి ఆ స్థానములో దత్తాత్రేయుని విగ్రహము కనబడెనని ఆ ఊరిలో జనులకు చెప్పినది. గుడిలోని జనులందరికి ఈ విషయము తెలిసి సాక్షాత్తు దత్తుని అవతారమగు శ్రీస్వామి సమర్థను భోజనము

చేయనీయకుండా తరిమివేసినందుకు బాధపడి క్షమింపమని వేడకొని స్వామి పాదములపై పడిరి. షోలాపూర్‌లోని ఏ మఠములో శ్రీస్వామి సమర్థ కూర్చొనిన స్థంబము అదే స్థానములో దత్త విగ్రహము కలనిపించుట తెలిసిన తరువాత ఈ రోజుకి కూడా ఆ స్థంభమును దత్తాత్రేయ స్థానముగా పూజ చేయబడుచున్నది.

ఆరవ అధ్యాయములో చింతోపంత్ తోల్ అనునతడు శ్రీస్వామిసమర్థను అక్కల్‌కోటలో చూసినప్పుడు "నేను ఈ స్వామిని షోలాపూర్‌లోనే మొట్టమొదట చూసినాను"అని అన్నారని చెప్పబడినది. ఈ చింతోపంత్ తోల్ శ్రీస్వామి సమర్థను మొదటిసారిగా షోలాపూర్‌లో చూసినప్పుడు అతను పిచ్చివాడు కాదని మహాత్ముడని తన మనసులో భావించుకొనెను. తత్‌క్షణమే శ్రీస్వామి సమర్థ **"నేనెవరైతే నీకేమి"** అని అరిచిరి. చింతోపంత్ తోల్ శ్రీస్వామిని మహాపురుషుడని గ్రహించి తన ఇంటికి భిక్షకై తీసుకువెళ్లిరి. శ్రీస్వామి సమర్థతోపాటు మరికొందరిని కూడా తన ఇంట భోజనానికి పిలిచిరి. అక్కడ వచ్చినవారిలో శ్రీస్వామిని వారి అవతారమును చూసి హేళనచేయగా శ్రీస్వామి వెంటనే లేచి వెళ్లిపోసాగెను. చింతోపంత్ తోల్ స్వామి పాదములపై పడి క్షమాపణ కోరగా శ్రీస్వామి **"ఎవరికైనను అన్నము పెట్టునప్పుడు ఆ వచ్చిన అతిథి నారాయణుడని భావించి ఆ నారాయణునికే అన్నము పెట్టుచున్నామని గ్రహించవలెను అదే నారాయణుడు సర్వజనులలో సమానుడే"** అని భోదించి భోజనము చేసి వెళ్ళిపోయిరి.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-17

## శ్రీదత్తుని షోడశావతారాలు

ఇప్పటివరకు పదహారు అధ్యాయములు చవిచూసినాము. శ్రీదత్తప్రభువు కలియుగములో ఎన్నో అవతారములుగా అవతరించినారని వాటిలో ముఖ్యమైనవి ఆరు అవతారములు. అవి శ్రీపాదశ్రీవల్లభ, శ్రీనృసింహసరస్వతి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటమహారాజ్, శ్రీ శిరిడీ సాయిబాబా మరియు శ్రీ గజానన్ మహారాజ్.

పైన పేర్కొనిన అధ్యాయములలో శ్రీదత్తాత్రేయుని గురించి మరియు వారి లీలలను శ్రీదత్తుడు స్వామి సమర్థగా అవతరించిన విషయములను, లీలలను కూడా చూసితిమి. అసలు శ్రీదత్తుడు 16 అవతారములుగా చెప్పబడినారు. కావుననే షోడశావతారాలు అని పేర్కొనబడినవి. చూసిన 16

అధ్యాయములలో ఒక్కొక్క అధ్యాయములో ఒక్కొక్క అవతారమును తలచుకుంటూ శ్రీస్వామి లీలలను ఆస్వాదించాము. శ్రీదత్తుని 16 అవతారములు :

1. యోగిరాజైన దత్తప్రభువు
2. అత్రివరదుడైన దత్త ప్రభువు
3. జగద్గురువైన దత్త ప్రభువు
4. కాలాగ్నిసమనుడైన దత్త ప్రభువు
5. యోగిజనవల్లభుడైన దత్త ప్రభువు
6. లీలావిశ్వంబరుడైన దత్త ప్రభువు
7. సిద్ధరాజైన దత్త ప్రభువు
8. జ్ఞానసాగరుడైన దత్త ప్రభువు
9. విశ్వంభరావదూతగా దత్త ప్రభువు
10. మాయావధూతగా దత్త ప్రభువు
11. మాయాముక్తావధూతగా దత్త ప్రభువు
12. ఆదిగురువైన దత్త ప్రభువు
13. శివరూపుడైన దత్త ప్రభువు
14. దేవదేవుడైన దత్త ప్రభువు
15. దిగంబరుడైన దత్త ప్రభువు
16. కృష్ణశ్యామ కమలనయనుడైన దత్త ప్రభువు

పై చెప్పబడిన 16 అవతారముల గురించి పఠించుట వలన సకల పాపవిముక్తులగుదురు. శ్రీదత్తుడే ఆదిగురువు. జగద్గురువు. తన 16 అవతారములలో 7వ అవతారమైన "సిద్ధరాజైన దత్త ప్రభువు" అవతారములో శ్రీదత్తుడిని ఒకరు "నీకు గురువెవరో?" అని ప్రశ్నింపగా, "నాకు గురువే లేదు" అని శ్రీదత్తుడు జవాబు చెప్పెను. కావుననే శ్రీదత్తప్రభువు ఆదిగురువు. జగద్గురువు. 8వ అవతారమగు "జ్ఞానసాగరుడైన దత్తప్రభువు"లో కూడా శ్రీదత్తుడిని ఒకరు ఇలాగే ప్రశ్నించినప్పుడు "నాకు గురువే లేదు" అని మళ్ళీ చెప్పినారు. సమస్త జీవకోటికి యావత్ జగత్తుకే ఆదిగురువు శ్రీదత్తాత్రేయులవారే.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-18

## షోలాపూర్‌లో మరికొన్ని లీలలు

శ్రీస్వామి సమర్థ షోలాపూర్‌కు వచ్చిన విషయము 16వ అధ్యాయము ద్వారా తెలుసుకున్నాము. షోలాపూర్‌లో చింతోపంత్ శ్రీస్వామివారి లీలలను చూసి వారితో అనుబంధము కలిగి ఉంటూ శ్రీస్వామిని అనునిత్యము పూజిస్తూ ఉన్నారు. ఒకసారి చింతోపంత్ తన ఇంటికి శ్రీస్వామివారిని భోజనానికి ఆహ్వానించెను. తన ఇంటిల్లపాలిది కుటుంబ సభ్యులు స్వామివారితో కలిసి భోజనము చేయదలచిరి. ఆనాడు పరీక్షగా శ్రీస్వామి సమర్థ కంచము ముట్టక కూర్చొనలేదు. చింతోపంత్ కుమారుడైన దాజీబాపంత్‌నకు ఆఫీసు సమయము అయినది. అతను శ్రీస్వామిని తలచుకుంటూ అలాగే ఉండిపోయాడు. చివరకు అందరూ కలసి 11 గం॥లకు భోజనము చేసి దాజీబాపంత్ శ్రీస్వామి వద్ద సెలవు తీసికొని ఆఫీసుకు వెళ్ళగా హాజర్ పుస్తకములో దాజీబాపంత్ యొక్క సంతకము చేసి ఉండుట చూసి ఆశ్చర్యపోయినాడు. ఇది కేవలము శ్రీస్వామి సమర్థ యొక్క లీల అని గ్రహించి సాయంకాలము ఇంటికి వచ్చిన పిదప ఆ సంఘటన తన ఇంటిల్ల పాలిది తెలిపినాడు.

షోలాపూర్‌లోని శ్రీస్వామి సమర్థ సిద్ధేశ్వరమందిరానికి వెళ్లినప్పుడు అచట కొలనులో నీరు లేకపోవుట గమనించి అక్కడ మూత్రవిసర్జన చేసినారు. అది చూసిన జనులు మరియు ఆలయ అధికారులు తిట్టసాగిరి. అంతలోనే ఆ కొలను అడుగు భాగమునుండి నీరు పొంగుతూ పైకి వచ్చినది. ఈ ఆశ్చర్యకరమైన సంఘటనను చూసిన వారందరు శ్రీస్వామి సామాన్యమైన పురుషుడు కాదని గ్రహించి వారి పాదములపై బడి నమస్కరించినారు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-19

## శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటకు చేరుట

షోలాపూర్‌లోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో శ్రీస్వామి సమర్థ భక్తుడైన చింతోపంత్ మామల్తదార్‌గా పనిచేసినాడు. వారు ఉద్యోగము నుండి విరమణ తరువాతే శ్రీస్వామి వారి దర్శనభాగ్యము కలిగినది. అనుకోకుండా చింతోపంత్‌కు అక్కల్‌కోట రాజావారి దర్బారులో ఉద్యోగమునకు రమ్మని వార్త వచ్చినది. ఇదంతా శ్రీస్వామి సమర్థ నడిపించిన ఆట. శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటకు రావలసియున్నది. కావుననే

ముందు తన భక్తుడైన చింతోపంత్‌ను అక్కడనుండి పిలపు ఇప్పించారు. చింతోపంత్ ఆ విషయాన్ని శ్రీ స్వామి సమర్థకు చెప్పి తనతో పాటు అక్కల్‌కోటకు రావలసిందిగా ప్రార్థించాడు. శ్రీస్వామి సమర్థ తరువాత వచ్చెదనని మాట ఇచ్చి చింతోపంత్‌ను మొదట అక్కల్‌కోటకు పంపించినారు. 1856వ సం॥లో చింతోపంత్ షోలాపూర్‌కు వెళ్లి స్వయముగా శ్రీస్వామిసమర్థను గుఱ్ఱము మీద అక్కల్‌కోటకు బయలుదేరగా మార్గమధ్యములో ఒక ముఖ్యమైన పనివలన కలెక్టరుగారు చింతోపంత్‌ను రమ్మని కబురుచేయగా శ్రీస్వామి సమర్థను మార్గమధ్యములో ఒక చెట్టు వద్ద వుంచి ఒక పనివానిని కూడా స్వామి వద్ద నుంచి తాను పని ముగించుకుని త్వరగా వచ్చెదనని శ్రీస్వామికి చెప్పి షోలాపూర్‌కు వెళ్ళిపోయినాడు. సాయంకాలము పని ముగించుకుని చింతోపంత్ తిరిగి వచ్చుసరికి పనివాడు తప్ప శ్రీస్వామి సమర్థ కనిపించలేదు. చింతోపంత్ ఆ పనివాడిని స్వామిని గురించి అడుగగా, "స్వామివారు ప్రొద్దున్నే వెళ్ళిపోయినా"రని జవాబు చెప్పెను. చింతోపంత్ బాధతో అక్కల్‌కోటకు చేరగా తన రోజూ అలవాటు ప్రకారము ఖండోబా దేవాలయమునకు వెళ్ళగా అక్కడ శ్రీస్వామి సమర్థ ఆడుకొనుచూ కనిపించెను. అక్కడి జనులు శ్రీస్వామిసమర్థను చూసి ఆనందిస్తూ ఉన్న సమయమున చింతోపంత్ అక్కడ ఉన్నవారితో ఇట్లనెను, **"నేను ఈ స్వామిని షోలాపూర్‌లోనే ఎరుగుదును"**.

ఈ విధముగా శ్రీస్వామివారు అనేక ప్రాంతములలో తిరిగి హిమాలయాలలో కొన్ని మరియు మంగళవేడాలో, మోహోల్‌లో, షోలాపూర్‌లో తమ లీలలను ప్రదర్శించి అక్కల్‌కోటకు రావలసిన సమయాన ఆసన్నమైనది. కాబట్టి అక్కల్‌కోటకు చేరి తమ మహిమను చూపుటకు సంసిద్ధులైరి.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-20

## శ్రీస్వామి సమర్థ ఆకారము - నచ్చినవి - అలవాట్లు

శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోట రాకమునుపు చాలా ప్రదేశాలు తిరిగినారు. వాటిలో ముఖ్యమైనవి 1. బదరీనాథ్ 2. కేదార్‌నాథ్ 3. హరిద్వార్ 4. గంగోత్రి 5. వారణాశి 6. కలకత్తా 7. పూరీ జగన్నాథ్ 8. రాజోర్ 9. ఉడిపి 10. పండరీపుర్ 11. సహ్యాద్రి 12. గిర్నార్ 13. మతాపూర్ 14. కర్‌వీర్ 15. పాంచాలేశ్వర్ 16. ఔదుంబర్ 17. కరంజా 18. నరసింహవాడి 19. బేగంపూర్ 20. గాణ్గాపూర్ 21. మంగళవేడా 22. మొహోల్ 23. షోలాపూర్

వీటిలో శ్రీదత్తుని ముఖ్యస్థలాలు 1. సహ్యాద్రి 2. గిర్నార్ 3. కాశీ 4. మాతాపూర్ 5. కరవీర్ 6.

పాంచాలేశ్వర్ 7. ఔదుంబర్ 8. కరంజ 9. నరసింహవాడి 10. గాణ్గాపూర్

శ్రీస్వామి రూపురేఖలు :-

1. చాలా పొడవైన శరీరము కలిగి ఉండేవారు.

2. ఆజానుబాహుడు

3. పెద్ద బొజ్జతో వుండేవారు

4. విశాలమైన భుజాలు, దాదాపుగా వారి చేతులు మోకాలు వరకు ఉండేవి.

5. తీవ్రమైన దృష్టి

6. శరీరము గోధుమ వన్నె రంగులో మెరిసేది

7. పెద్ద పెద్ద చెవులు కలిగి ఉండేవారు

8. చెవి అడుగుభాగమున చాలా పలుచగా ఉండును.

9. పెద్దటి ముఖము, విశాలమైన నుదురు. నెరసిన కనుబొమలు

10. శరీరము గులాబి పూవువలె మృదువుగా వుండేది

11. పాదాలు పొడవుగా ఉండేవి

12. ముఖాన తిలకం పెట్టుకునేవారు

13. కౌపీనం ధరించేవారు

14. అందమైన పలువరస కలిగి వుండేవారు

15. లోతైన పెద్ద బొడ్డు కలిగి వుండేవారు

16. మెడలో స్ఫటికమాల, తులసీమాల మరియు రుద్రాక్షమాల వేసుకునేవారు

17. చెవులకు కుండలాలు వేలాడుతూ ఉండేవి

18. ఎక్కువగా మరాఠీ. హిందీ భాషలు మాట్లాడేవారు

19. చెడ్డభాషలో తిడుతూండేవారు

20. స్నానము ఆయనకు ఇష్టం వచ్చినప్పుడు చేసేవారు

21. ఒంటికి గంధం రాయించుకునేవారు

22. హారతి తరచూ ఇప్పించుకునేవారు

23. స్మశాసనంలో కూర్చునేవారు

24. అతివేగంగా నడిచేవారు

25. ఎక్కువగా మాట్లాడేవారు కాదు

స్వామి సమర్థులకు ఇష్టమైనవి :

1. కుక్కలు

2. ఆవులు

3. కాషాయరంగు పూవ్వులు

4. బేసెన్ లడ్డు

5. జంతికలు

6. ఉల్లిపాయ కూర

7. ప్రతిరోజు రెండుసార్లు ఆచమనం చేసేవారు

8. పడుకునేటప్పుడు ముఖంపైన ముసుగు వేసుకొని పడుకునేవారు

9. దేవుడి విగ్రహాల చాటున పప్పులు, రాళ్ళు, తీపి పదార్థాలు, గోళీలు దాచుకునేవారు

10. ఉంగరాలతో ఆడేవారు

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-21

### భారతదేశమునకు ప్రథమ స్వాతంత్ర్య యుద్ధము జరుగునని సూచించుట - దావాజీ ఇంట మహిమ చూపుట - కమ్మరి భక్తుడు చావు చీటీని తప్పించుట - తన భక్తుడిని తిట్టినందుకు స్వామి శిక్షించుట

శ్రీస్వామి సమర్థులు అక్కల్‌కోటలో సుమారు 20 సం॥లు ఉన్నారు. దాదాపుగా 1856వ సం॥మొదలుకుని 1878వ సం॥వరకు శ్రీస్వామివారు అక్కల్‌కోటలో వున్నారు. శ్రీస్వామివారు అక్కల్‌కోటకు వచ్చిన కొత్తలో 1857వ సం॥లో భారతదేశపు ప్రథమ స్వాతంత్ర్యయుద్ధము కానున్నదని సూచించుటకై శ్రీస్వామివారు కొత్త ఆట సూచించిరి. అదేమనగా రాజ్‌మహల్‌లో ఉన్న ఫిరంగిలో తన తలను పెట్టేవారు. దీనివలన జరుగబోవు స్వాతంత్ర్యయుద్ధమున ఎందరో దేశభక్తి బిడ్డలు త్యాగములకు సిద్ధము కానున్నారని తెలియుచున్నది.

రాంపూర్ అనే గ్రామములో దావాజీ అనే స్వామి భక్తుడుండేవాడు. శ్రీస్వామి సమర్థ అప్పుడప్పుడు వారి ఇంటికి వెళ్ళేవారు. ఒకసారి వారి ఇంటిలో భిక్షచేయుటకు వెళ్ళగా సూమారు 40 మందికి సరిపోయే పదార్థములను దావాజీ సిద్ధము చేసెను. కాని స్వామి వారి రాక తెలిసి చుట్టుప్రక్కల గ్రామములనుండి ఎందరో భక్తులు అనుకోకుండా భోజనము వేళకు వచ్చిరి. శ్రీస్వామి పరీక్షగా వచ్చిన వారందరికి అన్నం పెట్టమని ఆజ్ఞాపించిరి. వారు వండినది 40 మందికే. ఎలాగా అనే సందిగ్ధములో పడినప్పుడు శ్రీస్వామి సమర్థ వండిన పాత్రలు తెప్పించి వాటిపై కొన్ని దేవతల విగ్రహాలను ఉంచి ఆ దంపతులు ఇద్దరిని తలపై పెట్టుకుని వారి ఇంటిలో ఉన్న తులసిమాతకు ప్రదక్షిణ చేయమని శ్రీస్వామి ఆజ్ఞాపించిరి. వారిట్లు ప్రదక్షణ చేయగా శ్రీస్వామి వచ్చినవారందరికి భోజనము పెట్టమని ఆజ్ఞాపించిరి. చిత్రమేమిటంటే వచ్చిన జనులందరికి భోజనము సరిపోవుటయే గాక ఇంకా మిగిలినది.

జాదౌవ్ అను ఒక కుమ్మరి అక్కల్‌కోటలో ఉండేవాడు. అతడు స్వామికి ప్రియభక్తుడు. శ్రీస్వామి ముద్దుగా అతనిని 'ఓరేయ్ కమ్మరీ!' అని పిలిచేవారు. ఒకసారి శ్రీస్వామి సమర్థ ఇట్లనిరి. "ఓరేయ్ కుమ్మరి! నీ పేర ఒక చీటి వచ్చినదిరా" అని. ఈ మాటలు వినగానే ఆ కుమ్మరి తనకు చావు దగ్గర పడినదని తెలుసుకుని స్వామి పాదాలకు పట్టి వేడుకున్నాడు. శ్రీస్వామి తన భక్తుని రక్షించుటకు ఆ ప్రాంతములో దూరంగా ఉన్న ఆబోతును చూసి "ఫో! ఫో!" అని కేక పెట్టారు. ఆ మరుక్షణమే ఆబోతు మరణించినది.

ఒకసారి తోటకాపరివాడు శ్రీస్వామి భక్తుడు కొండూనానా ఆ తోటలో ఉన్నప్పుడు ఆ తోటకాపరివాడు శ్రీస్వామి భక్తుణ్ణి తిట్టి మెడబట్టి బయటకు గెంటించెను. కొంతకాలానికి శ్రీస్వామి సమర్థ ఆ తోటలోనే వెళ్ళి తన భక్తుణ్ణి తిట్టిన తోట కాపాలావాణ్ణి చూసి ఇట్లనిరి. **"బియ్యం కడిగిన నీళ్ళు త్రాగి ఒక మూలన కూర్చో!"** అని వెళ్లిపోయిరి. ఆ తోటకాపరివాడికి ఏమీ అర్థం కాలేదు. ఇది జరిగిన తరువాత ఆ తోటలో ఒక పురుగు ఆ తోటమాలిని కుట్టినది. దానికి నివారణ లేకపోయినది. వైద్యం ప్రకారం బియ్యం కడిగిన నీళ్లు త్రాగి కూర్చొనినచో తన రోగము తగ్గునని వైద్యులు చెప్పినారు. శ్రీస్వామి చెప్పిన మాట అక్షరాల జరిగినది. తన భక్తుణ్ణి శిక్షించినందులకు స్వామి వేసిన శిక్షే అది.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-22

## నిరాడంబరుడు - మృత్యుంజయుడు - స్థితప్రజ్ఞుడు

శ్రీదత్తుని అవతారములలో శ్రీపాద శ్రీవల్లభుడు, నృసింహసరస్వతి మరియు మాణిక్య ప్రభువు చాలా శాంతముగాను, సౌమ్యముగాను ప్రవర్తించేవారు. శ్రీస్వామి సమర్థ రుద్రావతారముగా చెప్పుకొనవచ్చును. శ్రీ శిరిడీ సాయిబాబా మిశ్రమముగా కనిపించేవారు. ఒక్కొక్కసారి శాంతముగాను, ఒక్కొక్కసారి కోపముతో ప్రవర్తించేవారు. గజానన మహారాజ్ కూడా ఎక్కువ పాళ్ళు శాంతముతోనే ప్రవర్తించేవారు. శ్రీస్వామి సమర్థ రుద్రావతారులు అయినప్పటికి ఒక్కొక్కసారి తమాషా చేసి అందరిని సంతోష పెట్టేవారు. ఉదాహరణకు వారు ఆనందముతో నవ్వినప్పుడు వారి రెండు చేతులతో తమ పెద్ద పొట్టను పట్టుకుని పెద్దగా నవ్వేవారు. ఆ దృశ్యము చూసినచో ప్రతివారికి పరమానందము తప్పక కలుగుతుంది.

మాలోజీరావ్ భోంస్లే అనునతను అక్కల్‌కోట సంస్థానపురాజు. శ్రీస్వామి సమర్థకు భక్తుడు కూడా. ఒకసారి ఆ రాజు తన జన్మదిన సందర్భముగా స్వామి ఆశీర్వాచనము తీసికొనుటకై ఎంతో ఆడంబరముగా అనగా ఆ రాజు ఒంటిపై కవచకుండలాలతో, బంగారు ఆభరణాలతో, రత్నముల కిరీటము ధరించి తన వెంట రాణులతో, భటులతో, పల్లకీలతో, ఏనుగులు, గుఱ్ఱములు మొదలగు వాటితో శ్రీస్వామి సమర్థ కడకు వచ్చి తలవంచి నమస్కరించెను. శ్రీస్వామిసమర్థ రుద్రరూపుడై ఒక్క చెంపదెబ్బ కొట్టారు. ఆ దెబ్బతో ఆ రాజుగారు పెట్టుకొన్న కిరీటము పోయి ఎక్కడో ఆవలపడింది. శ్రీస్వామి కోపముతో ఇట్లనిరి. **"నీ రాజరికం నీ భవనములో ఉంచుకో! ఇక్కడ అవసరం లేదు"** అని అన్నారు. అవధూతల వద్ద ఎటువంటి ఆడంబరములు ప్రదర్శించకూడదు. వారు నిరాడంబరులు. ఎటువంటి ఆడంబరానికి లొంగనివారు. ధన, కనక, వస్తు, వాహనాలకు లొంగేవాళ్ళం మనం. లొంగని వాళ్ళు మహాపురుషులు. కావున గురువుల వద్ద ఎటువంటి ఆడంబరములు ప్రదర్శించకూడదు మరియు గురువులకు ధనకనకవస్తు ఆభరణములతో మభ్యపెట్టలేమని తెలుసుకొనవలెను.

ఒకసారి శ్రీస్వామి తన శిష్యులైన చోళప్ప మరియు జాదవ్‌తో కలిసి అక్కల్‌కోటకు సమీపమున ఉన్న ఇటగీ అనే గ్రామమునకు వెళ్లి ఆంజనేయుని గుడిలో పడుకొనినారు. ఆ ప్రాంతములో రామన్న అనే అతనికి పొలములో పనిచేయుచుండగా పాము కరచి మరణించినాడు. రామన్నను రక్షింపమని వేడుకొనుటకై శ్రీస్వామి వద్దకు చేరినారు జనులు. ఆ సమయములో శ్రీస్వామి నిద్రపోవుచున్నందువలన శ్రీస్వామి భక్తుడైన జాదౌవ్ స్వామి వారి పాదరక్షలను శ్రీస్వామికి తెలియకుండా ఇచ్చి చనిపోయిన రామన్నపై పెట్టమని చెప్పినాడు. వారు జాదౌ చెప్పినట్లుగా చేసినారు. శ్రీస్వామి ఒక్కసారిగా లేచి జాదౌవ్ చేసిన పనికి కోపించి కొట్టసాగిరి. కొంతసేపటికి ఇట్లనినారు. **"ఎంతసేపు వాడు నిద్రపోతాడు. వాని చెవిలో మూడుసార్లు వాని**

**పేరును పిలువు"** అని ఆజ్ఞాపించినారు. జాదౌవ్ శ్రీస్వామి చెప్పినట్లుగా చేయగానే రామన్న నిద్రనుండి లేచినట్లుగా కనులు తెరచినాడు. ఈ సంఘటన చూసిన వారందరు ఆశ్చర్యచకితులైనారు.

మరొకసారి శ్రీస్వామివారు రాజభవనానికి వెళ్ళినారు. ఊయలపై కూర్చొని ఊగుతున్న సమయాన ఒక ఎలుక దేవుడికి పెట్టిన దీపములోని నేతిని ఎంగిలి చేసినది. అక్కడున్న పూజారి కోపించి ఒక చెక్కను ఆ ఎలుకపై విసిరి చంపినాడు. స్వామి ఆ చచ్చిన ఎలుకను తీసుకుని వారి దివ్య హస్తములతో రాసి ఊయలకు కట్టిన గొలుసుతో ఒక రంధ్రము నుండి బైటకు మళ్ళీ బయటనుండి రంధ్రములోనికి ఈ విధముగా చేస్తూ, **"ఇక లే ! వెళ్ళు"** అని అనినంతనే ప్రాణము లేని ఎలుకకు ప్రాణము వచ్చి దూకి వెళ్లిపోయినది. అవధూతలు తలచుకున్న మృత్యువుని కూడా ఎదరించి జయించగలరు.

ఒకసారి శ్రీస్వామి వారు గాఢనిద్రలో గురకపెడుతూ నిద్రపోతున్నారు. ఆ సమయములో ఒక భక్తుడు తన మనసులో ఇట్లనుకొనినాడు. **"యోగి నిద్రపోడు కదా! మరి గురుక పెట్టే స్వామి యోగి ఎలా అవుతాడు?"** అని అలా అనుకున్నాడో లేదో, శ్రీస్వామి సమర్థ వెంటనే కళ్ళు తెరచి **"ఒరేయ్ కంసాలి! అటువంటిదేమీ లేదురా"** అని మళ్ళీ పడుకున్నారు.

శ్రీస్వామి సమర్థ గోనెపట్టా మీద పడుకునేవారు. సబ్నీస్ అనునతడు శ్రీస్వామిపై అపారమైన ప్రేమ కలిగియుండుటచే స్వామివారికి పట్టుపానుపు కానుకగా ఇచ్చినారు. శ్రీస్వామి ఆ భక్తుని ప్రేమకు లోనై ఆ పాన్పు మీద పడుకొనుట మొదలిడినారు. సబ్నీస్ బావగారు స్వామి పట్టుపానుపుపై పడుకొనుట చూసి విమర్శించి సాధువులకు పట్టుపాన్పులతో అవసరమేమిటి. అని అనుకొన్నాడు. శ్రీస్వామి సమర్థ వెంటనే అతనిని ఒక కొండపైకి తీసుకువెళ్లి ఒక బండరాయిపై శ్రీస్వామి హాయిగా నిద్రపోయారు. సబ్నీస్ బావగారికి ఏమి చేయాలో తోచలేదు. పైగా అది చలికాలం. అతనికి చలివలన శరీరం ఒణకటం, పళ్ళుకొట్టుకోవటం మొదలైంది. ఆ చలిలో పైగా బండరాయిపై శ్రీస్వామి సమర్థ ఎట్లు నిద్రించారో కదా ! అని అనుకొనినాడు. శ్రీస్వామి వెంటనే కళ్ళు తెరచి, **"చూశావా! మా పట్టు పరుపు"** అని అన్నారు. దీనిని బట్టి అవధూతలకు పట్టుపరుపైనా, రాయి బండైనా వారికి ఒక్కటే అని స్థితప్రజ్ఞత కలిగి ఉండెదరని తెలిసికొనవలెను. అవధూతలను పరీక్షించగలమా? అసలు ఆ అర్హత మనకి ఉన్నదా? అనే ప్రశ్న వేసుకుంటే మనసులో ఎటువంటి సంకోచములు రాక మనస్సు స్థిరముగా నుండును.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-23

### అంధుడైన బాలునికి చూపువచ్చుట - ఐదుగురు రక్కసులకు ఆ బాలుడు వేదము చెప్పుట - నృసింహసరసర్వతి కూడా ఒక హరిజనుడితో వేదము చదివించుట

ఒకసారి శివుబాయి అనే స్త్రీ తన కుమారిడితో స్వామి వద్దకు వచ్చి తన కుమారునికి పుట్టుకనుండి చూపులేదనియు, దయ చూపమని స్వామి వేడుకొనెను. శ్రీస్వామివారు ఆమెతో ఇట్లనిరి. **“అమ్మా! నన్ను పరిక్షించటానికి ఐదుగురు రక్కసులు రాబోవుచున్నారు. వారు రాగానే నీ పుత్రునికి చూపు వస్తుంది”** అని స్వామిపలికిన మరుక్షణమే ఐదుగురు బ్రాహ్మణులు భాషలో ఆరితేరినవారు శ్రీస్వామిని పరిక్షించుటకై తమకున్న జ్ఞానముతో అహంకార పూరితులై మరియు శ్రీస్వామివారు ఆచారము లేనివారని ఎవరివద్దనైనా ఆహారము స్వీకరిస్తారని అనుకొని శ్రీస్వామివారి శక్తినే పరిక్షించుటకు అక్కడకు చేరినారు. శ్రీస్వామి సమర్థ ఒక్కరే అయినప్పటికి ఆ ఐదుగురు తనను పరిక్షించుటకు వచ్చినారని గ్రహించి తన శక్తి ముందు ఆ ఐదుగురు ఎంత? ఆ ఐదుగురుపై శ్రీస్వామివారి శక్తిని ప్రయోగించుట అవసరము లేదని గ్రహించి ఆ ఐదుగురిపై శివుభాయి కుమారుడైన అంధుడిని వదలినారు. శ్రీస్వామి తన మెడలోని హారము నుండి ఒక రుద్రాక్షను తీసి ఆ బాలునికిచ్చినారు. ఆ బాలునితో, **“ఈ బ్రాహ్మణులు ఏ ఉద్దేశ్యముతో వచ్చినారో, ఏమి అడగాలనుకున్నారో చెప్పి వారికి సమాధానము కూడా చెప్పు”**మని ఆజ్ఞాపించినారు. ఆ బాలుని శ్రీస్వామి దగ్గరకు తీసుకుని ఒక పుష్పముతో అతని కన్నులను తుడచినారు. వెంటనే ఆ బాలుడు ఆ ఐదుగురివైపు తిరిగి వారి మనసులోని దాగియున్న అన్ని భావములను బయటకు చెప్పి వారు అహంకారముతో విద్యావంతులని, గొప్పవారని వారి ముందు మిగతావారు సాటికి రారని శ్రీస్వామిని కూడా పరీక్ష చేయదలచినారని వచ్చినారని పైగా శ్రీస్వామివారు అనాచారి అని వారు ఐదు ప్రశ్నలతో ఇక్కడకు వచ్చినారని ఆ బాలుడు అందరి ముందు చెప్పాడు. వారి ప్రశ్నలు ముక్తిని సంపాదించుట ఎలా అని ఉపనిషత్తుల సారాంశము యోగి మరియు ఆ యోగి యొక్క లక్షణములు మొదలగున్నవి అడుగుటకు వచ్చినారని ఆ బాలుడు చెప్పినాడు. వారు వేసే ప్రశ్నలన్నిటికి ఆ బాలుడు క్షుణ్ణముగా జవాబు చెప్పి వారి కళ్ళు తెరిపించినాడు. ఆ బాలుని వాక్చాతుర్యము ముందు ఆ ఐదుగురు బ్రాహ్మణులు ఆశ్చర్యపోతూ ఆ బాలుడు ఇచ్చిన ఉన్నతమైన సమాధానమునకు ముగ్ధులై శ్రీస్వామి సమర్థ చూపిన మహిమకు కళ్ళు తెరచి శ్రీస్వామి వారి పాదములపై పడి క్షమాపణ వేడుకొనినారు. ఆ బాలునికి కూడా శ్రీస్వామి సమర్థ కృపతో కనుచూపు వచ్చినది.

శ్రీనృసింహసరస్వతి కూడా ఒకసారి దారిన పోయేవాణ్ణి పిలిచి అతని వివరములను అడుగగా అతను శ్రీస్వామికి నమస్కరించి తను హీనకులమున పుట్టినవాడినని పూరిగుడిశెలో బ్రతుకుచున్న వాడని చెప్పగా అతనిపై స్వామికరుణ దృష్టి ప్రసాదించెను. ఎటువంటి జ్ఞానము వేదముల గురించి తెలియని

అతను మహాపండితుడై ఎందరో పండితులను ఓడించి హరిజనుడైనప్పటికి శ్రీనృసింహసరస్వతి అనుగ్రహమువలన వేదశాస్త్రప్రవీణుడైనాడు.

శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటస్వామి మరియు శ్రీనృసింహసరస్వతి ఇద్దరు ఒక్కరే అని ఋజువైనది.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-24

## శ్రీనృసింహ సరసర్వతియే స్వామి సమర్థ - చంచల స్వభావములు కల కోతి మరియు ఏనుగు - మహాపురుషుడి దర్శనము చూపుట

పై అధ్యాయములో శ్రీనృసింహ సరస్వతి మరియు శ్రీస్వామి సమర్థ ఇరువురు ఒకేరకమైన మహిమను చూపి వారిరువురు ఒక్కరేనని ఋజువుచేసిరి. ఇప్పుడు మరొక సంఘటన కూడా చూద్దాం.

బొంబాయిలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి సంతానము లేదు. వారిరువురు నృసింమసరస్వతి భక్తులు. గాణ్గాపురమునకు వెళ్లి సంతానము కలిగితే 1000 మంది బ్రాహ్మణులకి భోజనము పెడతామని ఆ దంపతులు మ్రొక్కుకున్నారు. వారు కోరినట్లుగా గాణ్గాపురవాసి అభయముచే సంతానము కలిగినది. ఆ బ్రాహ్మణుడి వ్యాపారములో పెద్ద నష్టము కలిగి ఆ దిగులుతో అతను చనిపోయెను. అతని భార్య శ్రీదత్తుని పూజించగా శ్రీదత్తుడు స్వప్నమునందు కనిపించి అక్కల్‌కోటలోనున్న శ్రీస్వామి సమర్థకు భోజనము పెట్టినచో 1000మంది బ్రాహ్మణులకు భోజనము పెట్టినట్లు సమానమగునని చెప్పి అదృశ్యమైరి. ఆమె వెంటనే తన మ్రొక్కును జ్ఞాపకము తెచ్చుకుని దానిని చెల్లించుటకై అక్కల్‌కోటకు వెళ్ళి స్వామి సమర్థకు భోజనము పెట్టినది. భోజనము స్వీకరించిన తరువాత శ్రీస్వామి సమర్థ ఇట్లనిరి, **“1000 మంది బ్రాహ్మణులకు భోజనము ముట్టినది. ఇక దిగులు పడకు”** అని అన్నారు. శ్రీదత్తుడు ఒక్కరేవారు నృశింహ సరస్వతిగను, స్వామి సమర్థగను అవతరించినారని మళ్లీ ఈ లీలతో ఋజువుచేసినారు.

అక్కల్‌కోటలో ఒక కోతి అందరిని ఏడిపించసాగినది. పైగా ఎవరికి లొంగేది కాదు. దాని బాధ భరించలేక చివరికి అక్కల్‌కోట రాజావారి దానిని చంపవలసినదిగా ఆజ్ఞాపించినారు. దానిని బంధించి స్వామి ఆజ్ఞ ప్రకారము శ్రీస్వామి వారి ముందుకు తెచ్చినారు. శ్రీస్వామిసమర్థ ఆ అల్లరికోతిని దగ్గరకు తీసుకుని నెమ్మదిగా రాస్తూ, **“ఓ హనుమాన్! ఎవ్వరినీ బాధపెట్టకు. ఇక నుండి నెమ్మదిగా ఉండు”**అని అనిరి. ఆ కోతి ఆనాటినుండి సాధువువలె ప్రవర్తించినది. ప్రతిరోజు స్వామి కడకు వచ్చి కాసేపు కూర్చొని వెళ్ళేది.

ఒక ఏనుగు కూడా ఇంచుమించుగా పైన చెప్పిన కోతివలె అల్లరి చేయసాగినది. రాళ్ళను విసిరేది. దానిని చివరకు మావటివాడు కూడా లొంగ తీసుకోలేకపోయినాడు. ఒకరోజు శ్రీస్వామివారు ఆ ఏనుగు కడకు వచ్చి తీవ్రముగా దానివైపే చూడసాగిరి. శ్రీస్వామి తీక్షణచూపు వలన ఆ ఏనుగు తట్టుకొనలేక ఒక్కసారిగా తన స్వభావము మార్చుకొనినది. యోగల దృష్టి ఎంతో గొప్పది. ఎంతి కఠినాత్ముడైనా తప్పక మార్పు చెందుతాడు.

ఒకసారి శ్రీస్వామివారు భక్తాదులతో కూర్చొని ఉండగా, ఒక్కసారిగా లేచి, **"రండి! మీకొక మహాత్ముడిని చూపెదను"** అని అన్నారు. స్వామి వెంట భక్తులు వెళ్ళగా స్వామివారు ఒక పెద్ద నాగుపామును చూపించిరి. ఆయనే గొప్ప మహాత్ముడని తన వెంట వచ్చిన భక్తులతో చెప్పిరి. శ్రీస్వామివారికి ఏ జీవి పూర్వజన్మలో ఏదో బాగా తెలుసు. కావుననే ఒక మహాత్ముడు నాగుపాము రూపములో ఎక్కడో మారుమూల ఒక పెద్ద పుట్టలో దాగివున్నను కనిపెట్టి భక్తులకు చూపించెను. శ్రీదత్తుని అవతారమగు శిరిడీ సాయిబాబావారు కూడా ఒక కప్ప, పాము యొక్క పూర్వజన్మవృత్తాంతము మరియు ఒక బల్లి యొక్క వృత్తాంతము అలాగే రెండు మేకల వృత్తాంతము అవన్నీ పూర్వజన్మలో ఎవరో చెప్పిరి. ఒక పెద్దపులికి కూడా సద్గతి నిచ్చిరి.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-25

## రెండు తలల రాక్షసుడు - బ్రహ్మతదాకార వృత్తి అనుదానికి అర్థం - స్వామివారికి ఆజ్ఞను ఉల్లఘించిన ఎదురయ్యే కష్టాలు

అక్కల్‌కోటలోనే భీమారావ్ అనేనతను ఉండేవాడు. అతని తలపై ఒక పెద్ద కణిత వుండేది. దాని వలన అతనిని అందరూ హేళన చేసేవారు. అతను చాలా బాధపడుతూ ఏమి చేయాలో తోచక శ్రీస్వామి సమర్థయే శరణ్యమని నమ్ముకొని దర్శనానికి వచ్చినాడు. స్వామివారు అతనిని చూడగానే, "రెండు తలల రాక్షసుడు వచ్చినాడు" అని అన్నారు. భీమారావ్ చివరకు శ్రీస్వామి కూడా హేళన చేసినందుకు ఎంతో బాధపడి ఏడ్చి ఇంటికి వెళ్ళిపోయినాడు. అదేరోజు మధ్యాహ్నం నిద్రలో శ్రీస్వామి సమర్థ దర్శనము ఇచ్చి తన తలపై నున్న కణితను తాకినారు. అతనికి మెలుకువ వచ్చినది. చిత్రమేమిటంటే ఆ కణిత మాయమైనది. అతను ఎంతో ఆనందించి శ్రీస్వామివద్దకు వెళ్ళి వారి పాదాలపై బడి వెక్కి వెక్కి ఏడ్చినాడు. శ్రీదత్తుని లీలలు చాలా చిత్రముగా గమ్మత్తుగా ఉంటాయనే దానికి ఇది ఒక నిదర్శనము.

విష్ణుబువా అనే వేదాంతి ఉండేవాడు. అతను ఒకసారి అక్కల్‌కోటలోని రాజుగారిని దర్శించి తనకున్న పాండిత్యాన్ని గురించి గర్వంగా చెప్పుకుని శ్రీస్వామిసమర్థను “బ్రహ్మతదాకార వృత్తి” అన్నదానికి అర్థము చెప్పమని అడిగినారు. శ్రీస్వామి మౌనముగా ఉన్నారు. స్వామి మౌనాన్ని చూసిన ఆ వేదాంతి తానడిగిన ప్రశ్నకు జవాబు ఇవ్వలేక పోయినాడని అటువంటి వారిని స్వామి అనుట తగదని అనుకున్నాడు. ఇది జరిగిన కొన్నాళ్ళకు ఆ వేదాంతికి ఒక స్వప్నము వచ్చినది. ఆ స్వప్నములో కొన్ని వేల తేళ్ళు మీదకు వస్తున్నట్లు కనిపించాయి. పైగా ఒక తేలు కుట్టినది కూడా. ఆ దెబ్బతో స్వప్నములో గట్టిగా అరిచాడు ఆ వేదాంతి. పక్కనే మరియొకడు ఆ వేదాంతిని నిద్రలేపి అరచుటకు గల కారణము అడుగగా జరిగినదంతా వేదాంతి అతనికి వివరించాడు. కొన్ని రోజుల పిదప మళ్ళీ ఆ వేదాంతి శ్రీస్వామి సమర్థను కలిసి “బ్రహ్మతదాకార వృత్తి” అంటే ఏమిటి అని అడిగాడు. శ్రీస్వామి సమర్థ వెంటనే ఇట్లు అనినారు, **“తేళ్ళు కలలో కనిపించినంత మాత్రమునకే కేక పెట్టితివి. నీవు వేదాంతము మాట్లాడటమేమిటి? బ్రహ్మతదాకారవృత్తి అంటే సులభమైన దనుకుంటున్నావా? అది ఏరుకోవటానికి రోడ్డు మీద పడివున్న వస్తువా? చదివినంత మాత్రాన యోగివయ్యావనుకుంటున్నావా?”** అని తిట్టి శ్రీస్వామి తన రుద్రావతారమును చూపినారు. ఆ దెబ్బతో అతను అహంకారమును విడిచి మారు మాట్లాడక వెళ్లిపోయినాడు.

శ్రీస్వామివారిని దర్శించుకొనవచ్చే భక్తులకు ఆజ్ఞ ఇచ్చినచో వెళ్ళవలెను. వారి ఆజ్ఞను ధిక్కరించినవారికి తిప్పలు తప్పవు. ఉదాహరణకు బాబూజీ అనే అతను సితారలో పనిచేయుచు సెలవుదినాలలో శ్రీస్వామివారిని దర్శించుకొనుటకు వచ్చెడివాడు. ఒకసారి స్వామిని దర్శించి తిరుగు ప్రయాణము వెళ్ళుటకు ఆజ్ఞకోరగా శ్రీస్వామి అందుకు అంగీకరించలేదు. అతను స్వామిని తొందరపెట్టగా, వరద తీవ్రముగా ఉన్నదని తొందరపడవద్దని శ్రీస్వామి హెచ్చరించినారు. అతను స్వామి చెప్పినది వినక చెప్పకుండా జారుకున్నాడు. కాని బయట వంతెన మునిగిపోయినది. రైళ్ళు రాకపోకలు లేవు. రైల్వేస్టేషనులోనే ఆ గాలివానలో చిక్కుకుని పోయినాడు. ఇలాంటి సంఘటనలే శ్రీషిరిడీ సాయిబాబాగారు కూడా చూపారు. వారిని దర్శించుకొనుటకు వచ్చిన భక్తులు బాబా ఆజ్ఞను ఉల్లఘించిన వెళ్ళినవారికి ఏ గుర్రపు బండినో పడటం లేదా ఏ ఆటకమో వచ్చేది. కావున మహాత్ముల మాటలను విశ్వసించి తదనుగుణంగా ప్రవర్తించువారికి ఎటువంటి ఇక్కట్లు ఉండవు. ఉల్లంఘించిన వారి గతి పైన చెప్పబడిన విధముగా ఇబ్బందులు పడవలసి వస్తుందని గ్రహించవలెను. మహాత్ముల మాటలే వేదం.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము 26

## (సర్వరోగములకు నివారణము ఔషధములు కాదు శ్రీ స్వామి సమర్ధ కృపయే)

రామచంద్ర కేరోబా అనునతను బొంబాయిలో ఉండేవారు. అతడు టి.బి. వ్యాధితో బాధపడుచుండెను. అదే సమయములో అతను పనిచేయుచున్న కంపెనీ కూడా మూతపడుట వలన శారీరక వ్యాధితోపాటు మనోవ్యాధికి గురి అయినాడు. అతను ఎన్ని మందులు వాడినను రోగ విముక్తుడు కాలేదు. అక్కల్‌కోటలో శ్రీస్వామి వారి మహిమలు విని స్వామి వద్దకు వెళ్ళి శరణుకోరగా శ్రీ స్వామి సమర్ధ అతనికి ఒక కొబ్బరికాయ ప్రసాదించి అభయమిచ్చినాడు. బొంబాయికి తిరిగి వచ్చిన పిదప అతనికి టి.బి. వ్యాధి పోయినది. మరియు ఇంకొక ఉద్యోగము దొరికినది. దానితో అతడు శ్రీ స్వామి సమర్ధ భక్తుడైనాడు.

అక్కల్‌కోటకు సమీపమున మమాదాబాద్ అను ఒక గ్రామము కలదు. ఆ గ్రామములో గోవింద్‌పంత్ కులకర్ణి అనునతడు కడుపు నొప్పి వ్యాధితో బాధపడుచుండెను. ఎన్ని మందులు వాడినను నయము కాలేదు. గాణ్గాపూర్‌కి వెళ్ళగా అక్కడ స్వప్న దర్శనములో శ్రీస్వామి అక్కల్‌కోటకు వెళ్ళమని కులకర్ణిని ఆజ్ఞాపించినారు. అతను అక్కల్‌కోటకు వచ్చి శ్రీ స్వామి సమర్ధను శరణువేడగా శ్రీస్వామి సమర్ధ అతనితో ఇట్లనెను. **"నీవు పూర్వ జన్మలో ఒక ఆవును బాధపెట్టుట వలన ఈ జన్మమునందు పాపమును ఈ రూపేణా అనుభవించు చున్నావు. కావున దాని నివారణకు గోవు యొక్క మూత్రమును మరియు ఆవు పేడను ఏడు రోజులు స్వీకరించినచో వ్యాధి నివారణమగునని"** పలికెను. కులకర్ణి స్వామి చెప్పినట్లుగా చెయ్యగా అతని వ్యాధి పూర్తిగా పోయినది. మహాపురుషుల ఆజ్ఞను అక్షరాల పాటించవలెను. అది గోమూత్రమైతేనేమి గోవు పేడనైతేనేమి ? అట్లు అక్షరాలగా పాటించే వారే పుణ్య పురుషులు. కులకర్ణి కూడా శ్రీ స్వామికి భక్తుడైనాడు.

గోపాల్ బువాకేల్కర్ అనునతను రత్నగిరిలో రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేయుచుండెడివాడు. అతను కూడా కడుపు నొప్పి వ్యాధితో బాధపడుతుండేవాడు. ఎన్ని ఔషధములు వేసుకొనినను ఉపయోగము లేకపోయినది. దానివలన ఉద్యోగమునకు సరిగ్గా వెళ్ళలేకపోయినాడు. శ్రీ స్వామి సమర్ధ పేరు విని అక్కల్‌కోటకు వెళ్ళగా శ్రీ స్వామి సమర్ధ అతనికి స్వప్నములో కనపడి **"నీ వ్యాధి నివారణ చేసితిని"** అని పలికెను. గోపాల్ బువాకు మెలకువ వచ్చి రెండు గిన్నెలు నిండి మూత్ర విసర్జన చేసెను. ఆ దెబ్బతో అతని వ్యాధి పూర్తిగా నయమయినది. అప్పటినుండి అతను కూడా స్వామి భక్తుడయ్యెను.

సవంతవాడి అనే గ్రామమున అప్పాసాహెబ్ బోస్లే గారి భార్యకు కాలునందు సుమారు 10 రంధ్రములు కలిగి జబ్బుతో బాధపడుచు శ్రీస్వామి యొక్క మహిమను తెలుసుకొని తన భర్తతోపాటుగా 10 మంది కలిసి అక్కల్‌కోట్‌కు వచ్చిరి. ఆ సమయమున శ్రీ స్వామి సమర్ధ కొండపై ఉన్నారు. వారందరు స్వామి

దర్శనమునకై కొండపైకి ఎక్కి స్వామిని దర్శించుకున్నారు. శ్రీ స్వామికి కౌపీనము, ధోవతి, దుప్పట్లు మొదలగునవి కానుక ఇవ్వబోగా స్వామి వారందరిని తిట్టినారు. వెంటనే ఇట్లనినారు, **'నీ పూర్వజన్మలో చేసిన పాపములు ఈ జన్మలో అనుభవించుచున్నావు'** అని చెప్పి ఒక చెట్టు నుండి పండును తీసి దానిని బాగా గుజ్జుగా చేసి తినమని చెప్పినారు. స్వామి ఆజ్ఞ ప్రకారము వారట్లు చేయగనే బోస్లే గారి భార్యకు ఉపశమనము కలిగి వ్యాధి పూర్తిగా నయమైనది. ఆ దంపతులిద్దరు స్వామి భక్తులైనారు.

చోళప్ప భార్యకు ఒకసారి తేలు కుట్టినది. ఆ తేలుకుట్టిన చేయి బాగా బాధపెట్టుచుండెను. శ్రీ స్వామి సమర్ధ చోళప్ప ఇంట్లోనే ఉండేవారు. శ్రీ స్వామి తన పాదుకలలో ఒక దాన్ని చోళప్ప భార్య ముందు విసిరి ఇట్లనిరి. **"నీ తేలుకుట్టిన చేతిని ఆ పాదుకలలో ఉంచు"** అని అనగా చోళప్ప భార్య స్వామి చెప్పిన ప్రకారము చేయగనే వెంటనే తేలు కుట్టిన చేతికి నొప్పి తగ్గిపోయినది. తగ్గినది కదా అని చేయిని తీయగా మళ్ళీ నొప్పి పుట్టినది. స్వామి మహిమను గ్రహించి రాత్రి అంతా చోళప్ప భార్య తన చేతిని స్వామి పాదుకలోనే ఉంచి పడుకున్నది. ఉదయము పూర్తిగా నొప్పి నివారణ అయినది.

ఒకసారి శ్రీ స్వామి సమర్ధ భక్తులతో కలసి ఇడగి అను గ్రామమునకు వెళ్ళి అక్కడ ఆంజనేయుని దేవాలయములో బస చేసినారు. రావణ అనే భక్తుడికి అక్కడ పాము కాటు వేయగా చనిపోయినాడు. ఆ ఊరు జనులు శవాన్ని స్వామి ముందుకు తెచ్చినారు. శ్రీ స్వామి శిష్యుడైన బాబాసాహెబ్ జాదౌవ్ శ్రీ స్వామి పాదుకలను తీసుకుని ఆ శవం తలపై ఉంచగా శ్రీ స్వామి సమర్ధకు కోపం వచ్చి బాబా సాహెబ్‌ను తిట్టెను. వెంటనే బాబాసాహెబ్‌ను రావణా అని గట్టిగా అరవమని చెప్పగా బాబాసాహెబ్ ఆ శవాన్ని పేరుతో పిలిచెను. వెంటనే చనిపోయిన రావణుడు లేచి కూర్చొనెను. ఈ చిత్రము చూడగా జనులందరు ఆశ్చర్యపడిరి.

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము 27

## (మరికొందరికి స్వామి అనుగ్రహముతో రోగ నివారణ కలుగుట)

ఒక వైష్ణవ బ్రాహ్మణుడికి చాలారోజుల నుండి కడుపు నొప్పితో బాధపడుచుండెను. అతను అక్కల్‌కోటకు వచ్చి శ్రీ స్వామి సమర్ధకు సేవ చేయుట ప్రారంభించెను. కొన్నిరోజుల తరువాత శ్రీ స్వామి సమర్ధ కోపముతో ఇట్లనిరి. నా దగ్గరకు వచ్చి సేవ చేస్తూ ఏల కాలము వృధా చేసుకుంటున్నావు ? అని అనగా ఆ బ్రాహ్మణుడు. 'స్వామి నీవు తప్ప రక్షకుడెవరు. నన్ను అనుగ్రహింపు'మని అనగా శ్రీ స్వామి సమర్ధ ఒక నిమ్మ ఆకుల చెట్టును చూపి ఆ చెట్టు ఆకులను తినమని ఆజ్ఞాపించెను. ఆ బ్రాహ్మణుడు స్వామి ఆజ్ఞ ప్రకారము చేయగా అతని కడుపు నొప్పి మటుమాయమైనది. ఆనాటి నుండి అతను శ్రీ స్వామికి భక్తుడయ్యెను.

విశ్వేశ్వరరావ్ అనునతను టైఫాయిడ్ విష జ్వరముతో బాధపడుచుండెను. అతను స్వామి భక్తుడు. జ్వరము కారణంగా చివరకు స్వామి దర్శనమునకు కూడా రాలేకయుండెను. ఒకసారి శ్రీ స్వామి సమర్ధ తన భక్తుడి కోసం తానే కదలి విశ్వేశ్వరరావ్ ఇంటికి వెళ్ళెను అప్పుడతను స్పృహలేక పడుకుని యుండెను. స్వామి వారు ఆశీర్వదించి తిరిగి వెళ్ళిపోయెను. ఆ క్షణమునుండి అతనికి జ్వరము తగ్గిపోయెను.

ఒక మహాత్ముడు ఎన్నో పుణ్యక్షేత్రములు దర్శిస్తూ రామేశ్వరమునకు చేరెను. అక్కడ అతనికి జబ్బు చేసి తన ప్రయాణమునకు అడ్డుకల్గెను. అతను బాధపడుచుండగా అతనికి స్వప్నములో అక్కల్‌కోట్‌కు వెళ్ళమని శ్రీ స్వామి సమర్ధను దర్శించుకోమని ఒక సిద్ధపురుషుడు కన్పించి చెప్పెను. అతను మర్నాడే అక్కల్‌కోట్‌కు వెళ్ళెను. ఆ సమయమున శ్రీ స్వామి సమర్ధ బావి దగ్గర కూర్చుని ఉండెను. ఆ మహాపురుషుని చూడగనే శ్రీ స్వామి సమర్ధ ఇట్లనెను. **"నీవు ద్వారకకు వెళ్ళదలుచుకున్నావా! శ్రీకృష్ణుని దర్శనం కోరదలచున్నావా?"** అని అంటూ శ్రీ స్వామి సమర్ధ ఒక్కసారిగా చతుర్భుజుడై శ్రీ కృష్ణుని రూపమున మారిపోయెను. ఆ మహాపురుషునికి ఎంతో ఆనందము కలిగి స్పృహ కోల్పోయెను. తరువాత శ్రీ స్వామి వారు అతనిని నిమ్మ ఆకులను తిన్నచో రోగము తగ్గునని చెప్పగా ఆ పురుషుడు అట్లే చేసెను. వెంటనే అతనికి రోగ నివారణమయ్యెను. అప్పటి నుండి ఆ మహాపురుషుడు అక్కల్‌కోట్‌లోనే ఉంటూ ఆధ్యాత్మిక సేవను చేస్తూ కాలము గడిపినారు.

నారాయణ పరశురాం అనే లాయరు షోలాపూర్‌లో ఉండేవాడు. అతను పైల్స్‌తో బాధపడుచుండెడివాడు. అక్కల్‌కోట్‌కు పోలేక శ్రీ స్వామికి ఒక ఉత్తరము ద్వారా తన సమస్యను తెలియపరుచుకున్నారు. శ్రీ స్వామి సమర్ధ కరుణతో అతనిని కొన్ని రోజులు గోవు యొక్క మూత్రమును తాగమని ఆదేశించినారు. ఆ వకీలు ఆ ప్రకారము చేయగా అతనికి వ్యాధి నివారణమైనది.

పూనా నివాసియగు నందారామ్ సుందర్‌జీ అనునతను తీవ్ర మూత్ర విసర్జన సమస్యతో బాధపడుచుండెను. అతను ఎంతో ధనము ఖర్చుపెట్టి మందులు వాడినను ఆ సమస్య తీరలేదు. తన స్నేహితుడైన బాలకృష్ణ జోషికి తన సమస్యను చెప్పగా అతను శ్రీ స్వామి సమర్థ యొక్క మహిమను గురించి చెప్పి అక్కల్‌కోట్‌కు వెళ్ళమని సలహా ఇచ్చినారు. తన స్నేహితుడు సలహా ప్రకారము నందారామ్ అక్కల్‌కోట్‌కు వెళ్ళి స్వామిని శరణువేడెను. అతను అక్కడ అన్నదానము చేసెను. మరియు శివుని దర్శనమునకై శివాలయమునకు వెళ్ళగా శివలింగము ఉన్న చోట శ్రీ స్వామి సమర్థ ఆశీనులై ఉండుట చూసి ఆశ్చర్యపోయెను. శ్రీ స్వామి సమర్థ అతనిని ఆశీర్వదించగా ఆనాటినుండి అతని సమస్య తీరిపోయెను.

వామన్‌బువా అనునతనికి చెప్పలేని రోగములతో బాధపడుచు తట్టుకొనలేక ఆత్మహత్య చేసుకొనుటకు నిర్ణయించుకొని నదిలో దూకెను. శ్రీ స్వామి సమర్థ అతనిముందు ప్రత్యక్షమై నదినుండి బైటకు లాగి వామన్‌బువా చెంపపై కొట్టి ఇట్లనెను, **"కర్మను అనుభవించకుండా ప్రాణత్యాగము చేయుట మూర్ఖత్వమని"** కోపగించెను. శ్రీ స్వామి అదృశ్యమైన పిదప వామన్‌బువా గాఢ నిద్రవచ్చి నిద్రపోయెను మర్నాడు ఉదయం మెలకువరాగా అతని శరీరములో చాలా మార్పు వచ్చెను. అతను ఆనందము తట్టుకొనలేక అక్కల్‌కోట్‌కు వెళ్ళెను. శ్రీ స్వామిని దర్శించగా శ్రీ స్వామి సమర్థ ఇట్లనిరి, **'నీవేనా నదిలో దూకి ప్రాణ త్యాగము చేసుకుంటివి'** అనగా అతను ఆశ్చర్యపోయి స్వామి పాదములపై పడి శరణువేడుకొనెను. ఎక్కడో ఉన్న అతని బాధను అక్కల్‌కోట్‌లో ఉన్న శ్రీ స్వామి వారు చూసి అకస్మాత్తుగా వామన్‌బువా ముందు ప్రత్యక్షమై అతనిని ఆత్మహత్య చేసుకున్న సమయమున నది నుండి బైటకు లాగి రక్షించిన పిదప అదృశ్యమైన శ్రీ స్వామి సమర్థ వామన్ బువా ఎన్నడు స్వామిని చూడలేదు కదా! పైగా మొదటిసారిగా అక్కల్‌కోట్‌కు వచ్చినప్పుడు శ్రీ స్వామి సమర్థ "నీవేనా ఆత్మహత్య చేసుకొనుటకు ప్రయత్నించితివి" అని అనగా వామన్‌బువా శ్రీ స్వామి మహిమను చూసి ఆశ్చర్యపోయెను. అవధూతలంటేనే అవధులు లేనివారిని వారి దృష్టి యావత్ ప్రపంచములో ఎక్కడ ఏది జరుగుతున్నదో తెలియువారని  రుజువైనది.

బొంబాయిలో ఠాకూర్‌దాస్ అనునతను దత్తాత్రేయుని భక్తుడు. పైగా శ్రీ స్వామి సమర్థ గుడిని కూడా కట్టినవాడు. దేవాలయములో కూర్చుని స్వామిపై భజనలు పాడుతూ ఉండేవారు. అంతటి భక్తుడైనప్పటికి తన శరీరమంతా తెల్లటి మచ్చలతో బాధపడుచుండెడివాడు. ఒకసారి శ్రీ స్వామి సమర్థ మండుతున్న కట్టెను అతనిపై విసిరెను. ఠాకూర్ దాస్ ఆ కట్టెను చూర్ణముగా చేసి అందులో కాలిన బూడిదెను కూడ కలిపి తన శరీరముపై గల మచ్చలపై పూసుకొనెను. కొన్ని రోజులకే ఆ మచ్చలు మాయమయ్యెను.

మరియొకనికి కుష్టువ్యాధితో బాధపడుచుండెను. చాలా పుణ్యక్షేత్రములు కూడా తిరిగెను. అతను పండరీకపురమునకు రాగా అతని కలలో విఠోబా కనబడి అక్కల్‌కోట్‌కు పొమ్మని అక్కడతనికి వ్యాధి

నివారణమగునని విఠోభా దేవునికి చెప్పెను. అతను దానిని పట్టించుకొనలేదు. మళ్ళీ విఠోభా స్వప్నమునందు దర్శనమిచ్చి మళ్ళీ అదే చెప్పెను. వెంటనే అతను అక్కల్‌కోట్‌కు వెళ్ళి శ్రీ స్వామి సమర్ధను మూడు సం॥లు సేవించుకొనెను. శ్రీ స్వామి సమర్ధ అతనికి గంధము పొడి ఇచ్చి ఆ పొడిని వంటిపై రాసుకొనమని ఆజ్ఞాపించెను. అలా చేయగానే అతనికి కుష్టువ్యాధి పూర్తిగా నయమయినది. అతను శ్రీ స్వామికి భక్తుడయ్యెను.

ఒక బ్రాహ్మణుడు ఆస్తమాతో బాధపడుచుండెను. తన బాధను శ్రీ స్వామికి చెప్పుకొనగా శ్రీ స్వామి సమర్ధ చిలకడదుంపను వేగించుకొని తినమనెను. ఆ బ్రాహ్మణుడు స్వామి చెప్పినట్లుగా చెయ్యగా అతని వ్యాధి పూర్తిగా నివారణమైనది.

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము 28

## (పేదలపాలిట పెన్నిధి – శ్రీ స్వామి సమర్థ)

గత రెండు అధ్యాయములలో శ్రీ స్వామి సమర్ధ తన అనంత శక్తిచేత నివారణ కానటువంటి రోగములనెన్నెన్నో నయము చేసిరి. రోగములకు నివారణమందుకాదు, స్వామి కృప మాత్రమే అని తెలిసింది. ఈ అధ్యాయములో స్వామి తన అపారమైన కరుణచేత తన భక్తులకు సమయానికి ధనము నొసంగుట చూద్దాం.

రాజస్థాన్‌లో ఒక యువకుడు అక్కల్‌కోట్‌కు వచ్చి శ్రీ స్వామి సమర్ధను సేవ చేసుకొనుచుండెను. అతను మార్వాడీ కుర్రవాడు. తన ఇంటి నుండి అతనిని తిరిగి రమ్మని తన బంధువులు ఎన్నో ఉత్తరములు రాసినారు. అయినా ఆ కుర్రవాడు మూడు సం॥లు స్వామిని వదలక అక్కల్‌కోట్‌లోనే నివశించినాడు. చివరికి అతని తండ్రి మరియు మేనమామ అక్కల్‌కోట్‌కు వచ్చి ఆ అబ్బాయిని తీసుకువెళ్ళుటకు నిర్ణయించుకున్నారు. వారు తిరిగి వెళ్ళుపోవు సమయమున శ్రీ స్వామి సమర్ధను దర్శించుకొనేందుకు వెళ్ళగా శ్రీ స్వామి ఇట్లనినారు. **"నీకు ఇవ్వటానికి నా దగ్గర ఏదియులేదు. కావాలనుకుంటే అక్కడ పడివున్న నాలుగు ఎముకలను ఏరుకుని తీసుకుపో"** అని అనగా ఆ కుర్రవాడు స్వామి ఆజ్ఞను శిరసావహించి భయముతో నాలుగు ఎముకలను ఒక బట్టలో కట్టుకుని తన ఇంటికి వెళ్ళినాడు. మర్నాడు ఆ మూట మరింత బరువైనది. అతను భయముతో మూటను విప్పగా ఆ మూటలో ఎముకలకు బదులుగా బంగారపుముద్ద ఉండుట చూసి ఆశ్చర్యపోయినాడు. ఆ దెబ్బతో అతను ధనవంతుడై శ్రీ స్వామి సమర్ధకు భక్తుడై శ్రీ స్వామి మహిమను అక్కల్‌కోట్‌లోని జనులకు చెప్పినాడు.

మరియొక బ్రాహ్మణుడు అక్కల్‌కోట్‌లోనే ఉంటూ శ్రీస్వామి వారికి సేవచేస్తూ కాలం గడిపాడు. ఒకసారి శ్రీ స్వామి సమర్ధ చిన్న పిల్లవాడి వలె ఎముకలతో ఆడుకొనుట చూసినారు. శ్రీస్వామి ఆ బ్రాహ్మణుడితో **"నీకెన్ని ఎముకలు కావాలో అన్ని తీసుకువెళ్ళు"** అని అనగా ఆ బ్రాహ్మణుడు ఎముకలను ముట్టుకొనుటకు సందేహించినాడు. చివరికి ఎట్లాగైతేనేం స్వామి చెప్పినట్లుగా చేయగా ఎముకలకు బదులుగా బంగారము మూట విప్పిచూడగా కనబడినది. అతను ఎంతో ఆనందపడి తనకున్న కష్టములుపోయి స్వామి భక్తుడైనాడు.

బొంబాయిలో గోవింద్‌రావ్ అనునతడు మరియొక బ్రాహ్మణునితో కలసి గాణ్గాపురమునకు వెళ్ళగా వారికి స్వప్నములో శ్రీ గురువు కనిపించి అక్కల్‌కోట్‌కు వెళ్ళమని ఆజ్ఞాపించినారు. వారిరువురు అక్కల్‌కోటకు వెళ్ళి శ్రీ స్వామిని సేవించగా శ్రీ స్వామి ఇట్లనినారు. **"ఊరి చివర మశీదులో ఒక ఫకీరు కుక్కను పెట్టుకొని కూర్చుని ఉన్నాడు. మీరిరువురు వెళ్ళి వారికి భిక్షపెట్టమని"** ఆజ్ఞాపించినారు. వారిరువురు మశీదుకు వెళ్ళగా అక్కడొక ఫకీరు కుక్కతో సహా ఉండుట చూచినారు. ఆ ఫకీరు వారిరువురితో ఇట్లనినారు. **"మిమ్మల్ని శ్రీ స్వామి సమర్ధ పంపినారా నాకు తెచ్చిన ఆహారము ఏది నాకివ్వండి"** అని అనగా వారిరువురు ఆ ఫకీరుకు ఆహారమివ్వగా ఆ ఫకీరు మరియు కుక్క ఆరగించి కొద్దిగా పళ్ళెంలో మిగిల్చినారు. ఆ ఇరువురు స్వామి సమర్ధ వద్దకు వచ్చి జరిగినది చెప్పగా శ్రీ స్వామి ఆ ఫకీరు మిగిల్చిన ఆహారమును తినమని ఆజ్ఞాపించగా గోవింద్‌రావ్ తినుటకు సందేహించినాడు. బ్రాహ్మణుడు మాత్రం వెంటనే తినినాడు. శ్రీ స్వామి సమర్ధ ఆ బ్రాహ్మణున్ని మెచ్చుకుని ఇట్లనినారు. **"నీవు బొంబాయికి వెళ్ళగనే నీకు రూ. 10,000 ల రూ॥లు లభిస్తా"యని మరియు శ్రీ స్వామి గోవింద్‌రావ్‌తో ఇట్లనినారు, "నీవు భక్తిలో ఇంకా ఎదగలేదు. కావున నీవు ఇంకాసేవ చేస్తూ ఉండవలెను".** బ్రాహ్మణుడు బొంబాయికి వెళ్ళగా అక్కడొక ధనవంతుడు మరణించగా అతని భార్య తన మనస్సులో ఎవరైతే మొట్టమొదటి బ్రాహ్మణుడు తన ఇంటి ముంగిట కనిపించునో ఆ బ్రాహ్మణుడికి 10,000 రూ॥ల ధనము ఇచ్చెదనని అనుకొనినది. అదే సమయములో అక్కల్‌కోట్ నుండి వచ్చిన ఆ బ్రాహ్మణుడు కనిపించగా ఆమె 10,000 రూ॥ల ధనము అతనికి కానుకగా ఇచ్చినది. ఆ బ్రాహ్మణుడు శ్రీస్వామి సమర్ధ చెప్పిన మాటలు గుర్తుకువచ్చి ఆనందముతో ఇంటికి వెళ్ళెను.

గణేష్ మూలేకర్ అనునతడు శ్రీ స్వామికి గొప్ప భక్తుడు. అతను మరాఠీలో స్వామి సమర్ధ చరితము వ్రాసెను. అతను కలెక్టర్ ఆఫీసులో పనిచేయుచుండగా అతని చేతిరాత బాగుండక పోవుటచే అతని ఉద్యోగము పోయినది. అతను నిరాశ చెంది శ్రీ స్వామి సేవలో నిమగ్నుడై ప్రతిదినము స్వామికి నైవేద్యము పెట్టుచుండెడివాడు. ఒకసారి స్వామి వద్దనున్న మరియొక శిష్యుడు, మూలేకర్‌కి పెరుగు తెచ్చి స్వామికి నివేదించమని చెప్పగా మూలేకర్ పెరుగు తెచ్చుటకు పోతూ అతనితో తన నిరుద్యోగము గురించి స్వామికి చెప్పమని చెప్పగా ఆ శిష్యుడు మూలేకర్ సమస్యను స్వామి ముందరపెట్టెను. అప్పుడు శ్రీ స్వామి **"నీకు**

**ఉద్యోగము దొరుకును"** అని అనగా మూలేకర్ జీతము ఎంత అని అడుగగా శ్రీ స్వామి **"లక్ష రూపాయలు"** అని బదులు పలికెను. మూలేకర్ తన ఇంటికి వెళ్ళగా కలెక్టర్ ఆఫీసు నుండి అతనికి ఒక ఉత్తరము వచ్చెను. అతనికి కలెక్టర్ ఆఫీసులోనే మొదట క్లర్కుగా తరువాత తన ఉద్యోగములో అభివృద్ధి పొంది చివరకు అసిస్టెంట్ కలెక్టర్‌గా అయి స్వామి చెప్పినట్లుగా ఎంతో ధనము సంపాదించెను.

శ్రీ స్వామి పేదల పాలిట పెన్నిధి అని రుజువైనది

జై శ్రీ స్వామి సమర్ధ

## అధ్యాయము 29

## (అక్కల్‌కోట సంస్థానపు రాజైన మాలోజీరావ్ భోంస్లేకు సంతానము - సాంగ్లీ సంస్థాన రాజైన తాత్యాసాహెబ్ పట్వర్దన్ యొక్క అహంకారముదించుట, బరోడా బాబాసాహెబ్ సంస్థానములో ఘోర్‌పడేకు సంతానప్రాప్తి)

అక్కల్‌కోట సంస్థానపు రాజైన భోంస్లే తన ఆడంబరము ప్రదర్శించుటకై స్వామి వద్దకు తన జన్మదినము సందర్భమునరాగా ఆ రాజు శ్రీ స్వామి వారిచే లెంపకాయ తిన్న విషయము ముందు అధ్యాయములో చెప్పబడినది. అప్పటి నుండి ఆ రాజు చాలా జాగ్రత్తగా శ్రీ స్వామి వద్ద తన ప్రవర్తన చూపేవారు. వారికి సంతానము లేదు. ఆ దంపతులు శ్రీ స్వామిని తమ మనస్సులో వేడుకొనగా శ్రీ స్వామి వారి మనోభావమును తెలిసికొని వారికి సంతానము కలుగునని అభయమిచ్చెను. ఆ దంపతులు పుట్టబోవువారు ఎవరని అడుగగా శ్రీ స్వామి సమర్ధ ఒకరోజు **"నాకు గాజులు కావాలి"** అని అన్నారు. మరియు పొయ్యి ముందు కూర్చున్నారు. ఆ దంపతులు శ్రీ స్వామి చేష్టలను గ్రహించి తమకు పుట్టబోవువారు ఆడపిల్లని గ్రహించినారు. అయితే ఆ రాజ్యానికి వారసుడైతే మేలని తలువగా శ్రీ స్వామి సమర్ధ ఒకనాడు ఫిరంగి వద్దకుపోయి **"నిప్పు పెట్టండి"** అని అరచినారు. స్వామి చేష్టలను గ్రహించి తమకు మగబిడ్డను ప్రసాదించుచున్నారని ఆనందించినారు. శ్రీ స్వామి ఆశీర్వచనము వల్ల ఆ దంపతులకు మగబిడ్డ పుట్టినాడు.

ఒకసారి రాజా మాలోజీరావ్ తన స్నేహితుడైన తాత్యాసాహెబ్ పట్వర్దన్‌తో కలసి శ్రీ స్వామి కడకు వచ్చినారు. ఆ తాత్యాసాహెబ్, సాంగ్లీ సంస్థానపు రాజు మాలోజీ రావ్ పల్లకీదిగి స్వామి పాదములకు నమస్కరించగా, సాంగ్లీరాజు పల్లకీ దిగకుండా అహంకారముతో పల్లకీలోనే శ్రీ స్వామి దగ్గరకు వెళ్ళెను. శ్రీ స్వామి వెంటనే **"ఏమిరా నన్ను గుర్తించ లేదా. నీవు ఎవరికంటె పెద్దవాడివి. నీవు ఎవరికి రాజువి. నీ పూర్వ జన్మ మరచినావా ?"** అని అనగా ఆ రాజు వెంటనే పల్లకీదిగి శ్రీ స్వామికి బంగారపు ఉంగరములు మరియు కోవ ఇవ్వగా శ్రీ స్వామి ఆ ఉంగరములను ముట్టక **"నీకు అవి రత్నాలు కావచ్చునుగాని నాకు**

**మటుకు అవి రాళ్ళు తీసి పారవేయి"** అని అన్నారు. అతను ఆశ్చర్యముతో స్వామి చేష్టలను చూసి ఆనందపడి క్షమాపణ కోరినాడు.

బాబాసాహెబ్ ఘోర్పడే అనునతను బరోడా సంస్థానములో చిన్న ఇనాముదారుగా ఉన్నాడు. అతని భార్యపేరు గంగాబాయి. వీరికీ సంతానములేదు. శ్రీ స్వామి సమర్దను శరణువేడగా శ్రీ స్వామి అనునిత్యము హరివంశము చదివించుకుని వినమని ఆజ్ఞాపించినారు. ఆ దంపతులు స్వామి ఆజ్ఞ ప్రకారము చేయగా వారికి సంతానము కలిగినది.

శ్రీ స్వామి సమర్ద మహిమాన్వితుడు. భయంకరమైన రోగములను నివారింపచేసిన మహనీయులు. మరణించిన వారిని కూడా బ్రతికించిన మృత్యుంజయుడు. పేదలపాలిట పెన్నిధిగా తనను నమ్ముకున్న భక్తునకు సన్నిధిగా ఉంటూ రక్షించే అభయప్రదాతుడు రాజైతేనేమి, నిరుపేదైతేనేమి ఇద్దరూ సమానమే. ప్రభువుల సంపదలకు ఆడంబరమునకు లొంగనివాడు. నిరుపేద భక్తులకు వారి ప్రేమకు లొంగేవాడు. ఆడంబరములు ప్రదర్శిస్తే ఆగ్రహము చూపిస్తారు. అనురాగము చూపితే అనుగ్రహిస్తారు. సంతానము లేనివారికి సంతానప్రాప్తి కల్గిస్తారు. జరిగినవి, జరుగుతున్నవి మరియు జరుగబోయేవి కూడా చెప్పే శక్తి సామర్ధ్యములు ఉన్నవారు. శ్రీ దత్తుడంటే మాటలా! సృష్టి స్థితి లయకారుడు. త్రిమూర్త్యాత్మక రూపుడు, గుణాతీతుడు. సర్వలోక సంరక్షకుడు. ఆది గురువు. జగద్గురువు. అటువంటి గురులీలలు ఎన్నెన్నో కలవు. కలియుగములో అవతారము దాల్చిన శ్రీ దత్తుని రూపాలు ఎన్నెన్నో. మరియు నామాలు ఎన్నెన్నో. ఒక్కొక్క రూపములో చిత్ర విచిత్రాలు చూపి ఎన్నో మహిమలను చూపిన ఆ దత్తుని గురించి ఏమి చెప్పగలము ఎంతని రాయగలము.

జై శ్రీ స్వామి సమర్ద

## అధ్యాయము 30

### (ఎవరు ఏ రూపములో ఆరాధిస్తారో ఆ రూపములోనే శ్రీ స్వామి సమర్థ దర్శనమిచ్చుట)

భగవద్గీతలో శ్రీ కృష్ణ పరమాత్మ 4వ అధ్యాయము 11వ శ్లోకమున ఇట్లనినారు. "అర్జునా! ఎవరు ఏ ఏ రూపములలో నున్న ఆరాధిస్తావో నేను ఆ రూపములలోనే దర్శనమిస్తాను". 27వ అధ్యాయములో ఒక మహాత్ముడు శ్రీ స్వామి సమర్ధను దర్శించుటకు వచ్చినపుడు, శ్రీ స్వామి సమర్థ ఇట్లనినారు. **"నీవు ద్వారకకు పోదలచితివా! ఆ కృష్ణపరమాత్ముణ్ణి దర్శించుకోదలచితివా!"** అని చతుర్భుజములతో శ్రీ స్వామి సమర్థ కృష్ణ భగవానుడిగా మారి దర్శనమిచ్చినారని తెలుసుకుంటివి.

27వ అధ్యాయములోనే పూనా నివాసియగు నందారామ్ అక్కల్‌కోట్‌కు వచ్చి శివాలయమునకు పోగా శివలింగము ఉండవలసిన స్థానములో శ్రీ స్వామి సమర్థ ఉండుట చూసి శ్రీ స్వామి సమర్థయే ఆ పరమశివుడని గ్రహించెను.

బరోడా నివాసి రామశాస్త్రి అక్కల్‌కోట్‌కు వచ్చినారు. వారు స్వామిని దర్శించిన తరువాత దక్షిణ దేశములోగల శ్రీ కార్తీక శ్రీ స్వామిని దర్శించేందుకు వెళ్ళవలెనని సంకల్పించినారు. స్వామి అనుమతి కోరగా స్వామి ఆజ్ఞ ఇవ్వలేదు. రామశాస్త్రి గారు. ఒక కార్తీక పౌర్ణమినాడు శ్రీ స్వామికి హారతి ఇచ్చుచుండగా శ్రీ స్వామి సమర్థ కార్తీక స్వామిగా మారి దర్శనమిచ్చినారు. అప్పటినుండి శ్రీ స్వామి సమర్థయే సకల దేవతా స్వరూపుడని అక్కల్‌కోటయే సకల పుణ్యక్షేత్రాలని తలచి శ్రీ స్వామి సేవలో ఉండిపోయినారు.

శ్రీ స్వామి సమర్థ భక్తుడైన చింతోపంత్ వద్ద శ్రీ మహావిష్ణువు విగ్రహమున్నది. అతను తనయింట ఆ విగ్రహానికి అనునిత్యము పూజ చేసేవారు. ఒకసారి కోటి తులసి పూజ చేయాలని సంకల్పించి ప్రారంభించగా సరిగ్గా పూజ సమయానికి శ్రీ స్వామి సమర్థ తన యింటికి వచ్చేవారు. చింతోపంత్, శ్రీ స్వామి సమర్థ సాక్షాత్తు మహావిష్ణువే అని గ్రహించి తులసి దళములు ఆ విగ్రహానికి పూజ చేయకుండా శ్రీ స్వామి చరణాల మీద వేస్తూ ఆనందముతో మునిగిపోయినారు. శ్రీ స్వామి ఆశీనులైన పీటమీద వారి పాదములు ముద్రింపబడినాయి.

ఒకసారి ఒక ముస్లిమ్ సయ్యద్ మహమ్మద్ అను తత్త్వవేత్త శ్రీ స్వామి సమర్థ ఎక్కడున్నారని వెతుకుతూ శ్రీ స్వామి కడకురాగా శ్రీస్వామి సమర్థ "నేనే ఆ స్వామిని" అని చెప్పగా సయ్యద్ మహమ్మద్ శ్రీ స్వామిని చూడగనే మరియు శ్రీ స్వామి గంభీరస్వరము వినగనే భయపడిపోయి కనులు మూసుకున్నారు. కాసేపటికి మేల్కొని మోకాళ్ళ మీద కూర్చొని సయ్యద్ మహమ్మద్ ఇట్లనినారు. **"ఓ స్వామీ నీవు సాక్షాత్తు హజరత్ అలీయే. నేను ఎందరినో దర్శించాను. కాని ఇంతటి మహాదర్శనము ఎన్నడు కలుగలేదు. నీ సేవ చేసుకునే భాగ్యము కల్గించ"**మని కోరగా శ్రీ స్వామి సమర్థ ఇట్లనినారు, **"నేను సర్వాంతర్యామిని కావున నీవు**

**హైదరాబాద్ లోనే ఉండి సాధన చేసికొనమని"** ఆజ్ఞాపించినారు.

నైజాం ప్రాంతమునుంచి మరియొక ముస్లిం భక్తుడు స్వామిని దర్శించుకొనుటకు అక్కల్‌కోటకు వచ్చి తనకు శాంతిని ప్రసాదించమని కోరగా శ్రీ స్వామి సమర్థ అతనివైపు తదేకముగా చూసి **"ఎరుకతో దైవాన్ని తెలుసుకో"** అనిన వెంటనే ఆ ముస్లిం భక్తుడు సమాధిలోకి వెళ్ళిపోయినాడు. తిరిగి స్పృహ వచ్చిన పిదప అతనికి దర్గా, మక్కా మదీనా దర్శనమైనదని శ్రీ స్వామి పాదములపైబడి నమస్కరించినాడు.

శ్రీ స్వామి సమర్థ తరువాత అవతారమనగా శిరిడీలోని సాయిబాబా వారు కూడా తన భక్తులకు ఎవరు ఏయే రూపములలో బాబాను ఆరాదించెదర ఆ రూపములో గల భగవద్దర్శనప్రాప్తి కలిగించేవారు ఆ సాయినాథుడు.

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము 31

## (శ్రీస్వామి సమర్థనే పరీక్షించుట)

గత అధ్యాయములో శ్రీ స్వామి సకల దేవతా స్వరూపుడని రుజువైనది. శ్రీ స్వామి సమర్థ తనను నమ్ముకున్న భక్తులకు అంబగా కూడా దర్శనమిచ్చినారు. అటువంటి పరబ్రహ్మ స్వరూపమైన శ్రీ స్వామి సమర్థను కొందరు పరీక్షించుటకు కూడా అక్కల్‌కోట్‌కు వచ్చినవారు ఉన్నారు.

శ్రీ స్వామి సమర్థ అక్కల్‌కోటలో తమ మహిమలను చూపిన పిదప వారిపేరు దేశమంతటా వ్యాపించినది. అనేకమంది భక్తులు స్వామి దర్శనార్థమునకై వచ్చి పోయెడివారు. వారు రుచికరములైన పదార్థములను తెచ్చి స్వామికి అర్పించేవారు. ఒక భక్తుడు ఆ పదార్థములన్నింటిని చూసి తన మనస్సులో ఇట్లనుకొనినాడు. **"నిజమైన సాధువుకు రుచికరములైన పదార్థములెందుకు?"** శ్రీ స్వామి సమర్థ అందరి మనసులలో దాగియున్నవి కనిపెట్టే మహానుభావుడు. వెంటనే శ్రీ స్వామి ఆ పదార్థములన్నిటిని విసిరిపారేసి సుమారు రెండుసేర్ల పచ్చిమిరపకాయలను తిని కూర్చున్నారు. ఆ భక్తుని సందేహానికి శ్రీ స్వామి సమర్థ ఆవిధముగా సమాధానము చూపినారు.

ఒకసారి అక్కల్‌కోట్‌లో రాధ అనే వేశ్య స్వామిని పరీక్షించుటకై వచ్చినది. ఆమె చాలా అందగత్తె. ఏ పురుషుడైనా ఆమె అందానికి లొంగవలసిందే. ఆమె మనస్సులో ఒక దుర్బుద్ధి కలిగినది శ్రీ స్వామి అంతటి మహనీయుడు ఆమె దాసుడైతే ఎంతో ఘనత లభిస్తుందని భావించి బాగా అలంకరించుకుని శ్రీ స్వామి సమర్థ యొద్దకు వచ్చి కూర్చున్నది. తన మనస్సులో ఇట్లనుకొనినది, **"ఆహా ఆ దివ్యమైన శరీరము ఎప్పుడైనా స్త్రీ స్పర్శ కలిగినదా"** అని అనుకున్నంతనే శ్రీ స్వామి సమర్థ **"నీకేమి కావలెను"** అని అనగా ఆమె తన

దుర్బుద్ధి చూపులతో స్వామిని పడవేలయవలెనని చూడగా శ్రీ స్వామి సమర్ద **"స్త్రీ పురుషులకు భేదమేమి ? స్త్రీలో ప్రత్యేకంగా ఉన్నది ఏమి?"** అని అడుగగా ఆ వేశ్య **"స్త్రీలో అందముగా ఉన్నవి రెండు. ఆ రెండు కానుకలను తెచ్చినానని"** అనగా, శ్రీ స్వామి సమర్ద వెంటనే, **"నీకున్నాయా, నీ శరీరానికున్నాయా ? వానిని తీసి మరొకరికి ఇవ్వగలవా ? వాటిని నేను స్వీకరించానులే"** అనినంతనే ఆ వేశ్య యొక్క స్తనాలు పోయి పురుషుని ఛాతీగా మారిపోయినది. ఆ వేశ్య ఆశ్చర్యపోయి చాలా తప్పు చేసితినని భావించి స్వామిని శరణువేడి తన వృత్తిని మానివేసి కాశీకి వెళ్ళిపోయినది.

ఒక సన్యాసికి సిద్దులు మరియు స్వర్ణయోగమునుచేసే శక్తిని సంపాదించినాడు. ఆ గర్వముతో గొప్ప యోగిగా తలచి స్వర్ణయోగము తెలియని వారు యోగులు కారని చెప్తూ ఉండేవాడు. శ్రీ స్వామి సమర్ద మహిమలను శ్రీ స్వామి భక్తుని ద్వారా విని ఆ సన్యాసి స్వామి భక్తునితో తనలాగా బంగారము చేయగల సామర్థ్యము స్వామి సమర్దకు కలదా అని ప్రశ్నింపగా ఆ స్వామి భక్తుడు శ్రీ స్వామి సమర్దను దర్శించుకొనమని చెప్పగా ఆ సన్యాసి గర్వముతో వెళ్ళిపోయెను. మర్నాడు ఉదయం ఎప్పటిలాగా బంగారం తయారుచేయుటకు కూర్చొనగా తన ప్రయత్నం వ్యర్థమైనది. ఎన్నిసార్లు ప్రయత్నించినా బంగారమునకు బదులు బొగ్గు వచ్చినది. ఆ సన్యాసి కోపముతో శ్రీ స్వామి సమర్ద భక్తుని వలెనే ఇదంతా జరిగినదని భావించి ఒక పెద్ద రాయిని అతనిపై విసరగా ఆ రాయి భక్తునికి తగలకుండా తిరిగి వెనుకకు వచ్చి సన్యాసిపై పడినది. ఈ అద్భుత లీలను చూసిన సన్యాసికి తన తప్పును తెలుసుకుని అక్కల్‌కోట్‌కు చేరగా శ్రీ స్వామి సమర్ద అతనివైపు కోపముతో చూస్తూ ఇట్లనిరి. **"వెధవా నీకంత గర్వమా! రాయి విసురుతావా! బంగారం చేయబోతే బొగ్గు వచ్చినది కదా! చావలేకపోయావా! నీకు స్వర్ణయోగము కావాలా! అయితే ఎదురుగా నున్న చెట్టుకేసి చూడమ"నెను.** శ్రీ స్వామి చూపించిన ఆ చెట్టు నిలువెల్లా బంగారమైపోయినది. ఆ సన్యాసి తన తప్పు తెలుసుకుని స్వామి పాదములపైబడి క్షమాపణ వేడినాడు.

శ్రీ దత్తుని పరీక్షించుట మనతరమా ? అక్కల్‌కోట్‌లో నున్న శ్రీ స్వామి సమర్దకు ఎక్కడోనున్న సన్యాసి యొక్క స్వభావము మరియు తన భక్తుడిపై రాయి విసిరిన సంగతి శ్రీ స్వామి సమర్ద తెలుసుకుని తప్పు చేసినవారిని నిందించి అక్కల్‌కోటకు వచ్చిన సన్యాసిని శ్రీ స్వామి సమర్ద బాగా తిట్టి ఆ సన్యాసి యొక్క గర్వమునణచి కళ్ళు తెరిపించినారు. **భగవంతుడు భక్తులను పరీక్షించవలెనుకాని భక్తులు భగవంతుడిని పరీక్షించకూడదు.**

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము 32

## (ప్రకృతిని తన స్వాధీనమున ఉంచుకొనిన శ్రీ స్వామి సమర్ధ)

శ్రీ దత్తుడు అతీతమైన శక్తి కలవాడు. పంచభూతములు వారి ఆధీనములో నుండి వారు చెప్పినట్లుగా చేయును. శ్రీ దత్తుని అవతారమగు శ్రీ స్వామి సమర్ధ ప్రకృతిని ఏవిధంగా తన ఆధీనములో నుంచెనో చూచెదము.

ఒకసారి అక్కల్‌కోటలో కరువు ఏర్పడినది. అక్కల్‌కోట ప్రాంతములో వర్షాలుపడక పంట నష్టం అయినది. అందువలన ప్రజలకు చాలా ఇబ్బంది కల్గినది. ఆ కరువుకి తట్టుకొనలేక ప్రజలందరు శ్రీ స్వామి సమర్ధకు చెప్పి శరణుకోరిరి. ఆ సమస్య నుండి కాపాడమని వేడుకొనెను. శ్రీ స్వామి సమర్ధ వేదాలలోని పర్జన్య సూక్తమును, మరియు రేణుకా సహస్రనామ పారాయణము చేయించమని ఆజ్ఞాపించినారు. ఒకరోజు శ్రీ స్వామి సమర్ధ జేవూరు అనే గ్రామమునకు వెళ్ళిరి. ఈ గ్రామమున వర్షాలు లేక పోవుటవలన చివరకు మంచినీరు కూడా దొరక్కపోయినది. ఆ గ్రామములోని ప్రజలు అల్లాడిపోయిరి. అటువంటి క్లిష్ట పరిస్థితులలో శ్రీ స్వామి సమర్ధ ఆ గ్రామమునకు చేరినారు. 'ఊరకరారు మహాత్ములు' అనునట్లుగా శ్రీ స్వామి ఆ క్లిష్ట పరిస్థితులలో ఆ గ్రామములోని ప్రజల దుఃఖాన్ని తొలగించుటకై వచ్చినారు. శ్రీ స్వామి సమర్ధ అవదూతలకు ఎక్కడ ఏమి జరుగుతున్నదో ఎవరికి ఏ కష్టము వచ్చెనో వారికి ఇట్టే తెలిసిపోతుంది. వారు బైట పడకుండా ఏదో ఒక నెపముతో కష్టాలు ఉన్నవారి వద్దకు వారే కదలివచ్చి రక్షించెదరు. అలా శ్రీ స్వామి సమర్ధ జేవూరి గ్రామములోని పరిస్థితులను తెలిసికొని ఆ గ్రామములో వారి దివ్యపాదములను మోపినారు. శ్రీ స్వామి సమర్ధ ఆ గ్రామములోని శివాలయమునకు వెళ్ళి శివలింగమును చూస్తూ **"వర్షాలు ఇంకా పంపలేదేమి?"** అని గట్టిగా అరచినారు. ఆ గ్రామమునకు దగ్గరలో ఉన్న వారసంగ్ అనే మరొక గ్రామమునకు వెళ్ళి అక్కడ శివాలయములో విగ్రహాలను చూసి ఆ దేవతలందరిని తిట్టి **"నీకు శనగలు కావాలా?"** అని మళ్ళీ గర్జించినారు. ఆ వూరి ప్రజలు శనగలు తెప్పించి శ్రీ స్వామికివ్వగా శ్రీ స్వామి సమర్ధ ఆ శనగలను శివపార్వతులపై మరియు ప్రక్కనున్న విగ్రహములపై చల్లినారు. అంతేక్షణములో మేఘాలు కమ్మి భయంకరమైన వర్షము పడినది. కరువు తీరిపోయినది. అన్ని గ్రామములలోని ప్రజలు శ్రీ స్వామి సమర్ధ యొక్క లీలను చూసి ఆశ్చర్యపోయి శ్రీ స్వామి పాదములపై పడినారు.

శ్రీ స్వామి సమర్ధ తదుపరి అవతారమగు అనగా శ్రీదత్తుని ఐదవ అవతారమగు శిరిడీలోని శ్రీసాయి బాబా వారు కూడా ఇలాంటి లీలనే చూపినారు. ఒకసారి శిరిడీ గ్రామములో అతి భయంకరమైన వర్షము కురవగా ఆ ఊరిలోని జనులు ఆ వర్షానికి భయపడిపోయి శ్రీ సాయిని శరణు వేడగా శ్రీ సాయి ఆకాశములోకి చూసి "ఆగు నీ తీవ్రత తగ్గించు" అని అన్నంతనే కుంభవృష్టి వెంటనే ఆగిపోయి ఆకాశము నిర్మలమై

మేఘములు తొలగిపోయినవి. శ్రీ స్వామి సమర్ద వర్షాలు లేనిచోట మబ్బులు తెప్పించి కుంభవృష్టి కురిపించి లీలను చూపగా శ్రీ శిరిడీ సాయి కుంభవృష్టి పడుతున్నప్పుడు మరియు ఆకాశమంతా మేఘాలు నిండిన వానిని తన లీలచేత ఆ కుంభవృష్టిని ఆపి, ఆ మేఘాలను తొలగించినాడు. శ్రీ దత్తుని చేతిలో పంచ భూతములన్ని వారు చెప్పినట్లుగా విని పాటించునని తెలియుచున్నది.

జై శ్రీ సాయి సమర్ద

## అధ్యాయము 33

## (శ్రీ స్వామి సమర్ద ఆజ్ఞలేనిదే ఏ కార్యము సాధ్యపడదు – శ్రీ స్వామి సమర్ద ఆజ్ఞ ఇచ్చిన తరువాత సాధ్యము కానిది ఏదీలేదు)

శ్రీ స్వామి సమర్ద అక్కల్‌కోటకు వచ్చిన తరువాత వారి పేరు మరియు వారి లీలలు అంతా వ్యాపించి జనాలు తండోపతండాలుగా స్వామిని దర్శించుకొను చుండిరి. అదే సమయములో  కొడక్ ఇండియా లిమిటెడ్ అను ఫోటో కంపెనీ బొంబాయిలో క్రొత్తగా స్థాపించినారు. వారు ప్రముఖుల యొక్క ఫోటోలను ప్రచురిస్తే వారి కంపెనీ బాగా అభివృద్ధి చెందుననే ఉద్దేశ్యముతో శ్రీ స్వామి సమర్ద లీలలను గాంచిన తరువాత అక్కల్‌కోటకు వచ్చి వారు వచ్చిన పని గురించి స్వామి సమర్ద శిష్యులకు చెప్పగా శ్రీ స్వామి వారి భక్తుడు శ్రీ స్వామి ఆజ్ఞలేనిదే కార్యము సాధ్యపడదని చెప్పిరి. ఆ ఫోటోగ్రాఫర్‌లు శ్రీ స్వామి సమర్దను కోరగా స్వామి పట్టించుకొనలేదు. నాలుగు రోజులు అలాగే గడిచిపోయినవి. ఫోటోగ్రాఫర్లు చివరకు శ్రీ స్వామి సమర్ద అనుమతి లేకుండానే శ్రీ స్వామి వారి ఫోటోను తీయుటకు కాచుకొని యుండిరి. సరియైన సమయము కోసం ఎదురుచూస్తూ శ్రీ స్వామి వారి ఫోటో తీయబోయే సమయానికి ఏదో ఒక ఆటంకము వచ్చుచుండెను. ఇలా చాలాసార్లు గడిచిన పిదప ఆ ఫోటోగ్రాఫర్లు శ్రీ స్వామి సమర్దకు తెలియకుండా ఒక ఫోటోను తీసినారు. నెగిటివ్‌ను కడిగి ఆ ఫోటోను శ్రీ స్వామి వారికి చూపించగా శ్రీ స్వామి సమర్ద ఆ ఫోటోను ఒక భక్తునికిచ్చి అందులో ఏముందో చెప్పుమనగా ఆ భక్తుడు ఆ ఫోటోను చూసి శ్రీ రామచంద్రుడని చెప్పెను. మరొక భక్తునికి చూపగా మహావిష్ణువని అనెను. ఇంకొక భక్తుడు అంబ భవాని ఫోటో అనెను. ఆ ఫోటోగ్రాఫర్లు స్వామి ఫోటోను పట్టుకొని ఆ భక్తుడు అలా అనుట విని నివ్వెరపోయి చివరకు శ్రీ స్వామి సమర్దనే సరిగ్గా చూసి చెప్పమన్నారు. శ్రీ స్వామి సమర్ద ఆ ఫోటోను చూచిన పిదప ఇట్లనిరి, **"నేను అంత ఘోరంగా ఉన్నానా?"** అని ఆ ఫోటోను ఆ ఫోటోగ్రాఫర్‌కివ్వగా వారు ఆశ్చర్యపోయిరి. ఎందుకనగా ఆ ఫోటోలో ఒక కోతిబొమ్మ కనిపించినది. ఆ ఫోటోగ్రాఫర్లు చెప్పకుండా శ్రీ స్వామివారి ఫోటోను తీసినందుకు క్షమాపణ వేడి వారు వచ్చిన ఉద్దేశ్యమును స్వామికి చెప్పి తిరిగి ప్రార్థించగా శ్రీ స్వామి సమర్ద అనుమతి ఇచ్చారు. ఆ

ఫోటోగ్రాఫర్లు మళ్ళీ శ్రీ స్వామివారి ఫోటోను తీయగా ఫోటో చాలా బాగా వచ్చినది.

ఒకసారి ఫడ్కే అనే ఫోటోగ్రాఫర్ ఫోటో తీయుటకు శ్రీ స్వామి వారి అనుమతిని పొంది సిద్ధమవగా శ్రీ స్వామి సమర్థ బాగా చీకటి పడేవరకు హుక్కా పీలుస్తూనే యున్నారు. ఆ ఫోటోగ్రాఫర్ చీకటి పడేదాకా వేచియుండెను. శ్రీ స్వామి చీకట్లోనే ఫోటో తీయమన్నారు. ఆ ఫోటోగ్రాఫర్ వెలుగు లేనిదే ఫోటో సరిగారాదని పైగా తన కెమెరాలో ఫ్లాష్ లేదని చెప్పగా శ్రీ స్వామి తీయమని ఆజ్ఞాపించినారు. అతను స్వామి చెప్పినట్లుగా చేయగా శ్రీ స్వామి సమర్థ చిత్రము చాలా స్పష్టముగా వచ్చినది.

అవదూతల చిత్రములను ఫోటో తీయవలెనన్న సాధ్యముకాదు. మనము వింటూనే ఉంటాము. మహాత్ముల యొక్క ఫోటోను తీసినా అవి కడిగిన పిదప ఫోటోలు రావని. వారి అనుమతి లేకుండ తీస్తే అవి రావు. అవే వారి అనుమతి తీసికొని తీస్తే వారి ఆశీర్వచనముతో స్పష్టముగా వచ్చును. **పరమాత్మని చిత్రములను కెమేరా పెట్టెలలో బంధించగలమా ? అది అసాధ్యమే!**

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము 34

## (శంఖేశ్వర పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకరాచార్యులు – శ్రీ పరమహంస సద్గురుస్వామి సంపూర్ణానంద – శ్రీ సత్యదేవానంద సరస్వతి – శ్రీ రామకృష్ణ పరమహంస)

శ్రీ శంఖేశ్వర పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకరాచార్యులు ఒకసారి అక్కల్‌కోటకు వచ్చినారు. వారు శ్రీ రాజా మాలోజీరావ్ వారి వద్ద బస చేసినారు. శ్రీ స్వామి సమర్థ రాజుగారి భవనమునకు వచ్చినారు. శ్రీ స్వామి వారిని శంకరాచార్యులు చూసి వారి దివ్య మంగళ విగ్రహానికి ముగ్ధులైనారు. ఒకరినొకరు చూసుకొనిరిగాని దగ్గరకు వెళ్ళి మాట్లాడలేదు. మధ్యాహ్నం భోజనవేళలో శ్రీ స్వామి సమర్థ కూర్చునుట చూసి కొందరు బ్రాహ్మణులు శ్రీ స్వామి వారిని బ్రాహ్మణుల పంక్తిలో కూర్చోవడం వలన ఎగతాళి చేసిరి. శ్రీ స్వామిని వేరుగా కూర్చోబెట్టినారు. అందరికి వడ్డన అయిన పిదప వడ్డించిన పదార్థములన్ని చెడువాసనతో మరియు పురుగులతో కనిపించినది. శ్రీ స్వామి సమర్థను అవమానం చేయుట వలన అట్లు జరిగినదని గ్రహించి బ్రాహ్మణులు శంకరాచార్యులవారికి జరిగిన విషయం చెప్పిరి. శ్రీ శంకరాచార్యుల వారు స్వామి వద్దకు వెళ్ళి నమస్కరించి ఆహ్వానించు తమతోపాటు భోజనమునకు రండి అని చెప్పిరి. శ్రీ స్వామి సమర్థ శంకరాచార్యుల వారి ప్రక్కన కూర్చొని భోజనము ప్రారంభించగా వడ్డించిన పదార్థములన్ని తిరిగి రుచికరములుగా మారినవి.

శ్రీ పరమహంస సద్గురుస్వామి సంపూర్ణానంద మహాయోగి శ్రీ స్వామి సమర్ధ యొక్క లీలలను విని స్వామిపై అనన్య భక్తి విశ్వాసములు కలిగియుండేవారు. శ్రీ స్వామి వారి ఫోటోను ఎప్పుడు ఉంచుకునేవారు.

ఆళందిలో శ్రీ సత్య దేవానంద సరస్వతి అనేయోగి అక్కల్‌కోటకు వచ్చి శ్రీ స్వామి సమర్ధుల పాదుకలను పూజించినారు. వారికి శ్రీ స్వామి వారు స్వప్న దర్శనమిచ్చి, శ్రీ స్వరూపానంద పరమహంస దర్శనము చేసుకోమని ఆజ్ఞాపించినారు.

శ్రీ స్వామి సమర్ధులు అక్కల్‌కోటకు రాకమునుపు చేసిన పర్యటనలో గంగాసాగర సంగమం వద్ద శ్రీ రామకృష్ణ పరమహంస కలసినారు.

నిజానికి యోగులంతా ఒక్కరే. కార్యాలు వేరుగా స్వీకరించి లోక కళ్యాణం కొరకై అవతరించి వారి కార్యములు సిద్ధించిన తరువాత వారి అవతారమును చాలించి ఎక్కడినుండి వచ్చారో అక్కడకు వెళ్ళిపోయెదరు. ఒకరు చేయవలసిన కార్యమును వేరొక యోగి ముట్టరు. కావుననే తన భక్తుల స్వప్నములలో యోగులు దర్శనమిచ్చి ఫలానా చోటుకి ఫలానా యోగి వద్దకు వెళ్ళమని ఆజ్ఞాపించెదరు. నామరూపాలు వేరైనా వారి సిద్ధాంతము ఒక్కటే.

**జై శ్రీ స్వామి సమర్ధ**

## అధ్యాయము 35

**(ఇక్కడినుండి మొదలైన అధ్యాయములు అన్నింటిలోను శ్రీ స్వామి సమర్ధతో సాంగత్యం ఉన్న కొందరి ముఖ్యభక్తులను గురించి చెప్పబడినది)**

### శ్రీ రామానంద బీడ్కర్ మహరాజ్

వీరు విశ్వబ్రాహ్మణ కుటుంబములో పుట్టినారు వారి కుటుంబీకులంతా భక్తికలవారు. తండ్రిపోయిన తరువాత ఇతను ఎన్నో పుణ్యక్షేత్రములకు వెళ్ళెను. ఇతని వ్యాపారము బంగారము చేయుట మరియు సుగంధ ద్రవ్యములు తయారు చేయుట. చాలా ధనం సంపాదించెను. కాని ఇంకా సంపాదించవలెనని ఆశతో దాని వలన చెడు అలవాట్లకు కూడా లోనైనాడు. బీడ్కర్‌కు అటువంటి దురలవాట్లు ఉన్న సమయములో ఒక సాధువు దర్శనమిచ్చి అదృశ్యమైనారు. అతను చేసిన పొరపాట్లన్నియు గ్రహించి మళ్ళీ ఆ సాధువు దగ్గరకు వెళ్ళి చెప్పుకున్నాడు. ఆ సాధువు విషయ భోగాలకు, ధన వ్యామోహమునకు, స్త్రీలోలత కలిగినవారికి యోగ విద్యలభించదని తిట్టి పంపించినారు. అప్పటినుండి అతనిలో మార్పు వచ్చి ప్రతిదినము ఆంజనేయుని గుడికి వెళ్ళివచ్చుచుండెను. ఒకసారి అతని స్వప్నములో అక్కల్‌కోటకు వెళ్ళి శ్రీ స్వామి సమర్ధను దర్శించమని ఆజ్ఞ వచ్చినది. బీడ్కర్ అక్కల్‌కోటకు వచ్చినప్పుడు శ్రీ స్వామివారు రాజభవనములో ఉన్నారని తెలిసివారి

దర్శనమయ్యే వరకు కటిక ఉపవాసము చేసెను. మూడు రోజులు గడిచిన పిదప శ్రీ స్వామి సమర్ధ బీడ్కర్ ఎదుట ప్రత్యక్షమయ్యెను. బీడ్కర్ శ్రీ స్వామిని శరణువేడగా శ్రీ స్వామి వారు తిట్టుట ప్రారంభించిరి. అయినా బీడ్కర్ తన పట్టు వదలక స్వామి పాదాలనే పట్టుకున్నాడు. అప్పుడు శ్రీ స్వామి సమర్ధ తన యోగదృష్టితో శక్తిపాతము చేసి **"నీవు వచ్చిన పని అయినదిపో"** అని పలికిరి. అతను తన నివాసమగు పూనాకు వెడలిపోయెను. అప్పటి నుండి శ్రీ స్వామినే తన గురువుగా భావించి బీడ్కర్ స్వామిని పూజించుచుండెను. సంవత్సరము తరువాత తిరిగి అక్కల్‌కోటకు వచ్చినపుడు స్వామిని దర్శించినపుడు శ్రీ స్వామి వారితో **"ఈ మామిడికాయ సగం పండినది"** అని అన్నారు. బీడ్కర్ సంతోషించి తన కాలమునంతా స్వామికి సేవ చేయవలెనని నిర్ణయించుకొనినారు.

**పాదసేవ :**

ఒకసారి శ్రీ స్వామి సమర్ధ పాదాలను ఒత్తుచుండెను బీడ్కర్. స్వామి వారు ఎంతసేపైనను ఇక చాలనలేదు. బీడ్కర్ తన పాదసేవను మానక రాత్రంతయు సేవ చేస్తూనే యుండెను. పరీక్షగా అక్కడ ఒక పాము వచ్చినది. బీడ్కర్ ఆ పాము కాటేసినా సరే గురుసేవలో ప్రాణం వదులుట కూడా యోగమేనని భావించి సేవచేయుచునే యుండెను. శ్రీ స్వామి సమర్ధలేచి **"నీవు మొండివాడివి. రాక్షసుడా ఫో"** అని అరచి చెంపపైన కొట్టెను. ఆ దెబ్బతో బీడ్కస్ సమాధి స్థితికి వెళ్ళిపోయెను. మర్నాడు స్వామిని దర్శించి తిరిగి పూనాకి వెళ్ళిపోయెను.

**గురుదక్షిణ :**

ఒకసారి బీడ్కర్ స్వామి దర్శనానికి వచ్చినపుడు స్వామి **"భోజనము ఎప్పుడు పెడతావు"** అని అనగా బీడ్కర్ స్వామి మాటలను గ్రహించి అన్నదానము చేసెను. శ్రీ స్వామి సమర్ధ కూడా భిక్షను స్వీకరించెను. శ్రీ స్వామి అతనితో దక్షిణ ఏది అని అడుగగా బీడ్కర్ **"స్వామీ ఏదికావాలన్నా ఇచ్చెదను అడుగుము"** అని వేడగా శ్రీ స్వామి సమర్ధ ఇట్లనిరి, **"ఇక మీదట బంగారము తయారుచేయుట మానివేయుము. అదే నాకు గురుదక్షిణ"** అని అనగనే ఆ క్షణము నుండి బీడ్కర్ మానివేసినాడు. పూర్తిగా ఆధ్యాత్మిక చింతనయందు మునిగినాడు.

**నర్మదానది ప్రదక్షిణ :**

బీడ్కర్ మరియొకసారి శ్రీ స్వామి సమర్ధను దర్శించినపుడు శ్రీ స్వామి **"నీవు ఇకపై నా దగ్గరకు రానక్కరలేదు. నర్మదానదికి ప్రదక్షిణము చేయి"** అని ఆశీర్వదించెను. శ్రీ స్వామి చెప్పిన ఆ నదీ ప్రదక్షిణము అంత సులువైనది కాదు. కొండ లోయలతో, క్రూరమృగాలతో ఉన్న ఆ నది చుట్టు ప్రదక్షిణ చేయవలెనన్న ఇంద్రియనిగ్రహం అవసరము. గురువాజ్ఞను పాటించుటకై బీడ్కర్ ఎదుర్కొనెను. శ్రీ స్వామి అనుగ్రహముతో

ఆ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యెను. బీడ్కర్ యాత్రలో నున్నపుడు శ్రీ స్వామి వారి సమాధి వార్త విని తట్టుకొనలేక దుఃఖిస్తూ వెనుతిరిగినాడు. అదే రాత్రి శ్రీ స్వామి స్వప్న దర్శనమిచ్చి **"నేను సజీవుడను, మరణములేదు, భక్తులు పిలిచిన పలుకుతాను. యాత్ర మానకుము పూర్తి చేయుము"** అని ఆదేశించినారు. గుర్వాజ్ఞను శిరసావహించి బీడ్కర్ తిరిగియాత్ర ప్రారంభించెను. నర్మదాదేవి అతని భక్తికి మెచ్చి ప్రత్యక్షమై దీవించినది. బీడ్కర్ ఎన్నో పుణ్యక్షేత్రములను తిరిగి శ్రీ స్వామి సమర్ధ అనుగ్రహముతో తిరిగి పూనాకు చేరుకొని ఒక మఠమును స్వయముగా నిర్మించుకొని సన్యాసియై బీడ్కర్ మహరాజ్‌గా ప్రసిద్ధిగాంచినారు.

జై శ్రీ స్వామి సమర్ధ

## అధ్యాయము 36

## (జీవించి వుండగనే మోక్షం కోరండి)

గత అధ్యాయములో శ్రీ స్వామి సమర్ధ ముఖ్యభక్తులలో ఒకరైన శ్రీరామానంద బీడ్కర్ మహరాజ్ గారి గురించి తెలిసికొంటిమి. ఆ అధ్యాయములో కొన్ని ముఖ్యమైన రహస్యాలు దాగియున్నవి. ఒక్కసారి లోతుగా పరిశీలిస్తే తత్త్వం బైట పడుతుంది.

మొదట బీడ్కర్ బంగారము వెండినగల తయారీలో నిపుణత సంపాదించి గొప్ప ధనవంతుడయ్యెను. చందనము, అత్తరు, సుగంధ పరిమళ ద్రవ్యములు తయారు చేయుటలో పేరు సంపాదించెను. అతనికి ధనముపై విపరీతమైన ఆశతో మొదలైనది. ధనకాంక్ష తీరక ఇంకా సంపాదించవలెనని కోరిక ఉన్నది. ధనం ఎక్కువ సంపాదించుట వలన దానితోపాటు చెడు సహవాసాలు మరియు దురలవాట్లకు బానిస అయ్యెను. వ్యాపారరీత్యా వేరే ప్రదేశములకు వెళ్ళినపుడు ఒకామెకు దాసుడయ్యెను. ధనముతో మొదలై దురలవాట్లు ఇంకా స్త్రీ వ్యామోహం ఒక దానివెనుక ఒకటి మిత్రులవల వలె వచ్చి చేరునని గ్రహించవలసింది. ఆ ధనము వల్ల అశాంతి కూడా తోడైనది. అటువంటి సమయములో సాధు దర్శనము కలిగి తాను చేసిన తప్పులను ఆ సాధువుకి చెప్పుకునే బుద్ధి కలగటం మరియు ఆ సాధువు పరుష వాక్యములతో అతనిని తిరస్కరించటం అతనికి ఒక క్రొత్త మార్గమునకు దారి చూపినది. అటువంటి సమయములో భగవంతుడు గుర్తుకు రావడం తన బలహీనతలకు దూరమై దైవమునకు దగ్గరగా చేరుటకు ప్రయత్నించినాడు. అటువంటి సమయములోనే స్వప్నములో అక్కల్‌కోటకు వెళ్ళితే స్వామి సమర్ధను దర్శించమని ఆజ్ఞ రావటం శ్రీ దత్తుని కటాక్షమే. బీడ్కర్ మొదలు కోరికలతోను జీవితం గడిపినను దురలవాట్లకు లోనైనను ఒక సాధువు కనపడగనే తాను చేసిన తప్పులను నిస్సంకోచంగా చెప్పుకోవటమే ఒక గొప్ప మార్పు. తన తప్పును తాను ఒప్పుకొనేవాడే మహనీయుడు అవుతాడు. అలాంటి సద్భావం కలుగుట వలనే దైవము దగ్గరైనాడు. అందువలనే అతను

ఆంజనేయుని ప్రార్థించుట హనుమత్ కవచం చదువుట ప్రారంభించినాడు. నిజానికి అతనిచే జరుగలేదు. ఆ దైవారాధన మరియు హనుమత్ కవచం చదువుట ఆ దైవకృప వలనే జరిగినది. తన తప్పు చెప్పుకొనుట ఆ దైవం మెచ్చిచేసిన పని అది. కావుననే బీడ్కర్ స్వప్నములో శ్రీ స్వామి సమర్ధను దర్శించమని ఆజ్ఞ వచ్చినది.

బీడ్కర్ అక్కల్‌కోటకు వెళ్ళి శ్రీ స్వామి దర్శనం కాకుండుటచే మూడు రోజులు అన్నపానీయములు ముట్టలేదు. మూడు రోజుల తరువాత స్వామి ప్రత్యక్షమైనాడు. శ్రీ స్వామి పాదములను బీడ్కర్ శరణువేడెనే కాని తన మనసులో ఎటువంటి కోరిక కలుగలేదు. బంగారము, వెండి నగలు వాటిపై వ్యామోహం చూపలేదు. శ్రీ స్వామి సమర్ధ బీడ్కర్‌ను బాగా తిట్టినను ఆ తిట్లను ఆశీస్సులుగా భావించెనేగాని రోషపడలేదు. బీడ్కర్ ఆనాటినుండి శ్రీ స్వామిని గురువుగా భావించెను. తరువాత బీడ్కర్ ఒక సం॥ము గడిచిన పిదప శ్రీ స్వామిని దర్శించినపుడు శ్రీ స్వామి “ఈ మామిడికాయ సగం పండినది” అని అన్నారు. దానికి అర్థము బీడ్కర్ గత జీవితంలో తాను గడిపిన జీవితముతో పోల్చుకుంటే అతనిలో సగం ఆధ్యాత్మికంగా పండినారని శ్రీ స్వామి సూచించినారు. బీడ్కర్ శ్రీ స్వామికి సేవ చేస్తూ కాలం గడిపినారు. తన జీవితము గురుసేవకే అంకితం చేయవలెనని భావించినాడు కనుక శ్రీ స్వామి పాదములు సగం రాత్రి అయినను వదలక వత్తుచునే ఉన్నాడు. ఆ సమయమున పాము వచ్చినప్పటికి కదలలేదు, మెదల్లేదు. గురుసేవలోనే లీనమయినాడు. శ్రీ స్వామి ఆజ్ఞ ప్రకారము అన్నదానము చేసినాడు. శ్రీ స్వామి బీడ్కర్‌ను దక్షిణ అడుగగా దేనికైన సిద్ధమేనని బీడ్కర్ జవాబు చెప్పినారు. శ్రీ స్వామి సమర్ధ గురుదక్షిణగా ‘ఇక నుంచి బంగారం తయారు చేయుట మానివేయవలెనని’ కోరగా ఆ క్షణమునుండే బీడ్కర్ మానివేసినాడు. అనగా కాంతా, కనకం పై వ్యామోహం వదలి ఆధ్యాత్మిక జీవితంలో నిమగ్నుడైనాడు. ఇన్ని చేసిన పిదప, ఒకసారి శ్రీ స్వామిని దర్శించుటకు అక్కల్‌కోటకి రాగా శ్రీ స్వామి సమర్ధ **‘నీవు ఇక మీదట నా దగ్గరకు రానక్కరలేదు, నర్మదా నదికి ప్రదక్షిణ చేయుమని’** శ్రీ స్వామి చెప్పినారు. బీడ్కర్ పూర్తిగా పండినాడని అర్థం. ఇందులో ముఖ్యమైన విషయం గమనించవలసినవి ఏమిటంటే –

1. కాంతాకనకముపై వ్యామోహము ఆశించనివాడికి దైవం దగ్గరవును.
2. తన తప్పును ఒప్పుకొని పశ్చాత్తాపం పడినవాడికి దైవం తోడ్పడును.
3. దైవం తోడ్పడినప్పుడు గురువు లభ్యమగును.
4. గురువు పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణుడైనవాడు సగం పండును.
5. మిగతా సగం ఆధ్యాత్మిక చింతనలో మునిగి గురుసేవలో ఉండవలెనని చివరకు గురుసేవలో మరణం సంభవించినను అదృష్టమేనని భావించువానికి సమాధి స్థితి లభ్యమై దాని ద్వారా ఇంద్రియములకు

లోనుకాక, ఆనందముతో ఉండును.

6. గురువు దక్షిణగా గురువు ఏమి కోరినా ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నవాడు నిజమైన శిష్యుడు. అదే గురుదక్షిణకు అసలైన అర్థం.

7. ఇన్ని విధములుగా సద్బుద్ధితో నడుచువానికి చివరికి ఇక ఎవరి దర్శనమునకు రానవసరములేదని గ్రహించవలెను. ఇక, అది పరమానంద స్థితి. ఆ స్థితిని వర్ణించలేము. అందుకే శ్రీ స్వామి ఇక తన వద్దకు రానవసరం లేదని చెప్పెను.

బీడ్కర్, శ్రీ స్వామి ఆజ్ఞచే నర్మదానది ప్రదక్షణ చేయు సమయముగా తన గురువు అగు శ్రీ స్వామి సమర్ధ మహాసమాధి వార్త విని దుఃఖితుడై తన ప్రయాణమును మానుకొని తిరుగు ప్రయాణము చేయగా శ్రీ స్వామి సమర్ధ స్వప్నములో కనపడి తాను మరణించలేదని ఎల్లప్పుడు సజీవుడేనని భక్తులు పిలిచిన పలికెదనని యాత్ర ముగించుకుని బీడ్కర్‌ను రమ్మని శ్రీ స్వామి స్వప్నమున ఆజ్ఞాపించగా బీడ్కర్ అంత దుః ఖములో కూడా స్వామి మాటను తూ.చ. పాటించి తిరిగి యాత్రకు వెళ్ళెను.

ఏ సాధకుడైన తన ఆధ్యాత్మిక జీవితంలో తనకున్న కోరికలను నశింపచేసుకొనినచో, బ్రహ్మ విద్య, సద్గురువు అనుగ్రహించగలరని బీడ్కర్ వృత్తాంతము తెలుసుకున్న తరువాత తనకు రుజువైనది. బీడ్కర్ లాగా, అన్ని వదులుకొని, గురుసేవలో మునిగి, గురువాజ్ఞను పాటించినచో అన్ని బంధములనుండి బయటపడి బంధ విముక్తుడగును. అనగా **జీవించియుండగనే మోక్షము పొందును. బంధము తెంచుకొనుటయే మోక్షము.** కాంతాకనకం, వ్యామోహం, క్రోదం ఇవన్నీ తెంచుకున్నవాడు మోక్షానికి అర్హుడు. ఏ సాధకుడైన ఇటువంటి సాధన కొరకు ప్రయత్నించవలెను కాని అశాశ్వతమైన కోరికల కొరకు భగవంతుడిని ప్రార్థించకూడదు. సాక్షాత్ భగవత్ అవతారమగు శ్రీ స్వామి సమర్ధను సుఖముల కొరకై కోరికలు కోరరాదు. శ్రీ స్వామి సమర్ధుని బ్రహ్మవిద్యను పొందుటకు జీవించియుండగనే మోక్షము సంపాదించుటకు చేయవలసినవి మరియు ఆ అర్హతను సంపాదించి సాధించినచో శ్రీ స్వామి సమర్ధ మోక్షము ఇచ్చుటకు కూడా సిద్ధముగా ఉన్నారని సాధకులు గ్రహింపవలెను

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము 37

## (శ్రీ స్వామి సమర్ధ ముఖ్య భక్తులలో మరి ఇద్దరు ఒకరు ఆనందభారతి రెండవవారు ఠాకూర్‌దాస్ బువా)

**శ్రీ ఆనంద భారతి :-** వీరు జాలరి పని చేయువారు. అసలు పేరు లక్ష్మణ్. చేపలు పట్టుకొని అమ్ముకొని జీవనోపాధి చేయువారు. శ్రీ స్వామి సమర్ధ అంటే అతనికి ఇష్టం. ఎంతో భక్తితో అప్పుడప్పుడు స్వామి దర్శనానికి అక్కల్‌కోటకు వస్తూ ఉండేవారు. ఒకసారి సముద్రములో చేపలు పట్టుటకై వెళ్ళినపుడు తుఫానులో చిక్కుకొని అతని పడవ మునిగిపోయే పరిస్థితి రావడంచే లక్ష్మణ్ చాలా భయపడి శ్రీ స్వామి వారి నామాన్ని జపిస్తూ కూర్చున్నాడు. అక్కల్‌కోటలో కూర్చునియున్న శ్రీ స్వామి సమర్ధ అక్కడున్న భక్తులతో **'లక్ష్మణ్ నీటిలో మునిగి పోతున్నాడు'** అనిరి. శ్రీ స్వామి వారి చేతులు పూర్తిగా తడిసిపోయినవి. ఉప్పునీరు కనిపించినవి. ఇది జరిగిన కొన్ని రోజులకు లక్ష్మణ్ అక్కల్‌కోటకు వచ్చి శ్రీ స్వామి సమర్ధ పాదములపై బడి శరణువేడెను. అప్పటినుండి శ్రీ స్వామికి అంకితభక్తుడై గొప్ప సాధనచేసి యోగిగా మారిపోయెను. అను నిత్యము ఆనందములో మునిగి ఉండుటచే అతనికి 'ఆనంద భారతి' అనే పేరు వచ్చినది. వీరి సమాధి బొంబాయి వద్ద ఠాణేలో శ్రీ దత్తుని గుడి వద్ద ఉన్నది.

ఇటువంటి సంఘటనే శ్రీ మాణిక్య ప్రభు తన భక్తుడిని రక్షించెను. ఒకసారి దర్బారులో మాణిక్య ప్రభుగారు ఒక్కసారిగా వారి రెండు చేతులను పైకెత్తి ఏదో లాగుకొనుచున్నట్లు చేసెను. కొంతసేపటికి చెమటలు గ్రక్కి నీరుకారుట అక్కడ ఉన్న భక్తులు చూసిరి. ఆ నీరు రుచి చూడగా సముద్రపు నీటివలె నున్నది. ఎవరికి ఏమీ అర్థం కాలేదు. కొన్ని రోజుల పిదప బొంబాయి నుండి ఒక వర్తకుడు ధనము తీసుకువచ్చి శ్రీ ప్రభువారి పాదములపై పోసిరి. ఆ వర్తకుడు ఇట్లు చెప్పెను, 'ఒకసారి లక్షల విలువ చేసే సరుకును పడవలో తీసికుని వచ్చుచుండగా తుఫానుచే పడవ మునిగిపోవుచుండగా అతను అనేక దేవతలను ప్రార్థించెనని దగ్గరలోనున్న ఒక ముసల్మాన్ నన్ను శ్రీ మాణిక్యప్రభువుని ప్రార్థింపమని చెప్పగా నేను శ్రీ ప్రభువుని ప్రార్థించితిని. వెంటనే మునుగుచున్న పడవ రక్షింపబడినది.'

పై సంఘటనను బట్టి శ్రీ స్వామి సమర్ధ తనముందు దత్త అవతారమగు శ్రీ మాణిక్య ప్రభువేనని మరియు వారు సాక్షాత్తు శ్రీ దత్తుని అవతారాలేనని గ్రహించవలెను.

**శ్రీ ఠాకూర్‌దాస్ బువా :-** ఇతను దత్త భక్తుడు దత్త క్షేత్రములు దర్శించుచుండెడివాడు. ఇతని శరీరంపై తెల్లమచ్చలతో కనబడుచూ ఆ బాధతో దిగులు పడుచుండెడివాడు. ఇతను కీర్తనాకారుడు. అతని బాధను తట్టుకొనలేక గాణ్గాపురమునకు వెళ్ళి శ్రీ దత్తపాదుకలముందు కీర్తన చేశాడు. శ్రీ దత్తుడు పరవశించి దర్శనమిచ్చి అక్కల్‌కోటకు వెళ్ళమని ఆజ్ఞాపించినాడు. అతను కాలినడకతో అక్కల్‌కోటకు చేరినాడు. ఆ

సమయమున శ్రీ స్వామి వారు ఒక వేశ్య ఆహ్వానముపై వారి ఇంట ఉన్నట్లు తెలిసి ఠాకూర్‌దాస్ ఆమె ఇంటికి వెళ్ళినారు. శ్రీ స్వామి సమర్ధ అతనిని చూసి చేయిచాపి **'కస్తూరి ఏది? నాకివ్వు'** అని అనగా ఠాకూర్‌దాస్ ఆశ్చర్యపోయెను. ఎందుకంటే అతను గాణ్గాపూర్‌లో శ్రీ దత్తుని పాదుకలను అభిషేకించి కస్తూరి తన వెంట తెచ్చుకున్నాడు కాని అది స్వామికి ఇచ్చుట మరచినాడు. వెంటనే అతను కస్తూరిని శ్రీ స్వామికి ఇచ్చినారు. శ్రీ స్వామి సమర్ధ వారితో వచ్చిన పిల్లలందరికి కస్తూరిని పూశారు. ఠాకూర్‌దాస్ అక్కల్‌కోటలోనే ఉండి శ్రీ స్వామిని కీర్తిస్తూ కాలము గడిపారు. ఒకసారి శ్రీ స్వామి సమర్ధ కాలిన కట్టె పుల్లను ఠాకూర్‌దాస్‌పై విసరగా అది శ్రీ దత్తుని ఆశీర్వచనముగా భావించి అతను దానిని పొడిచేసి విభూదితో కలిపి తన ఒంటికంతా పూసుకున్నారు. ఆ దెబ్బతో అతని శరీరంపై ఉన్న మచ్చలన్నీ మాయమైపోయినాయి. ఠాకూర్‌దాస్ దంపతులకు ఒక ఆడపిల్ల ఉండుటచే ఒక కొడుకు కావలెనని శ్రీ స్వామిని కోరగా శ్రీ స్వామి సమర్ధ తన తలపై నున్న టోపీని తీసి ఠాకూర్‌దాస్ భార్య ఒడిలో పడవేసెను. తర్వాత కొన్ని నెలలకు ఆమెకు కుమారుడు జన్మించెను. ఆ దంపతులు శ్రీ స్వామి వద్దనుండి పాదుకలను స్వీకరించి శ్రీ రఘునాథ్ మందిరంలో ప్రతిష్టించిరి. ఆ రఘునాథ్ మందిరము బొంబాయి వద్ద ఠాకూర్ ద్వార్ వద్దనున్నది. ఆ పాదుకలు చుట్టూ ఒక మందిరము కూడా నిర్మించి శ్రీ స్వామి సమర్ధ చిత్రాన్ని ఆవిష్కరించినారు. అప్పటినుండి ఠాకూర్ దాస్‌ను కృష్ణ బువా అని పిలిచేవారు. కృష్ణబువా శ్రీ స్వామికి అనన్య భక్తుడై ప్రతి గురు పౌర్ణమినాడు. అక్కల్‌కోటకు వచ్చి శ్రీ స్వామిని సేవించుకుని వెళ్ళేవారు.

**జై శ్రీ స్వామి సమర్థ**

## అధ్యాయము 38

## (శ్రీస్వామి సమర్థ అంశముగా జన్మించిన శ్రీఅవధూత కృష్ణసరస్వతి)

బ్రాహ్మణదంపతులైన అప్పాభట్, అన్నపూర్ణాబాయి శ్రీదత్తుని భక్తులు. సంతానము లేకపోవుటచే శ్రీదత్తుని కొలచినారు. శ్రీదత్తుడు స్వప్నదర్శనమిచ్చి వారే స్వయముగా తమ గర్భమున జన్మించెదనని ఆశీర్వదించినారు. శ్రీదత్తుని అనుగ్రహముచే ఒక తేజోవంతుడైన కుమారుడు వారికి జన్మించినాడు. చిన్నతనము నుండి అతను సకలవిద్యలలో నైపుణ్యము సంపాదించెను. ఆ దంపతులు ఆ బాలునితో సహా అక్కల్‌కోటకు వచ్చి శ్రీస్వామిసమర్థను దర్శించగా శ్రీస్వామి సమర్థ వారి ఆసనము నుండి లేచి ఆ బాలుని చేయిపట్టుకొని ఎక్కడికో తీసుకువెళ్ళినారు. ఆ బాలుడు శ్రీస్వామివారిని చూడగానే స్తోత్రాలతో స్తుతించినారు. శ్రీస్వామి సమర్థ ఆ బాలుని చూసి ఇట్లనిరి. **"నీవు కారణజన్ముడవు! నీవు నా అంశానివి! మన మిరువురము వేరుకాము"** అని ఆ బాలుని శిరస్సుపై శ్రీస్వామి తమ అభయహస్తమునుంచి దీవించిరి. ఆ స్పర్శతో ఆ

బాలుడు ఎన్నో గంటలు సమాధిస్థితిలో ఉండిపోయెను. చాలా సమయము గడచిన తరువాత శ్రీస్వామి ఆ బాలునితో సహా తిరిగి మఠమునకు చేరిరి. ఆ బాలుడు చాలాకాలము అక్కల్‌కోటలోనే ఉండిపోయి శ్రీస్వామికి సేవచేసెను. కొంతకాలము తరువాత శ్రీస్వామి అతనిని కొల్హాపూర్‌కి వెళ్ళమని అవధూతగా జీవించి ఎందరినో రక్షించమని ఆశీర్వదించి పంపివేసెను. అప్పటినుండి అతను శ్రీఅవధూత కృష్ణసరస్వతిగా మారి ఎన్నో మహిమలను చూపి, శ్రీస్వామి అనుగ్రహముచే ఎంతో పేరు ప్రఖ్యాతులను సంపాదించినారు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము 39

### (శ్రీస్వామిసమర్థ వారి ముఖ్యభక్తులలో మరి ఇద్దరు – శ్రీరంగోళి మహరాజ్, శ్రీతాతా మహరాజ్)

**శ్రీరంగోళీ మహరాజ్ :** ఇతను తన ఎనిమిదవ ఏటనే వారి మేనత్తతో శ్రీస్వామిసమర్థుల వారిని దర్శించినాడు. శ్రీస్వామి సమర్థ అతని మేనత్తతో, "వీడిని నాకిస్తావా?" అనగానే ఆ బాలుడు శ్రీస్వామి ఒడిలో కూర్చొనెను. శ్రీస్వామి సమర్థ రంగోళీమహరాజ్ అని అతనితో పలికి ఆశీర్వదించారు. ఒక కాషాయ వస్త్రము అతనిపై కప్పెను. ఆనాటి నుండి అతనికి కొన్ని శక్తులు వచ్చినవి. మౌనంగా ఉండేవారు. బీడి త్రాగుతూండేవాడు. అతను శ్రీస్వామి ఆదేశానుసారము ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోయినారు.

**శ్రీ తాతా మహరాజ్ :** రామచంద్ర వెంకటేశ్ బరాడ్కర్ చిన్నతనము నుండి శివభక్తుడు. బొంబాయి నివాసి. ఔషధాల వ్యాపారస్తుడు. క్రమం తప్పకుండా శివపూజ చేసేవాడు. పరమేశ్వరుడు అతని స్వప్నములో కనపడి, "నేను అక్కల్‌కోటలో సశరీరుడనై శ్రీస్వామి సమర్థ రూపములో ఉన్నాను. నీవు అక్కడికి వచ్చి దర్శించుకో" అని చెప్పాడు. కొంతకాలానికి అతను అక్కల్‌కోటకు వచ్చి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. తన స్వప్న వృత్తాంతమును శ్రీస్వామివారికి తెలుపగా **శ్రీస్వామివారు అతని ముందు పరమశివునిగా మారి దర్శనమిచ్చారు.** అతను ఆశ్చర్యచకితుడై చూచుచుండగా **శ్రీస్వామి సమర్థ విష్ణురూపముగను దర్శనమిచ్చి తరువాత బ్రహ్మరూపముగా మారెను.** త్రిమూర్తి దర్శనముపొందిన రామచంద్ర వెంకటేశ్ శ్రీస్వామి పాదములపై పడి ఆనందముతో ఉప్పొంగినాడు. శ్రీస్వామి, **"నేను నీతోనే ఉంటాను"** అని దివ్య ఆశీస్సులిచ్చినారు. తిరిగి అతను బొంబాయికి వెళ్ళిపోయినారు. అప్పటి నుండి కొన్ని దివ్య సిద్ధులను సంపాదించి, తనను దర్శించిన వారికి అభయమిస్తూ మహాపురుషుడైనాడు. అప్పటినుండి వారిని తాతామహరాజ్ అని పిలువసాగిరి.

శ్రీస్వామి సమర్థను దర్శించినవారు గొప్పయోగులుగా కూడా మారినారని, దివ్యశక్తులను సంపాదించినారని తెలుస్తున్నది.

0జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము - 40

### (అతి ముఖ్యభక్తుడు చోళప్ప - చోళప్ప ఇంటిలో శ్రీస్వామివారి అల్లరి)

శ్రీస్వామి సమర్థ మొట్టమొదటిసారిగా అక్కల్‌కోటకు చేరినప్పుడు రామచంద్రం అనేవారు శ్రీస్వామిని చూచి **"ఎవరైనా బంధువులు అక్కల్‌కోటలో ఉన్నారా?"** అని ప్రశ్నించగా శ్రీస్వామి సమర్థ ప్రక్కనున్న చోళప్పను చూచి, **"ఏమిరా చోళా ! నన్ను గుర్తుపట్టవా? పూర్వజన్మలో నీవు రామచంద్ర షరాబువు. పైగా నా భక్తుడవు"** అని శ్రీస్వామి సమర్థ చోళప్పకు జన్మజన్మల బంధం ఉన్నదని తెలియజేసినారు. అనాటినుండి శ్రీస్వామి సమర్థ చోళప్ప ఇంటిలోనే ఉండేవారు.

**చోళప్ప ఇంటిలో శ్రీస్వామి సమర్థ అల్లరి :**

1. చోళప్ప భార్య పేరు యశోబాయి. వారి పెద్దకుమారుడు కృష్ణ, రెండవ కుమారుని పేరు అప్ప.

2. చోళప్పకు శ్రీస్వామివారిలో ప్రత్యేకత కనిపించెను. కాని వాని భార్యకు, కుమారులకు స్వామివారిలో ఎటువంటి విశేషము గమనించలేదు.

3. చోళప్ప భార్య అతని పిల్లలు శ్రీస్వామిని ఒక పిచ్చివానిగా చూచేవారు.

4. చోళప్పకు తప్ప మిగతా కుటుంబ సభ్యులకు శ్రీస్వామి సమర్థ వారి ఇంట్లో ఉండుట ఇష్టం లేదు.

5. శ్రీస్వామి సమర్థ చోళప్పను అనేక విధములుగా పరీక్షించేవారు.

6. శ్రీస్వామి వారి ఇంటిలో ఒక సభ్యునిగానే తిరిగేవారు.

7. వారి ఇల్లు అనేకమందికి మార్గమై, శ్రీస్వామిసమర్థను దర్శించుకుని ఎన్నో బాధలను శ్రీస్వామి కడ మొరపెట్టుకుని ఆశీస్సులను తీసుకెళ్ళేవారు.

8. యశోబాయి నమ్మేదికాదు.

9. శ్రీస్వామి సమర్థ ఇంట్లో ఉన్న బియ్యమును చెప్పకుండా తీసికొని ఆవుకు పెట్టేవారు.

10. ఇంట్లో ఉన్న వస్తువులను బీదలకు దానం చేసేవారు.

11. శ్రీస్వామి ఇంట్లోనే మూత్ర విసర్జనలు చేసేవారు.

12. స్వామి చేసే పనులకు యశోబాయి కసురుకుంటూ అవస్థ పడేది. కాని స్వామికి అన్నము పెట్టేటప్పుడు ప్రేమగానే ఉండేది.

13. పండగరోజులలో యశోబాయి పూర్ణములు చేయదలచి శెనగలు తెప్పించగా, శ్రీస్వామిసమర్థ వాటిని కూడా ఆవుకు దానం చేసేవారు.

14.శ్రీస్వామి చేసిన అల్లరిపనులకు తన భర్త అగు చోళప్పకు చెప్పగా అతను పట్టించుకునేవాడు కాదు.

15. యశోబాయి శ్రీస్వామిని నిలదీసి అడుగగా "నా కేంతెలుసు! అవన్నీ నీ ఆవే తిన్నది. ఆ ఆవునే అడుగు" అని అనేవారు.

16.ఒక్కొక్కసారి యశోబాయి పిల్లలకు వేసిన పడకల మీద శ్రీస్వామి పడుకొని గాఢనిద్రలో ఉండేవారు.

17.ప్రొద్దునే లేచి పొయ్యిలోనే మల విసర్జన చేసేవారు.

18.మండే పొయ్యిలో నీళ్ళు పోసేవారు.

19.శ్రీస్వామి సమర్థ మడి అంటే ఒప్పుకునేవారు కాదు.

20.శుచికై ఆరవేసిన బట్టలను తాకేవారు.

21.మడినీళ్ళను తాకవద్దని చెప్పినా శ్రీస్వామి తాకేవారు.

22.ఒక పండుగరోజు యశోబాయి బొబ్బట్లు చేయగా శ్రీస్వామి ఒక సన్యాసికి భిక్ష వేసినారు.

23.చోళప్ప ఊర్లో లేనప్పుడు శ్రీస్వామి ఇంట్లో నిలబడి "ఈ ఇల్లు తనదని ఇందులో ఎవరికి అధికారము లేద"ని అరిచేవారు.

శ్రీస్వామిసమర్థ ఉత్తరోత్తర శ్రీస్వామి యొక్క భౌతికకాయాన్ని చోళప్ప ఇంటిలోనే సమాధి చేయబడునని, అందుకే శ్రీస్వామి సమర్థ చోళప్ప నట్టింట్లో నిలబడి, "ఈ ఇల్లు నాది" అని ముందుగానే సూచించినారు. శ్రీ దత్త అవతారమగు శిరిడీ సాయిబాబావారు కూడా తన భక్తుడైన బూటీని ఒక పెద్ద భవనాన్ని నిర్మించినప్పుడు శిరిడీ సాయిబాబా ఇట్లనినారు, **"ఈ వాడా పూర్తికాగానే నేను అక్కడనే ఉండెదను. మనమందరము ఆనందముగా కలుసుకొనెదము"** అని ముందుగానే సూచించినారు. కావుననే శ్రీసాయి సమాధి చెందిన తరువాత వారి భౌతికదేహాన్ని కూడా బూటీ కట్టిన వాడాలో సమాధి చేసినారు. భౌతికంగా శ్రీస్వామి సమర్థ మరియు శ్రీ శిరిడీ సాయిబాబా సశరీరులుగా కనిపించకపోయినను వారు చోళప్ప గృహంలోను మరియు బూటీవాడాలోను నున్నారు. ఎందరో భక్తులు ఈనాడు అక్కల్‌కోటలోను మరియు శిరిడీలోను శ్రీదత్తుని అవతారాలుగా శ్రీస్వామిసమర్థ మరియు శ్రీశిరిడీ సాయిబాబాను కొలుచుకొనుచు, వారి బాధలను తెలుపుకొనుచు ఎన్నో సమస్యలకు జవాబులను వారి సమాధి నుండి లభించుచున్నవి. ఇది అక్షర సత్యము.

జై శ్రీ స్వామి సమర్థ

## అధ్యాయము - 41

### (యశోబాయికి ప్రాణగండము నుండి తప్పించుట - యశోబాయికి శ్రీస్వామిపై విశ్వాసము కలుగుట)

చోళప్ప భార్య అగు యశోబాయికి ప్రసవసమయము వచ్చినప్పుడు శ్రీస్వామివారు భీబత్సముగా వారి ఇంట అల్లరి చేసినారు. ఆమె నొప్పులతో బాధపడుచుండగా ఆమె నుంచిన గదికి తలుపులను మూయనీయకుండా శ్రీస్వామి సమర్థ అడ్డంగా నిలబడినారు. ఇంటిలోని సామానునంతా తీసి బయట పడవేసినారు. యశోబాయి ప్రసవవేదనతో కేకలు ఇల్లంతా పెట్టుచుండగా శ్రీస్వామివారు ఇంటిలోని సామానులు బయట విసిరే మోతలతో ఇల్లంతా మారుమోగిపోయి చిందరవందరగా కనిపించింది. శ్రీస్వామిసమర్థ చేసే చేష్టలకు ఎవ్వరికి అర్థం కాలేదు. చివరకు శ్రీస్వామి సమర్థ వారంత వారే యశోబాయి ఉన్న గదికి తలుపులు వేసి బయటకు వచ్చేసినారు. బయటపడియున్న సామాగ్రినంతా పేర్చి శ్రీస్వామి స్వయంగా వారే ఇంట్లో సర్ధిపెట్టినారు.

శ్రీస్వామి సమర్థ చేసిన చేష్టలకు ఒక రహస్యం కూడా దాగియున్నది. చోళప్ప భార్య యశోబాయికి ప్రసవసమయంలో ప్రాణగండం తప్పించుటకై శ్రీస్వామి సమర్థ ఇంటిగుమ్మానికి అడ్డంగా నిలబడి తన భక్తుని భార్యను కాపాడుటకు అట్లు చేసినారు మరియు శ్రీస్వామి బయటపారవేసిన సామాన్లని కూర్చి తిరగి సర్దటంలో ఆ దంపతులకు ఆడపిల్ల కలుగునని సూచించినారు. యశోబాయికి ఆడపిల్ల జన్మించింది.

శ్రీస్వామి సమర్థ యశోబాయిపై ఆశీస్సులు కురిపించుటచే యశోబాయికి శ్రీస్వామిసమర్థపై ఒక సంఘటనలో భక్తివిశ్వాసములు కలిగినవి. అదేమనగా ఒకరోజు ఆమెకు చెయ్యిపై తేలు కుట్టినది. బాధ భరించలేక శ్రీస్వామి వైపు చూసి ఇట్లన్నది, **"అందరికి అన్ని బాధలు తీరుస్తావు. నేను బాధపడుతుంటే ఊరుకున్నావేమి?"** అని తన మనస్సులో తలచుకున్నది. శ్రీస్వామి యశోబాయి మనసులో దాగినది గమనించి, వారు ధరించిన పాదుకలలో ఒక దానిని తీసుకుని యశోబాయి ముందర విసిరి అందులో ఆమె చేయిని ఉంచమని ఆజ్ఞ ఇచ్చిరి. యశోబాయి ఎన్నడు నమ్మని శ్రీస్వామి సమర్థను తాను అనుభవించుచున్న బాధను ఓర్వలేక శ్రీస్వామి చెప్పినట్లుగా తన చేయిని శ్రీస్వామివారి పాదుకలో ఉంచగా ఆమెకు బాధ నివారణమైనది. మళ్ళీ తన చేయిని బయటకు తీయగనే తన బాధ తీవ్రమైనది. వెంటనే తన చేతిని అలాగే పాదుకలో ఉంచి నిద్రించినది. మర్నాడు శ్రీస్వామి సమర్థ యొక్క మహిమను తలచుకుని ఆమెకు శ్రీస్వామిపై భక్తి విశ్వాసములు కలిగినవి.

ఒకప్పుడు శ్రీస్వామిసమర్థ చోళప్ప ఇంటిలో చేసిన అల్లరికి తట్టుకొనలేక ఎన్నో చీవాట్లు పెట్టిన యశోబాయి మరియు తన ఇంటికి ఎందరో భక్తులు శ్రీస్వామి సమర్థ ఉండటం వలన వారి ఇల్లు ఒక

పుణ్యక్షేత్రముగా మారినను, ఎందరో భక్తులు అక్కడకు వచ్చి శ్రీస్వామివారిని సందర్శించి వారి బాధలను స్వామికి చెప్పుకుని నివారణను పొందినను చోళప్పభార్యకు మాత్రము శ్రీస్వామి సమర్థపై నమ్మకము కుదరక హేళన చేసిన ఆమెయే తనకు బాధ వచ్చినపిదప శ్రీస్వామి వారిని మనస్సులో వేడుకొనగనే శ్రీస్వామివారు ఆమెపై కరుణాకటాక్షములను కురిపించి తనను ప్రసవవేదనలో ప్రాణగండము ఉన్నప్పటికిని అది ఆ తల్లికి ఎరుగకపోయినను ఆ గండాన్ని తప్పించి మళ్ళీ ఆ తల్లిని ఒక తేలుకుట్టినప్పుడు చెప్పరాని బాధతో విలవిలలాడుతున్న సమయమున శ్రీస్వామి సమర్థ ఆ తల్లిని రక్షించి శ్రీస్వామియే భగవంతుడని ఋజువు చేసినారు. ఆ తల్లికి కూడా శ్రీస్వామివారిపై భక్తి విశ్వాసములు కలిగినవి.

శ్రీకృష్ణుడు తన బాల్యములో చేయరాని అల్లరులు చేసి తల్లియగు యశోదను ఎన్నో విధాలుగా ఏడిపించినాడు. లోకాలను కాచే ఆ స్వామి యశోదచే దెబ్బలు తిన్నాడు. మట్టి తిని అందరిని ఆశ్చర్యపరచగా తల్లియగు యశోద మట్టిని తిన్న శ్రీకృష్ణుని మందలించి నోరు తెరువమని అడిగినప్పుడు, బాలుడగు ఆ కన్నయ్య నోరు తెరువగా 14 భువభాండములు తన నోటిలో ఆ కృష్ణపరమాత్ముడు తల్లియగు యశోదామాతకు చూపించి, తాను భగవానుడనని ఋజువుచేసినట్లుగా, శ్రీకృష్ణభగవానుడు మారురూపములో ఉన్న శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటలో నున్న చోళప్ప భార్యయగు యశోబాయి, శ్రీకృష్ణుడే యశోదను ఎట్లు ఏడిపించెనో, అదే విధముగా శ్రీస్వామి సమర్థ ఈ యశోబాయిని ఏడిపించి, చివరకు తన అవతారము యొక్క రహస్యాన్ని బయటపెట్టినారు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-42

## (చోళప్పకు పరీక్ష - చోళ్ళప్ప సద్భావన - మాయకమ్ముట)

చోళప్ప మహాభాగ్యశాలి. ఎందుకనగా సాక్షాత్తు శ్రీదత్తుని అవతారమగు శ్రీస్వామిసమర్థను తన ఇంటిలో ఆశ్రయమిచ్చి తన కుటుంబములో ఒకరిగా చూసుకున్నారు. నిజానికి ఇది శ్రీస్వామి సంకల్పమే, చోళప్ప చేసినది కాదు, శ్రీస్వామి సమర్థ మొట్టమొదటే చోళప్పను చూడగానే, “నీవు నా భక్తుడవు ! పూర్వజన్మలో” అని చెప్పెను. వారిరువురికి జన్మజన్మల బంధము ఉన్నదని తెలుస్తుంది.

శ్రీదత్తుని అవతారమగు శిరిడీ సాయిబాబాగారికి ముఖ్యమైన భక్తుడు శ్యామా. అతనిని చూసినప్పుడు కూడా బాబా “గత 72 జన్మల నుండి నేను నిన్నెరుగుదును” అని అన్నారు.

చోళప్పకు శ్రీస్వామి సమర్థకు ఎంతో అన్యోన్యమైన బంధము కలిగియున్నది. చోళప్ప తన స్వామి

కోసం చివరకు భార్యాబిడ్డలను కూడా వదులుటకు సిద్ధమయ్యెను. శ్రీస్వామి చోళప్పఇంటిలో ఎంత అల్లరి చేసినా చోళప్ప తన భార్య చెప్పిన నిందలను ఏ మాత్రము పట్టించుకొనక స్వామినే అను నిత్యము కొలుస్తూ ఉండేవాడు. ఒక్కొక్కసారి శ్రీస్వామి సమర్థ విపరీతమైన పరీక్షలు పెట్టినా చోళప్ప స్వామిని ఒదలుకొనక ఉండేవాడు.

ఒకసారి శ్రీస్వామిసమర్థ చోళప్ప ఇంటిని విడిచి వెళ్లిపోతుండగా చోళప్ప కన్నీటితో వారిని బ్రతిమిలాడి తిరిగి తన స్వామిని తన ఇంటికి తీసుకువచ్చాడు. ఇంతటి కఠిన పరీక్షలలో గెలుపొందిన చోళప్ప ఒక్కసారి మాయ కమ్ముటచే ఓడినాడు. హరిమాయను తప్పించుట సాధ్యము కాదు. ఒక్కొక్కసారి ఎంతటి సత్పురుషుడైనా మాయను గెలుచుట సాధ్యపడదు. ఈ చోళప్ప విషయములో కూడా బహుశ మాయ కమ్ముటచే ఓడినాడని చెప్పుకొనవచ్చును. ఇప్పుడు ఆ మాయ ఏమిటో చూద్దాం.

శ్రీస్వామిసమర్థ దర్శనానికి అనేక ప్రాంతాలనుండి మహారాజులు వచ్చి పోవుచూ శ్రీస్వామి ఆశీస్సులను పొంది వెళుతూండేవారు. శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోటలో రాజామాలోజీరావు యొక్క ఆతిథ్యములో ఉండుట చూసి బరోడా మహారాజగు శ్రీమల్లారావ్ గైక్వాడ్‌కు అసూయ కలిగెను. శ్రీస్వామి సమర్థను అక్కల్‌కోటనుండి మరలించి తమ రాజ్యమునకు తీసుకుపోవలెనని ఆశ కలిగి ఆ కార్యమును సఫలము చేసినవారికి తగిన ధనము బహుమానముగా ఇచ్చెదనని ప్రకటించెను. బరోడా మహారాజుగారి మంత్రి శ్రీ తాత్యా సాహెబ్ ఆ కార్యమును నెరవేర్చుటకు అక్కల్‌కోటకు వచ్చి శ్రీస్వామిని తమ రాజ్యమును రమ్మని ఆహ్వానించగా శ్రీస్వామి ఆ రాజు పంపిన బహుమానములను మరియు ఆహ్వానమును తిరస్కరించినారు. బరోడా రాజుగారి మంత్రి చివరకు శ్రీస్వామికి అతి సన్నిహితుడైన చోళప్పను పట్టినాడు. ఆ కార్యములో తనకు (మంత్రికి) సహాయము చేస్తే రూ.10,000/-లు బహుమానముగా ఇస్తామని మరియు మహారాజుగారిచే ఒక జాగీరు కూడా బహూకరిస్తామని ఆశపెట్టాడు. అటువంటి సమయంలో ఆ మాయ చోళప్పను కమ్మినది. చోళప్పకు ఒక సద్దుద్దేశ్యము కూడా కలిగినది. శ్రీస్వామివారి దర్శనానికూ వచ్చే అనే భక్తులకు ఎక్కువ వసతులు ఆ ధనముచే కల్పించవచ్చునని ఒక సద్భావము కలిగినది. ఏది ఏమైననేమి చూడటానికి ధనానికి లొంగినవారుగా కనిపించారు. ఒకనాడు శ్రీస్వామి సమర్థకడకు వెళ్లి తాను అతిగా ప్రేమించే స్వామినే అక్కల్‌కోటను వదిలి బరోడాకు వెళ్ళమని అలా వెళ్తే రూ.10,000/-లు తనకు వస్తాయని అని వేడుకున్నాడు. శ్రీస్వామి సమర్థ తన మనోభావాన్ని గ్రహించి, “అతనికి భక్తి లేదు” (బరోడా మహారాజ్‌కి) అని స్వామి అన్నారు. ఈ దెబ్బతో చోళప్ప మంత్రి వద్ద ఓడిపోయాడు మరియు తత్ఫలితముగా శ్రీస్వామిని సేవించుకొనుటలో అర్హత కోల్పోయినాడు.

బరోడా మహారాజ్‌గారి మంత్రి ఐనా తన ప్రయత్నము మానలేదు. చివరకు ఎంతకు దిగజారినాడంటే శ్రీస్వామివారి పల్లకిని మోయువారికి ధనమిచ్చి ఒకసారి శ్రీస్వామి సమర్థను పల్లకిలో ఉన్నప్పుడు ఆ పల్లకీకి తాళం వేసి బంధించి రైల్వేస్టేషనుకు తీసుకుని వెళ్ళి తలుపులు తీయగా శ్రీస్వామి సమర్థ ఆ పల్లకీలో లేరు !

చోళప్ప అమాయకుడైన భక్తుడైనప్పటికి తాను ఈ జన్మలో ఇంతటి మహాకార్యము చేస్తున్నప్పటికి పూర్వజన్మ సంస్కారములో ఏదో ఒకటి తప్పు చేయుట వలనే ఈ జన్మలో అంతటి సేవాభాగ్యము కలిగినటువంటి చోళప్పకు మాయ కమ్మనిదని కావుననే ఎన్నడు ఊహించనిరీతిగా చోళప్ప ప్రవర్తించినాడు. శ్రీస్వామి భక్తులు తెచ్చే కానుకలలో శ్రీస్వామి చెబితే కాని కానుకలు ముట్టనటువంటివాడు మరియు శ్రీస్వామి ప్రమేయము లేకుండా ఏ పని చేయనివాడు అటువంటి చోళప్ప బరోడారాజుగారి మంత్రి చూపించిన ధనానికి లొంగిపోవటము చిత్రముగా తోస్తున్నది. ఆనాటినుండి శ్రీస్వామి సేవలకు దూరం కాసాగాడు. ఈ పై విషయము లోతుగా గమనించినచో శ్రీదత్తుడు మనకు తెలియజేయుటకు చోళప్ప విషయము ఒక నిదర్శనముగా చూపెనని అనుకోవచ్చు. ఎందుకంటే నిత్యజీవితములో మంచి సాధనతో గడిపేవానికి ఏదో ఒక రోజు ఇలాంటి ధన, ఆశ, వస్తు, కాంత మరియు కనకం ... వీటిలో ఏదో ఒకటి ఎదురై పరీక్షించవచ్చునని అటువంటి పరిస్థితులలో జాగ్రత్తగా వహించవలసినదని శ్రీదత్తుడు మనకు హెచ్చరించుటకై తన మాయాప్రభావముచే తన భక్తుడగు చోళప్పపై చూపెనని అది యావత్‌లోకానికి ఒక హెచ్చరిక కోసమేనని, ఒక అమాయక భక్తుడిని ఆ విధముగా చూపినారని అనుకోవచ్చు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-43

### (నిన్నే ముందుగా ఆ గోతిలో పెడతాను. ఆ తర్వాత గాని నేను పోను !)

పై అధ్యాయములో శ్రీస్వామివారికి చోళప్పకుగల సాంగత్యము గురించి చెప్పుకుంటిమి. చోళప్ప తన స్వామిని ఎంతో గౌరవముగా ప్రేమాభిమానములతో చూచుకునేవాడు. వారి ఇంట్లో కొన్ని ముఖ్య కార్యక్రమములు

1. చోళప్ప ఇంటికి ఎందరో స్వామి భక్తులు వస్తూ ఉండేవారు.
2. గురువారం ప్రత్యేక దినముగా పరిగణింపబడినది.

3. ప్రతిరోజు 4 గం॥లకు పూజ జరిపి, హారతులు శ్రీస్వామివారికి ఇచ్చేవారు.

4. దద్ధోజనం, నిమ్మకాయపచ్చడి మరియు బేసిన్‌లడ్డూలు శ్రీస్వామికి నైవేద్యముగా పెట్టేవారు.

5. శ్రీస్వామివారికి అభ్యంగన స్నానము చేయించి పీటపై కూర్చోపెట్టేవారు.

6. సువాసనలుగల నూనె వంటికి పూసి, నలుగుపెట్టి సుగంధ ద్రవ్యములు కూడా వాడేవారు.

7. శ్రీస్వామివారిని స్నానాంతరము సింహాసనముమీద కూర్చోపెట్టేవారు.

8. శ్రీస్వామి మెడలో నున్న రుద్రాక్షలు, స్ఫటికమాల ఎవరూ కూడా తీసేవారు కాదు.

9. కలకండ, ఖర్జూరం వచ్చిన వారందరికి ప్రసాదముగా పంచేవారు.

10. చిన్న పిల్లలను ప్రేమతో చూసేవారు.

11. అన్నదానము చేసేవారు.

12. ప్రత్యేకదినములలో కానుకలిచ్చేవారు.

13. ప్రత్యేకపండుగదినాలలో ఫకీర్లను ఆహ్వానించేవారు.

శ్రీస్వామివారు చోళప్ప భక్తిశ్రద్ధలను మెచ్చి ఒకసారి వారి చెక్క పాదుకలను అతని ముందు విసిరినారు మరియు శ్రీస్వామి ఆ పాదుకలను అను నిత్యము వారిని (చోళప్ప దంపతులను) పూజించుకొనమని ఆజ్ఞాపించినారు.

చోళప్పకు ఒకసారి తన మనసులో ఒక భావన కలిగినది. అదేమనగా శ్రీస్వామి సమర్థ నిర్యాణానంతరము కూడా శ్రీస్వామివారి సమాధి తన ఇంట్లోనే ఉండాలని. నిజానికి ఆ భావన చోళప్పకు స్వయముగా తనకు వచ్చినది కాదు. అది శ్రీస్వామిసమర్థ యొక్క సంకల్పమే. ఏ కార్యమునకైనా కారణము శ్రీస్వామి సమర్థయే. కాని మనకు తెలియకపోవుట వలన ఆలోచనగాని, ఆచరణగాని మనది అని, అది నాకే వచ్చినదని భ్రాంతి చెందుదురు. చోళప్పకు ఆ విధమైన సంకల్పము వచ్చిన పిదప ఒకసారి తన ఇంట్లోనే ఒకచోట సమాధికి అనువుగా ఒక గోతిని త్రవ్వించిపెట్టాడు. శ్రీస్వామివారు సజీవముగా ఉన్నప్పుడే చేసిన పని. అటువంటి కార్యము స్వామి ఉండగనే చేయుట ఎంతో ధైర్యము మరియు స్వామిపై అనన్య భక్తి ప్రేమ, చనువు వుంటేనే గాని అటువంటి కార్యములు చేయలేము. చోళప్ప చేసిన పని చూచుటకు వింతగాను మరియు అజ్ఞానముగను కనిపించినప్పటికి అతను చేసిన పనిలో అనతు ఎంతగా తన గురువైన శ్రీస్వామి సమర్థను భక్తితో కొలుచుచున్నాడో తెలియుచున్నది. తన ఇంట్లో భార్యాపిల్లలతో ఉంటున్న చోళప్ప శ్రీస్వామివారికి తన ఇంటిలోనే ఆశ్రయమిచ్చి శ్రీస్వామి కోసం తన కుటుంబాన్నైనా దూరం చేసుకొనుటు సిద్ధమైనాడు. శ్రీస్వామిని సజీవులుగా ఉన్నప్పుడు తన ఇంటిలోనే ఉంచుకొనుటయే గాక శ్రీస్వామి సమర్థ

నిర్యాణానంతరము కూడా వారి సమాధి (శ్రీస్వామి సమాధి) తన ఇంట్లోనే ఉండాలని కోరిన మహాభక్తుడు. అతను ఎంత ధన్యజీవియో కదా! ముందటి అధ్యాయములో చోళప్ప ఒకానొక సందర్భముగా రూ. 10,000/-ల కోసము శ్రీస్వామివారిని వదులుకొనుటకు అనగా వేరే ప్రాంతమునకు శ్రీస్వామిని పంపించుటకు ప్రయత్నించెనని, కావున ధనాశకు లోనైనాడని కనబడినప్పటికి, చోళప్ప యొక్క భావన వేరు. వారి భావన సద్భావన. వచ్చిన ధనముతో భక్తుల యొక్క సదుపాయములు ఇంకొంచెము చూడవచ్చుననే భావనతో అట్లు చేసెను. నిజంగా అతనికి ధనాశే ఉంటే శ్రీస్వామివారు చోళప్పకు తన ఇంటిలోనే గోతిని త్రవ్వించి శ్రీస్వామి నిర్యాణానంతరము కూడా వారి సమాధి తన ఇంట్లోనే ఉండాలనే భావన కల్పించేవారు కాదు. పైగా శ్రీస్వామివారు సమాధి చెందిన తరువాత తన భక్తుడైన చోళప్ప యొక్క కోర్కెను తీర్చి, చోళప్ప ఇంట్లోనే శ్రీస్వామివారి దేహాన్ని సమాధి చేయించుకున్నారు.

చోళప్ప ఇట్లు తన ఇంట్లో ఒక గోతిని త్రవ్వించిన తరువాత శ్రీస్వామిసమర్థ వారి ఇంటి ముందు వెళ్తూ ఆ గోయిని చూసి చోళప్పతో, "అదేమిటిరా?" అని అడిగారు. చోళప్ప సమాధానమివ్వక మౌనంగా ఉండుట చూసి శ్రీస్వామి సమర్థ ఇట్లనిరి. "ఓ చోళప్పా! నిన్నే ముందుగా ఆ గోతిలో పెట్టెదను. ఆ తరువాత గాని నేను పోను" అని అన్నారు. శ్రీస్వామివారు పలికిన పలుకులు విని చోళప్ప అది తేలికగా తీసుకుని అది పరిహాసానికి మాట్లాడిన మాటలని అనుకున్నాడు. కాని కొన్ని నెలల తరువాత చోళప్పకు జబ్బుచేసి చివరిక్షణములో శ్రీస్వామివారి పాదతీర్థమును తీసుకుని కన్నుమూసాడు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-44

### (సుందరాబాయి కుట్ర - చోళప్పకు హెచ్చరిక - శ్రీస్వామి సమర్థ ఆమెకు బుద్ధిచెప్పుట)

సుందరాబాయి షోలాపూర్ నివాసి. ఆమె చిన్నతనములోనే వితంతువైనది. సుందరాబాయి కాలులో పుండులేచి ఎన్ని చికిత్సలు చేసినా తగ్గలేదు. శ్రీస్వామివారి పేరు ప్రఖ్యాతలను మరియు వారి లీలలను విని స్వామిని దర్శించి వారి అనుగ్రహముతో తన కాలుపైన పుండు మాయమయ్యెను. ఆనాటినుండి సుందరాబాయి శ్రీస్వామివారి సేవలో నిమగ్నమై కాలం గడిపేది. శ్రీస్వామివారి దర్శనమునకై ఎందరో వస్తూ పోతూండేవారు. అటువంటి సమయములో చోళప్పకు ఆ వచ్చేవారి వసతులను చూచుటకు సమయం దొరికేది కాదు. కావున సుందరాబాయి ఆ వసతులను చూచుకునేది. ఈ కారణం చేత చోళప్ప తనకున్న కొన్ని పనులు సుందరాబాయికి అప్పజెప్పిరి. ఒకసారి శ్రీస్వామి సమర్థ, చోళప్పను చూచి **"జాగ్రత్త !**

**కొన్నాళ్లకు నీ స్థానాన్ని కూడా ఆక్రమిస్తుంది. నిన్ను నా సేవనుండి దూరం చేస్తుంది"** అని హెచ్చరించిరి. కాని చోళప్ప స్వామి పల్కిన పలుకులను పట్టించుకొనలేదు. శ్రీస్వామివారి అన్ని పనులను సుందరాబాయి చూడసాగినది. సుందరాబాయికి అహంకారము వచ్చి స్వామి దర్శనమునకు వచ్చిన వారెవరైనా ముందుగా తనను ఆశ్రయించవలసిందే అని గర్వముతో ఉండెడిది. శ్రీస్వామికిచ్చిన కానుకలను తానే స్వీకరించేది. క్రమంగా శ్రీవారి సేవలో నిర్లక్ష్యము చూపుట మొదలైంది. భక్తులలో కూడా శ్రీస్వామివారి అనుగ్రహము పొందాలంటే ఆమెకు కానుకలిస్తే సరిపోతుందని కల్పించింది. రాజా మాలోజీరావు భార్యకు చోళప్పపై లేనివెన్నో కల్పించి చాడీలు చెప్పి చోళప్పను తప్పించి సుందరాబాయికీ అధికారము పొందుటకు ప్రయత్నించింది. శ్రీస్వామి సేవలో సంపూర్ణఅధికారము లభించిన తరువాత శ్రీస్వామివారు ఒక్కసారిగా ఆమెకు ఏ విధమైన ప్రాముఖ్యత చూపలేదు. అదే సమయములో బాలప్ప అనే భక్తుడు శ్రీస్వామిసమర్థను దర్శించి శ్రీస్వామి సేవలోనే ఉండినాడు. బాలప్పను సుందరాబాయికి సహాయకుడిగా ఉంచిరి. బాలప్ప స్వామికి ఎంతో సేవ చేయుచుండగా సుందరాబాయి వేరే పనులు చూచుకొనుట ప్రారంభించినది. చోళప్ప ఇంత జరిగినా కూడా స్వామిని దర్శించుకొని మౌనముగా ఉండేవాడు. సుందరాబాయి స్వామివారి భక్తులనుండి డబ్బు తీసుకొనుట ప్రారంభించినది. ఇది తెలిసి శ్రీస్వామి సమర్థ ఒక రోజున ఆమెను చెప్పులతో కొట్టారు.

తరువాత కూడా ఆమె యొక్క ప్రవర్తన మారకపోవుటచే విచారణ జరిపించి రాజుగారి అనుమతితో సుందరాబాయిని నేరస్తురాలిగా తీర్మానించినారు. తను ఆర్జించిన ధన్నానంతా జప్తుచేశారు. ఆమెలో పరివర్తన కలిగి తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపపడి శ్రీస్వామికి నిజమైన భక్తురాలిగా మారింది.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-45

## (బాలప్ప సద్గురువునకై అన్వేషణ - శ్రీస్వామి సమర్థను సద్గురువుగా పొందుట)

బాలప్ప హవేలీ తాలుకానందున్న కరజ్గీ గ్రామానికి చెందినవాడు. ఆ గ్రామం కర్ణాటక రాష్ట్రంలో నున్నది. ఇతను బ్రాహ్మణుడు. నగల వ్యాపారస్థుడు. ఒకసారి సద్గురువును అన్వేషించవలెనని తపనతో శ్రీగురుచరిత్ర పారాయణ చేయుచూ గాణ్గాపురమునకు బయలుదేరెను. గాణ్గాపురములో ప్రతిరోజు భీమఅమరజానదీ సంగమములో స్నానము చేయుచూ గురుచరిత్రను మానకుండా ప్రతిమధ్యాహ్నం ఆ గాణ్గాపురంలోనే భిక్షాటన చేసి శ్రీస్వామివారి మందిరములో నిద్రచేస్తూ కాలం గడిపేవాడు. శ్రీగురుచరిత్రను

సప్త సప్తాహాలు పారాయణము చేసిన పుణ్యాత్ముడు. ఒకసారి శ్రీదత్తుడు స్వప్నదర్శనమిచ్చి అక్కల్‌కోటలో శ్రీస్వామిసమర్ధను దర్శించుకొనుమని ఆజ్ఞాపించి అదృశ్యులైనారు. బాలప్ప నిద్రలేవగానే తన పడకమీద ఒక కాగితము కన్పించింది. దానిమీద **"తొందర పడవద్దు"** అని వ్రాసియున్నది. చుట్టుప్రక్కల చూస్తే ఎవరూ లేరు. కాని ఆ కాగితము మటుకు వున్నది. శ్రీదత్తుని అవతారమగు శిరిడీసాయిబాబావారు కూడా భక్తుడైన మేఘశ్యామునకు స్వప్నములో దర్శనమిచ్చి **"మేఘా! త్రిశూలము గీయుము"** అని అక్షింతలు జల్లి అదృశ్యులైరి. మేఘుడు కళ్లు తెరచి చూచేసరికి అక్కడ ఎవ్వరూ లేరు. కాని అక్షింతలు పడియున్నవి.

బాలప్ప ఆ కాగితము చదివిన తరువాత రెండు నెలలుగా గాణ్గాపురములోనే ఉండి సాధనలో నిమగ్నుడైనాడు. మళ్ళీ ఒకరోజు శ్రీదత్తుడు బాలప్పకు స్వప్నదర్శనమిచ్చి అక్కల్‌కోటకు వెళ్ళమని ఆజ్ఞాపించినారు. మర్నాడే బాలప్ప అక్కల్‌కోటకు బయలుదేరి శ్రీరామనవమికి అక్కల్‌కోటకు చేరినాడు. బాలప్ప అక్కల్‌కోటకు చేరిన తరువాత శ్రీస్వామిసమర్ధను చూచి తన స్వప్నములో దిగంబరుడుగా దర్శనము రెండుసార్లు ఇచ్చిన శ్రీదత్తుడు శ్రీస్వామి సమర్ధయేనని గ్రహించి శ్రీవారి పాదములపైబడి ఆనందముతో శ్రీస్వామిపాదములకు నమస్కరించి తాను సద్గురువునకై చేసిన అన్వేషణ పూర్తయినదని సంతసించెను. శ్రీస్వామి సమర్ధ కూడా బాలప్పను చూచినంతనే నవ్వుతూ బాలప్పను దరికి చేర్చుకొనిరి.

జై శ్రీస్వామి సమర్ధ

## అధ్యాయము-46

## (బాలప్ప సేవ - శ్రీస్వామి సమర్ధ అనుగ్రహము)

బాలప్ప శ్రీస్వామివారిని ఎంతోభక్తితో సేవచేసుకోవటం మరియు శ్రీస్వామి వారిని పూర్తిగా విశ్వసించి సర్వవేళలా శ్రీస్వామిని నమ్ముకుని శ్రీస్వామికి సేవ చేసేవాడు. అవకాశం వచ్చినప్పుడల్లా ఎట్టి సేవకైనను వెనుకాడక సర్వవిధాల సేవించేవాడు.

1. ప్రొద్దున్నే శ్రీస్వామికి స్నానం చేయించడం
2. శ్రీస్వామివారు ఉమ్మివేసుకొనిన పాత్రను కడుగుట
3. తానే స్వయముగా వంట వండటం
4. శ్రీస్వామికి భోజనం పెట్టడం
5. శ్రీస్వామిపూజకై పూలు కోయటం
6. శ్రీస్వామివారి దర్శనమునకై వచ్చినవారికి ఖర్జూరములు తెచ్చిపెట్టడం

7. శ్రీస్వామివారు ఊరిలో లేకపోయినప్పటికి బాలప్ప నిత్యపూజను మరియు జపధ్యానములను జరుపుకొనుట.

ఒకసారి శ్రీస్వామిసమర్థ అందరికి ప్రసాదముగా ఖర్జూరము పంచుతుండగా అక్కడ ఉన్న బాలప్పకు ఇవ్వలేదు. కొద్దిసేపటికి తరువాత శ్రీస్వామి సమర్థ రెండు ఖర్జూరపు కాయలు బాలప్పకు ప్రసాదిస్తూ **"శ్రద్ధ, ఓర్పు కలిగి యుండు"**మని సూచించినారు. బాలప్ప ఆ ఖర్జూరములను తినబోవుచుండగా శ్రీస్వామి లాక్కుని వెళ్ళిపోయినారు!

శిరిడీసాయిబాబావారు తనవద్దకు వచ్చిన భక్తులను **రెండు రూపాయలను దక్షిణగా** అడుగుతూండేవారు. నిజానికి వారు కోరునది రూపాయలు కావు. శ్రద్ధ, సాబూరి. బాబావారు కూడా తన భక్తులకు శ్రద్ధ, సాబూరి కలిగియుండుమని చెప్తూండేవారు.

శ్రీస్వామి సమర్థ అనుగ్రహము :

బాలప్పసేవను మెచ్చిమరియు బాలప్ప యొక్క శ్రద్ధా ఓర్పులను గమనించిన శ్రీస్వామి సమర్థ బాలప్పను ఈ విధముగా అనుగ్రహించినారు.

1. శ్రీస్వామి నోటినుండి కలకండ తీసి మహాప్రసాదముగా బాలప్పకిచ్చినారు.

2. బాలప్పకు ధ్యానములో ఏకాగ్రత కుదరకపోవుటచే స్వామిని వేడుకొనగా శ్రీస్వామి అతని వీపుపై గట్టిగా కొట్టగా బాలప్ప వీపుపై శ్రీస్వామి వేళ్ళు అచ్చుపడ్డాయి. అప్పటినుండి అమోఘమైన స్థితిలో ఉండి ధ్యానములో ఏకాగ్రత వచ్చినది.

3. శ్రీస్వామి సమర్థ బాలప్పకు ఒక తులసిమాల నిచ్చినారు.

4. ఆ తులసిమాల వలన బాలప్పకు జపధ్యానములు కుదిరినవి.

5. బాలప్పకు శ్రీస్వామివారి నిర్యాణము జరుగక ముందు స్వామి సమర్థ బాలప్పను పిలిచి తన పేరును ముద్రించిన స్వర్ణ ఉంగరము అతని వేలికి తొడగినారు.

6. శ్రీస్వామి సమర్థ బాలప్ప శిరస్సుపై చేతినుంచి **"నా రాజముద్రికను నీకిస్తున్నాను. నీకెప్పుడు ద్వారాలు తెరిచే వుంటాయి. నా అధికారాన్ని, నా శక్తులను యావత్తు నీకిస్తున్నాను"** అని దీవించినారు.

7. శ్రీస్వామి సమర్థ బాలప్పను ఆలింగనము చేసుకున్నారు.

8. శ్రీస్వామి సమర్థ మెడలో నున్న రుద్రాక్షమాలలు ఎవ్వరూ తీసేవారుకారని తెలుసుకుంటిమి. అటువంటి మాలలలో శ్రీస్వామి సమర్థ స్వయముగా తన మెడలోని ఒక రుద్రాక్షమాలను తీసుకొని బాలప్ప మెడలో వేసినారు.

9. తన చొక్కా మరియు ఒక కౌపీనాన్ని స్వామివారు బాలప్ప కిచ్చినారు.

10. శ్రీస్వామివారు ఒక జెండా కూడా బాలప్పకిచ్చినారు.

11. శ్రీస్వామివారు తన నోటినుండి ఆత్మపాదుకలను కక్కి బాలప్పకిచ్చినారు.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-47

**(కులబేదాలు పాటించుట తప్పని శ్రీస్వామి బాలప్పకు బోధించుట - గురూపదేశము - బాలప్ప మఠం)**

బాలప్ప శ్రీస్వామిసమర్థకు అతి ముఖ్యమైన భక్తుడు. కనుకనే శ్రీస్వామి సమర్థ తన స్వహస్తాలతో బాలప్పకు ఎన్నో కానుకలు ఇచ్చి ఆశీర్వదించారు. ఒకసారి బాలప్పను శ్రీస్వామివారు ఒక శూద్రుని ఇంటినుండి నీళ్ళను తీసుకురమ్మని ఆజ్ఞాపించినారు. మడికట్టుకునివున్న బాలప్ప స్వామి చెప్పినదానికి కలత చెంది సంకోచించినాడు. శ్రీస్వామి సమర్థ తన భక్తుని మనసులో ఉన్నది గ్రహించి, **"భగవంతుని దృష్టిలో అందరూ సమానులే ! నీరు తీసుకుని రా పో!"** అని గట్టిగా మందలించారు. బాలప్ప వెంటనే ఆ శూద్రుని ఇంటికి వెళ్లి బావిలో నుండి మంచినీరు తీసుకుని స్వామి కడకు వచ్చినాడు. శ్రీస్వామి సమర్థ బాలప్పకు ఈ విధముగా బోధించినారు. **"కుల భేదాలు పాటించుట తప్పని, సర్వజీవులు ఆ పరమేశ్వరుని యొక్క బిడ్డలే అని వారిని ప్రేమతో చూడవలెనని భేద భావము కూడద"**ని భోదించేవారు.

**దైవారాధనము కన్న సద్గురుని సేవ గొప్పదని** చెప్పుటకై శ్రీస్వామి సమర్థ ఒక చమత్కారము తన భక్తుడైన బాలప్పపై ప్రయోగించినారు. ఒకరోజు బాలప్ప సాధన తీవ్రముగా చేయసాగినాడు. వారి కులదైవాన్ని ఎప్పటి నుండో వంశపారపర్యంగా పూజిస్తూ ఉండే ఆ కులదైవాన్ని బాలప్ప పూజించుచుండగా శ్రీస్వామి సమర్థ, **"బాలప్ప ! ముతక గొంగళ్ళు నేస్తున్నాడు"** అని అన్నారు. సద్గురువు సేవ జరీశాలువా వంటిది.

**సద్గురుసేవలో నిమగ్నమైనవానికి దైవారాధనతో పని అవసరము లేదు.** శ్రీస్వామి సమర్థ భోదించిన గురూపదేశము యావత్ సాధకులకు వర్తించునది. జన్మలో గురువు లభ్యమగుట ఒక వరం. ఆ గురువు లభ్యమైన సాధకుడు తన గురువే దైవమని భావిచి గురువు దైవము వేరుగా చూడనవసరము లేదు. తన గురువుకు సేవ చేస్తూ అనునిత్యము గురువును పూజిస్తూ గురువు భోదించిన అమూల్యమైన వాక్కులను స్మరిస్తూ ఆ గురుభోదనులో నడస్తూ గురుమార్గమును ఆచరించువానికి ఒక దైవాన్ని వేరుగా పూజించనవసరము లేదు. శిరిడీలో శ్రీసాయిబాబా భక్తుడగు బి.వి.దేవుగారు జ్ఞానేశ్వరి భగవద్గీతను చదవవలెనని వారి కాంక్ష. దేవుగారు శిరిడీ నుండి బాలకరాముడిని కలసి అతనికి బాబాపై గల భక్తిని

సాయి అనుగ్రహము ఏ విధముగా వచ్చెనో అడుగుటకు ప్రయత్నించెను.

మర్నాడు బాబా వద్దకు జోగ్‌పోగా సాయి ఇట్లనెను. "నా గుడ్డ పేలికలు నాకు తెలియకుండా దొంగిలించితివేల? నేను నీకు జల్తారు శాలువను ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నాను. ఇతరుల వద్దకు పోయి దొంగిలించనేల?" అని అనెను. దానికి అర్థము బాబాను గురించి ఎవరి వద్దనుండి కనుక్కొని, తెలిసికొనరాదని సాయి ఉద్దేశ్యము. ఎవరికైనను, ఎప్పుడైనను, ఏ ప్రశ్న ఎదురైనను కష్టపరిస్థితులు వచ్చినా వాటిని పరిష్కరించుటకు ఇతరులను అడుగరాదని ఆ ప్రశ్నకు సమాధానము ఇచ్చుటకు బాబా సిద్ధముగా నున్నారని ఈ విధముగా భోదించినారు.

శ్రీస్వామి సమర్థ తన భక్తుడగు బాలప్ప ప్రత్యేకముగా తన కులదైవాన్ని పూజించుట చూసి సద్గురువు సేవయే గొప్పదనే రహస్యాన్ని ఒక్క తన భక్తుడగు బాలప్పకు చెప్పుటయే గాక యావత్ ప్రపంచములో గల సాధకులందరికి భోదించినారని గ్రహించవలెను. శ్రీస్వామివారి మరియొక ముఖ్యభక్తుడగు చోళప్ప శ్రీస్వామి సమర్థను తన ఇంటిలోనే ఉంచుకొని వారి కుటుంబములో ఒక సభ్యునిగా భావించి గురువుగా తలచి సేవించి పూజించిన వ్యక్తి ఆ చోళప్ప ఒక్కొక్కసారి స్వామిని విడిచి పుణ్యక్షేత్రాలకు వెళుతూండేవాడు. అటువంటి సందర్భములో శ్రీస్వామి సమర్థ చోళప్పను చూసి ఏమీ అనక నవ్వేవారట. ఈ విషయము కూడా గ్రహించవలసినది ఏమిటంటే ఒక సద్గురువు లభించిన పిదప ఏ పుణ్యక్షేత్రమునకు కూడా పోనవసరము లేదు.

శ్రీస్వామి సమర్థ బాలప్పను ఎంతో ప్రేమగా చూసి ఎన్నో కానుకలు బాలప్పకిచ్చినారని తెలుసుకుంటిమి. వాటిలో ముఖ్యమైనవి శ్రీస్వామిసమర్థ వారి నోటినుండి ఆత్మపాదుకలను క్రక్కి బాలప్పకిస్తూ ఆ పాదుకలను మఠములో ప్రతిష్ఠించమని ఆ మఠం ఔదుంబరవృక్షపునీడలో స్థాపించమని శ్రీస్వామివారు బాలప్పను ఆదేశించినారు. బాలప్ప శ్రీస్వామి ఆజ్ఞను పాటించుటకై మఠం కోసము స్థలాన్ని అన్వేషించుచుండగా సాక్షాత్తు శ్రీరాముని బంటు శ్రీ ఆంజనేయస్వామి ప్రత్యక్షమై బాలప్పకు స్థలాన్ని చూపించి మాయమైనారు. బాలప్ప శ్రీస్వామి సమర్థ యొక్క పాదుకలను ఆ స్థలములో ప్రతిష్ఠించినారు. అప్పటి నుండి ఆ స్థలం బాలప్ప మఠంగా మారినది. మరియు బాలప్ప బాలప్పయోగిగా మారినాడు. శ్రీస్వామి సమర్థపాదుకలను ఎక్కడ ప్రతిష్ఠించాలా ? అని ఆలోచిస్తున్న సమయాన సాక్షాత్తు శ్రీఆంజనేయస్వామివారు కనపడి స్థలము చూపెనంటె శ్రీస్వామి సమర్థ శ్రీరామచంద్రు ప్రభువుగానే ఋజువైనది. కనుకనే ఆ ఆంజనేయుడు తన గురువైన శ్రీరామపాదుకలను భద్రముగా ప్రతిష్ఠించుటకై తానే స్వయముగా వచ్చి స్థలాన్ని చూపించినారు. శ్రీస్వామి సమర్థ చెప్పినట్లుగా సద్గురువు దైవముకన్నా గొప్పవారే అనుటలో ఇది ఒక ఉదాహరణగా కూడ తీసుకొనవచ్చును. సద్గురువైన శ్రీస్వామి సమర్థ ప్రసాదించిన ఆత్మపాదుకలను

ప్రతిష్ఠించుటకు సాక్షాత్తు ఆ దైవమే (ఆంజనేయస్వామి) దిగివచ్చి బాలప్పకు సహాయము చేసినారు. ఇంతకన్న నిదర్శనము ఏమి కావాలి?

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-48

## (శ్రీస్వామి సమర్థ మహాసమాధి చెందిన తరువాత బాలప్పకు దర్శనము - శ్రీస్వామి సమాధి చెందిన ఐదవ దినమున నిలేగాం ఊరులో శ్రీస్వామి సమర్థ రావడము)

శ్రీస్వామి సమర్థ అనేకమైన మహిమలను చూపి ఎందరో భక్తులను ఆశీర్వదించి వారి యొక్క సమస్యలను తీర్చి స్వామి సమర్థ యొక్క పేరు ప్రఖ్యాతలు యావత్ ప్రపంచమంతా వ్యాపించి శ్రీస్వామి వారిని దర్శించుటకు అనేకమంది అనేక ప్రాంతాలనుండి వచ్చుచు స్వామిని పూజించుకుని వెళ్ళుచుండేవారు. శ్రీదత్తుని నాల్గవ అవతారమగు శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోట మహారాజ్ వారు లోకకళ్యాణమునకై వచ్చి వారి కార్యములను నిర్వర్తించి శ్రీవారి అవతారం సమాప్తి అయ్యే సమయమాసన్నమైనది. కావుననే శ్రీస్వామి సమర్థ 1878వ సం॥న మంగళవారమునాడు సుమారు 4 గం॥లకు (సాయంకాలము) మహాసమాధి చెందినారు. శ్రీస్వామివారు తన సమాది చెందుటకు కొన్ని సూచనలు వారి భక్తుల కిచ్చినారని ఆ సూచనలు 5వ అధ్యాయములో విపులముగా వ్రాయబడియున్నది. శ్రీస్వామి సమర్థ గురించి చెప్పుట మొట్టమొదటే వారి సమాధి గురించి ప్రారంభించుటకు గల కారణము శ్రీస్వామి సమర్థ చూపిన మహిమలు, వారి లీలలు చదివిన పిదప శ్రీస్వామివారి సమాధి గురించి చెప్పినచో చదువరులు బాధ చెందుదురు. శ్రీస్వామి సమర్థ యొక్క సమాధివార్త వినుటవలన తట్టుకోలేరని ఉద్దేశ్యముతోనే మొదట శ్రీస్వామివారి సమాధిని చెప్పి తరువాత వారి లీలలను చూపబడినది. నిజానికి శ్రీస్వామిసమర్థ గొప్పయోగి. సాక్షాత్ శ్రీదత్తుడు. వారికి మరణము అనునది ఉండదు. వారు ఎట్లా వచ్చినారో కూడా ఎవ్వరికీ తెలియదు. కావున జననమే లేనివారికి మరణమెక్కడిది? ఒక్క మహాయోగులకే కాదు, నిజానికి మరణమనేది ఎవ్వరికీ లేదు. ఎందుకంటే శ్రీకృష్ణపరమాత్ముడు గీతలో బోధించినదేమనగా ఆత్మనాశనము లేనిది. దానికి చావు పుట్టుకలు లేవు. అగ్నిలో కాలదు, నీటిలో తడువదు.

శ్రీస్వామి సమర్థ సమాధి చెందిన పిదప కూడా ఒక విచిత్ర లీలను చూపెను. శ్రీస్వామి భక్తుడగు బాలప్ప స్వామి వారి సమాధి వార్తను తట్టుకొనలేక దుఃఖితుడై తానెలగ బ్రతకాలో తెలియక బాధ పడుచుండెను. శ్రీస్వామి వెళ్ళినచోటికి వెళ్ళలేకపోయెనని తలచుకుంటూ రోదించెను. మూడు రోజులు గడిచిన పిదప బాలప్పకు శ్రీస్వామి సమర్థ దర్శనమిచ్చి, **"నీవు దుఃఖించుట తగదు. ధైర్యముగానుండుము. నేను నీకు**

**ప్రసాదించిన పాదుకలు సాక్షాత్తు నా రూపమే. వాటికి చేసే పూజలు నేను స్వయముగా స్వీకరిస్తాను. నేను నీతోనే వుంటాను. నేను లేని చోటు లేదు"** అని బాలప్పను ఆశీర్వదించి మాయమైనారు.

నీలేగాం అనే గ్రామములో భావుసాహెబ్ అనునతను శ్రీస్వామికి భక్తుడు. శ్రీస్వామివారు వారి ఇంటిలో ఉన్న రోజున ఆ భావూసాహెబ్‌ను ఆశీర్వదించి సంతాన ప్రాప్తి కలుగునని దీవించగా శ్రీస్వామి అనుగ్రహప్రకారము అతనికి సంతానము ప్రాప్తించినది. భావూసాహెబ్ అక్కల్‌కోటకు వచ్చి స్వామిని పూజించి శ్రీస్వామి మరల నీలేగాం గ్రామమునకు రమ్మని కోరగా శ్రీస్వామి సమర్థ ఆ భక్తుడిని ఆశీర్వదించి తన కోర్కెను నెరవేర్చదనని మాట ఇచ్చెను. ఇది జరిగిన కొన్ని రోజుల తరువాత శ్రీస్వామి సమర్థ మహాసమాది చెందెను. కాని ఈ వార్త నీలేగాం గ్రామములో భావూసాహెబ్‌కు అందలేదు. శ్రీస్వామివారి సమాధి చెందిన 5వరోజున మరియొక విచిత్రము శ్రీస్వామి సమర్థ ప్రదర్శించెను. శ్రీస్వామి సమర్థ హఠాత్తుగా నీలేగాం గ్రామానికే వచ్చి భావూ సాహెబ్‌ను ఆశీర్వదించి అతని ఆతిథ్యమును స్వీకరించి వెళ్ళిపోయెను. మర్నాడు భావూసాహెబ్ కోరికపై తన ఇంటికి భోజనమునకు వచ్చి హఠాత్తుగా మాయమయ్యెను. భావూసాహెబ్ శ్రీస్వామివారిని భోజనానికి ఆహ్వానించుటకు ఒక మనిషిని అదే పనిగా అక్కల్‌కోటకు పంపించి తీసుకుని రమ్మనెను. ఆ మనిషి అటు వెళగనే, శ్రీస్వామి సమర్థ ఇంతలోనే బాపూసాహెబ్ ఇంటికి రావటము, భోజనానికి కూర్చోవటము, భోజనాలు మొదలుపెట్టే సమయానికి మాయమవటం జరిగినవి. అక్కల్‌కోటకు పోయిన మనిషి తిరిగివచ్చి భావూసాహెబ్‌తో శ్రీస్వామి సమర్థ 5 రోజుల క్రితమే మహాసమాధి చెందినారనే వార్త చెప్పెను. భావూసాహెబ్ ఆ వార్త వినగానే ఆశ్చర్యపోయెను. శ్రీస్వామి లోగడ తనకిచ్చిన మాట నిలబెట్టుకొనుటకు వచ్చెనని విషయం గ్రహించెను.

మహాపురుషులకు మరణము లేదు. వారు అమరులు. వారెల్లప్పుడు అంతట ఉంటారు. కావుననే శ్రీస్వామిసమర్థ ఋజువు చేయుటకై పై చమత్కారములు చూపినారు. శిరిడీ సాయిబాబావారు కూడా మంగళవారమునాడు మహాసమాధి చెంది, బుధవారము తెల్లవారుఝామున లక్ష్మణ్‌మామాజోషీకి స్వప్నదర్శనమిచ్చి చెయ్యి పట్టిలాగి, **"త్వరగా లెమ్ము! బాపూసాహెబ్ నేను మరణించితినని అనుకొనుచున్నాడు. అందుచేత అతను రాడు. నీవు పూజ చేసి కాకడ హారతి నిమ్ము"** అని పల్కినారు. అనగా శ్రీసాయి మరణించలేదని ఖచ్చితంగా తన భక్తునికి చెప్పి తనకు పూజ చేసి కాకడహారతి నిమ్మని చెప్పెను. శ్రీశిరిడీ సాయబాబావారు కూడా మరణించలేదని ఋజువైనది.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము-49

## (శ్రీదత్త అవతారములగు శ్రీస్వామి సమర్థ మరియు శ్రీ శిరిడీ సాయిబాబా ఇరువురు ఒక్కరే - శ్రీదత్తుని అవతారములే)

శ్రీస్వామి సమర్థ తాను మహసమాధి చెందబోవుచున్నారని కొందరు భక్తులకు ముందుగానే సూచన ఇవ్వగా భక్తులు స్వామివారి మాటకు తట్టుకొనలేక దుఃఖించినప్పుడు శ్రీస్వామి సమర్థ తన భక్తులతో, **"నా అవతారము శిరిడీలో వున్నది. అక్కడకు వెళుతూ వుండండి. నేను లేని కొరత మీకు ఉండదు"** అని అన్నారు. శ్రీస్వామి సమర్థ "నా అవతారము" అని అనుటలో వారు దత్త స్వరూపులని గుర్తుచేస్తూ మరియొక దత్తావతారము శిరిడీలో ఉన్నదని చెప్పినారు. శ్రీదత్తుని అవతారములు ఒకే కాలములో వేరు రూపాలలో వేరు నామాలతో వేరువేరు చోట్ల అవతరించి యున్నారని గ్రహించవలెను. శ్రీస్వామి సమర్థ మరియు శ్రీసాయినాథుడు ఇరువురు ఒక్కరే. సాక్షాత్తు దత్తస్వరూపాలే అని ఋజువుచేయుటకు కొన్ని నిదర్శనాలు.

**శ్రీస్వామి సమర్థ**

1. తల్లితండ్రులు ఎవరో తెలియదు
2. మహారాష్ట్రలో కనిపించినారు.
3. శ్రీదత్తుని అవతారము
4. అక్కల్‌కోట నివాసి
5. 1856వ సం॥న అక్కల్‌కోటలో దర్శనమిచ్చారు. (దానికంటే మునుపు వేరు వేరు ప్రాంతాలలో కన్పించారు)
6. సమకాలికులు
7. ఖండోబామందిరమున మొట్టమొదట కనిపించారు
8. పేరు, కులము, మతము తెలియదు
9. కేశవనారాయణ్ అనే భక్తునికి స్వామిసమర్థ తన అవతారము శిరిడీలో ఉన్నదని, అక్కడకు వెళ్ళమని శ్రీస్వామి ఆజ్ఞాపించారు.
10. కృష్ణాజీ శ్రీస్వామి సమాధి చెందిన తరువాత అక్కల్‌కోటకు పోవుటకు సిద్ధముగా ఉండెను. ఆ రాత్రి స్వామి దర్శనమిచ్చి "నేనిప్పుడు శిరిడీలో ఉన్నాను. అక్కడ సేవించుకో" అని అన్నారు.
11. భావూసాహెబ్ జోగ్ శ్రీస్వామి సమర్థులను పూజిస్తూ సేవించే భక్తుడు. స్వామి సమాధి చెందిన

తరువాత శ్రీసాయిని శిరిడీలో పూజిస్తూ హారతి ఇస్తూండేవాడు. అతను శ్రీస్వామి సమర్థ మరియు శ్రీసాయినాథుడు ఇద్దరూ ఒక్కరేనని శ్రీదత్తుని రూపాలని తెలిసికొనన్నను నిదర్శనము కోసము ఎదురుచూస్తూ సాయివద్ద ఉండేవారు.

12. హరిశ్చంద్రపితళే చిన్నతనమున తన తండ్రితో శ్రీస్వామి సమర్థను దర్శించి, వచ్చుచుండగా శ్రీస్వామి సమర్థ పితళే తండ్రికి రెండు రూపాయల నిచ్చి, పూజలో పెట్టి పూజించుకొమ్మనిరి. వారి తండ్రి గతించిన తరువాత ఆ రూపాయలు పోయినవి.

13. రోగముతో బాధపడుతచున్న ఒక భక్తుడు ప్రాణత్యాగము చేయుటకు ప్రయత్నించగా శ్రీస్వామిసమర్థ ఆ భక్తుడిని కాపాడి "గత జన్మ పాపపుణ్యములను అనుభవించవలెన"ని చెప్పి కళ్ళు తెరిపించెను.

14. ఎన్నోరోగములను నయము చేసెను.

15. తన మాటతో పంచభూతాలను తన స్వాధీనము నందుంచెను.

16. శ్రద్ధ, సబూరి కోరేవారు.

17. స్నానము, బలవంతముగా చేయించవలసిందే.

18. బావిలో నీళ్ళు తెప్పించారు.

19. ఔదుంబర వృక్షము క్రింద ఉండేవారు.

20. ధనానికి, ఆడంబరాలకు లొంగేవారు కాదు.

21. కొందరు భక్తుల పూర్వజన్మవృత్తాంతము ఎరింగియున్నారు.

22. ఆత్మసాక్షాత్కారము కలిగించగలిగే సద్గురువు.

23. అనేక దేవతల రూపములను ప్రదర్శించి, భక్తులకు చూపించినారు.

24. బ్రహ్మజ్ఞానమంటే ఏమిటో చెప్పినారు.

25. తమ ఆజ్ఞను భక్తులు ఉల్లంఘినచో వారు కష్టాలపాలైనారు.

26. 1878వ సం॥ మంగళవారమున మహాసమాధి చెందినారు.

27. సమాధి చెందిన పిదప కూడా స్వామి ఎన్నో నిదర్శనాలు భక్తులకు కలిగిస్తూ, ఈనాటికి పలుకుతూనే ఉన్నారు.

28. హారతి అంటే వారి కిష్టము.

**శ్రీషిరిడీ సాయిబాబా**

1. తల్లితండ్రులు ఎవరో తెలియదు

2. మహారాష్ట్రలో కనిపించినారు

3. శ్రీదత్తుని అవతారము

4. శిరిడీ నివాసి

5. సుమారు 1838వ సం॥లో జన్మించి ఉండవచ్చును.

6. సమకాలికులు

7. ఖండోబా మందిరమున కనిపించారు

8. పేరు, కులము, మతము తెలియదు

9. కేశవనాయక్ శిరిడీకి వెళ్ళగా శ్రీసాయి వానిని చూస్తూ, "నీవు, నీ కుమారుడు నా వద్దకు రావచ్చును" అని అన్నారు.

10. కృష్ణాజీ స్వప్నములో చెప్పిన విధముగా శిరిడీకి వెళ్ళగా సాయిని దర్శించి తిరిగి వెళుతుండగా శ్రీసాయి, "అక్కల్‌కోటలో ఏమున్నది? ఆ మహారాజ్ ఇక్కడే ఉన్నారు. వారు నేనే" అని అన్నారు.

11. ఒకసారి భావూసాహెబ్ జోగ్ సాయికి హారతి ఇవ్వకుండా పరీక్షిస్తూ కూర్చుండగా హఠాత్తుగా శ్రీసాయిస్థానములో శ్రీస్వామి సమర్థులు ఆశీనులై యుండుట చూచి వారిరువురు ఒక్కరే అని తెలుసుకున్నాడు.

12. హరిశ్చంద్రపితళే తన కొడుకుని శిరిడీకి తీసుకువెళ్ళినప్పుడు బాబా పితళేతో "భావూ! అంతకు ముందు రెండు రూపాయలు ఇచ్చియుంటిని. ఇప్పుడు మూడు రూపాయలను ఇస్తున్నాను. పూజామందిరములో పెట్టుకుని పూజించుకొనుము" అని అన్నారు.

13. గోపాలనారాయణ అంబాడేకర్ అను సాయిభక్తుడు నిరుద్యోగి సమస్యతో ప్రాణత్యాగము చేయవలెనని ప్రయత్నించగా శ్రీసాయి తన భక్తుడగు సగుణమేరునాయక్ ద్వారాఅంబాడేకర్‌ను రక్షించి అక్కల్‌కోట్‌కర్ మహారాజుగారి జీవితచరిత్ర పుస్తకమును చదవమని ఆజ్ఞాపించగా పుస్తకం తెరిచనంతనే రోగ బాధతో నిరాశచెందిన భక్తుడి ఆత్మహత్యా ప్రయత్నమును తప్పించిన శ్రీస్వామిసమర్థ లీల వచ్చెను.

14. ఎన్నో రోగములను నయము చేసెను.

15. తన మాటతో పంచభూతాలను స్వాధీనము నందుంచెను.

16. శ్రద్ధ, సబూరి కోరేవారు.

17. స్నానము 3, 4 రోజుల కొక్కసారి చేసేవారు.

18. బావిలో నీరు తెప్పించారు.

19. వేపచెట్టు క్రింద ఉండేవారు

20. ధనానికి ఆడంబరాలకు లొంగేవారు కాదు.

21. కొందరు భక్తుల పూర్వజన్మవృత్తాంతము ఎరింగియున్నారు.

22. ఆత్మసాక్షాత్కారము కలిగించగలిగే సద్గురువు.

23. అనేక దేవతలరూపముల దర్శనము భక్తులకు చూపించినారు.

24. బ్రహ్మజ్ఞానమంటే ఏమిటో చెప్పినారు.

25. తమ ఆజ్ఞాను భక్తులు ఉల్లఘించనచో వారు కష్టాలపాలైనారు.

26. 1918వ సం॥, అక్టోబర్, 15వ తేదీ, మంగళవారము మధ్యాహ్నం గం॥ 2.30లకు బాబా దేహత్యాగము గావించినారు.

27. సమాధి చెందిన పిదప ఎన్నో నిదర్శనాలు భక్తుల కిస్తూ పిలిస్తే ఈనాటికి పలుకుతూనే యున్నారు.

28. హారతి అంటే స్వామివారికి ఇష్టం.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము - 50

## (కలియుగములో దత్త అవతారములు)

4వ అధ్యాయములో కొన్ని ముఖ్యమైన దత్తక్షేత్రములు మరియు కలియగములో శ్రీదత్తుని అవతారములు ఆరు కలవని అందులో మొదటి మూడు అవతారములగు శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీనృసింహసరస్వతి మరియు శ్రీమాణిక్యప్రభువులను గురించి వారి అవతారమునకు గల కారణములు మరియు వారి సమాధి గురించి చెప్పబడినది. 5వ అధ్యాయము నుండి 49వ అధ్యాయము వరకు శ్రీదత్తుని నాల్గవ అవతారమగు శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోట మహారాజుగారి లీలలను, మహత్యలను సమాధి గురించి చెప్పబడినది. ఈ అధ్యాయములో శ్రీదత్తుని 5వ అవతారమగు శిరిడీ సాయిబాబా, మరియు ఆరవ

అవతారమగు శ్రీగజానన్‌మహారాజుల జననము మరియు సమాధి గురించి చెప్పబడినది.

**5వ అవతారమగు శిరిడీసాయిబాబా :**

శిరిడీ సాయిబాబాగారు సుమారు 16వ ఏట శిరిడీలో దర్శనమిచ్చి, 3 సం॥లు అచ్చటనే యుండి తరువాత అదృశ్యులైరి. ఔరంగాబాద్ సమీపమున తిరిగి కనిపించెను. చాంద్‌పాటిల్ పెండ్లిగుంపుతో 20 సం॥ల ప్రాయములో శిరిడీకి వచ్చిరి. అప్పటినుండి సుమారు 60 స॥లు శిరిడీలోనే ఉండెను. దీనినిబట్టి శ్రీసాయిబాబా సుమారు 1838వ సం॥న జన్మించి యుండవచ్చునని భావన. వారి పుట్టుపూర్వోత్తరములు ఎవ్వరికీ తెలియవు. ఎక్కడనుండి వచ్చినారో తెలియదు. ఏ పేరూలేని పరబ్రహ్మస్వరూపులు. మొట్టమొదట చాంద్‌పాటిల్ పెండ్లిగుంపుతో శిరిడీకి వచ్చినప్పుడు ఖండోబా మందిరము వద్ద అందరితోపాటు బాబా టాంగా నుండి దిగుచుండగా భక్తమహల్సాపతి 'ఆవో సాయి' అని పిలుచుటచేత 'సాయి' అని అంటే పల్కేవారు. శ్రీసాయిబాబా వారి లీలలను, వారి మహత్యలను క్షుణ్ణముగా తెలిసికొనవలెనన్న శ్రీసాయి సచ్చరితము పఠించిన వారి గొప్పతనము గూర్చి తెలియును.

**సమాధి :** శ్రీసాయిబాబా 1918వ సం॥ అక్టోబర్ 15వ తేదీన మంగళవారమునాడు విజయదశమి పర్వదినమున మధ్యాహ్నము గం॥2.30 ని॥లకు సమాధి చెందినారు. తన భక్తుడైన తాత్యాకు వచ్చిన రోగమును తప్పించుటకై సాయిబాబా దేహత్యాగము చేసినారు. నిజానికి సద్గురువు సాయికి మరణము లేదు. వారు అయోనిజసంభవులు. ఒక నెపము చూపి తన భౌతిక శరీరమును విడిచినట్లుగా చూపెను. కాని సాయి ఈనాటికి కూడా ఎందరో భక్తులకు సమాధానమిస్తూ సజీవముగా ఉన్నట్లు ఋజువు చేసినారు.

**6వ అవతారమగు శ్రీ గజానన్ మహరాజ్ :**

శ్రీగజానన్ మహారాజ్ మహారాష్ట్రలోని సజ్జనగడ్‌లో 1860వ సం॥లో జన్మించినట్లు కొందరు అభిప్రాయపడినారు. వీరి తల్లితండ్రులు, కులగోత్రాలు ఎవరికీ తెలియవు. 1878వ సం॥ నుండి 1910వ సం॥వరకు షేగావ్‌క్షేత్రములో ఉన్నారు. వీరు, శ్రీస్వామి సమర్థులు మరియు శిరిడీసాయిబాబావారు ముగ్గురు సమకాలీకులు. దాదాపు ఒకే సంవత్సరములో వేరు వేరు చోట్ల నివసించినారు. శ్రీగజానన్‌మహారాజ్ 23 ఫిబ్రవరి 1878న అకస్మాత్తుగా షేగావ్‌లో ప్రత్యక్షమయ్యారు. బయటపారవేసిన ఎంగిలి ఆకులు దగ్గర చేరి, ఏదో ఒక దానిని వెతుకుతున్నట్లు ఆ ఎంగిలి ఆకులలోని ఎంగిలి తింటూ గజానన్ మహారాజ్ కనిపించారు. ఎక్కడినుండి వచ్చినారో తెలియదు. శ్రీగజానన్ మహారాజ్‌గారి గురించి వివరముగా తెలిసికొనవలెనన్న "శ్రీగజానన్ విజయ గ్రంథము" అను పుస్తకమును చదివినచో పూర్తి వివరములు తెలియును.

**సమాధి :** శ్రీగజానన్‌మహారాజ్ తన భక్తుడు పాటిల్‌తో కలిసి ఆషాఢ మాసంలో శ్రీపాండురంగని దర్శనానికై పండరీపుర్‌కి వెళ్లి, ఆ పాండురంగనితో తన అవతార కార్యక్రమము పూర్తి అయినదని తన నిజధామానికి చేరుకొనుటకు అనుజ్ఞ నివ్వమని పాండురంగని కోరినారు. తిరగి షేగావ్‌కు వచ్చి, శ్రావణమాసము గడిపి భాద్రపదమాసము వచ్చిన పిదప భక్తులతో గణేశచతుర్ధశినాడు **"గణపతి విసర్జనానికి అంతా రండి. గణపతిని పూజించి, నైవేద్యం సమర్పించి, రెండవ రోజున నిమజ్జనము చేయాలి. అదే రోజున నా ఈ దేహాన్ని విసర్జనము చేయండి"** అని చెప్పి శ్రీగజానన్ మహారాజ్ భాద్రపదశుద్ధ పంచమి, గురువారంనాడు (వినాయకచవితి మర్నాడు) సమాధి చెందినారు. తమాషా ఏమిటంటే గజానన్ మహారాజ్ శరీరము వదిలిన రోజు శిరిడీలోని శ్రీసాయిబాబావారు తన భక్తులతో మాట్లాడుతూ ఒక్కసారిగా ఇట్లనినారు, **"ఇక గజానను లేరు"**. బాబా పలికిన తరువాత కొన్ని గంటలకు షేగావ్‌నుంచి శ్రీగజానన్ మహారాజ్ సమాది చెందినారని వార్త వచ్చినది. కావున యోగులందరు ఒక్కరే. ఆ పరమగురువైన శ్రీదత్తుని అవతారములే అని గ్రహించి భక్తులు ఇన్ని దత్తుని అవతారములలో ఏ అవతారము ఎవరికి గురి కలిగినదో ఆ అవతారములో శ్రద్ధా భక్తులతో నమ్ముకుని పూజించిన శ్రీ దత్తుని మిగిలిన అన్ని అవతారములకు పూజించినట్లే అగును. మానవులకు దేవుని రూపాలు, నామాలు వేరుగా భావించెదరు. కాని ఆ పరమాత్మునికి ఆ భేదము లేదు. మన కోసమే వారు మన అభిరుచి కొరకు ఎన్నో అవతారములు దాల్చి, ఎన్నో నామాలు కలిగి తమ లీలలను ప్రదర్శింపచేసినారు. నిజానికి పరమాత్ములంతా ఒక్కరే. నిరాకారరూపుడు. నామరూపాలు లేనివారు. అందరిలో ఉన్నవారు. అందరిని రక్షించువారు. కావున సాధకులు ఏ దైవాన్ని లేదా ఏ సద్గురువుని నమ్ముకున్నారో ఆ గురవునే పరిపూర్ణముగా నమ్మి భక్తిశ్రద్ధలతో పూజించిన ఆ పరమగురువు అనుగ్రహము తప్పకుండా కలుగుతుంది.

జై శ్రీస్వామి సమర్థ

## అధ్యాయము – 51

### (ఫలశృతి)

ఇదే చివరి అధ్యాయము. శ్రీదత్తుని అవతారములకు, వారు ప్రదర్శించిన లీలలకు, చివర అనునది లేదు. అనంతమైన రూపములు కలిగి ఎన్నో మహిమలను చూపే ఆ దత్తునికి ముగింపు ఉండదు. ఆ జగద్గురువు అవధూత. అవధూతలు లేని ఆ పరమ గురువు యొక్క మహత్యాన్ని బలవంతముగా తప్పక

ఈ గ్రంధాన్ని ముగించవలెనని చివరి అధ్యాయముగా వ్రాయబడినది. ఆ సద్గురువు ఆది, అంతములు లేనివారు. వారి లీలలను అను నిత్యము చదివి తెలిసికొన్నవారికి శ్రీదత్తుని కృపాకటాక్షములు కలుగును. శ్రీదత్తుని కటాక్షము కంటె మరియొకటి ఏమున్నదని కోరవలెను. అవధూతల చరిత్రలను చదువుట కంటె ఇంకేమి కోరిక కలిగియుండును. శ్రీదత్తుని అవతారములగు గురుపరంపరల చరితము చదివిన చాలును. ప్రత్యేకముగా మరేమి కోరికలు కోరనవసరము లేదు. శ్రీదత్తుని చరితములు ఇప్పటి వరకు చదవని వారు ఆ దత్తుని ఆరు అవతారములగు శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీ నృసింహసరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ స్వామి సమర్థ అక్కల్‌కోట మహారాజ్, శ్రీ షిరిడీ సాయిబాబా మరియు శ్రీగజానన్ మహారాజ్ – వీరిలో ఏ ఒక్కరి చరితమునైన చదువవలెనని ఆ దైవాన్ని ప్రార్థించి కోరవలెను. వీరి చరితములను చదివినవారు ఎంతో పుణ్యాత్ములు. వారి జీవితము ధన్యము. కావున ప్రత్యేకమైన కోరికలు కోరకుండా శ్రీదత్తుని గురించి కలియుగములో వారి అవతారములు గురించి వారి చరితములను గురించి భక్తిశ్రద్ధలతో తెలిసికొనవలెనని కోరిక మాత్రమే కలిగియుండవలెను. వారిని కొలిచిన జీవి వారి జీవితము ధన్యము. ఏ చరితమునైన పారాయణము చేసినవారికి ఏ కోరిక కోరరాదు. నమ్ముకుని చదివిన స్వామి అనుగ్రహము తప్పక ప్రాప్తించును. ఆ విశ్వాసము ప్రతిసాధకుడు కలిగియుండవలెను. ఐనను దేహము అన్న భ్రాంతితో ఉన్నవారు తమ కష్టాలను భరించలేనివారు ఇటువంటి గురుచరిత్రమును చదివినచో వారు కోరుకున్న కోరికలు తప్పక నెరవేరును. సంతానము లేనివారికి సంతానము, ధనము లేనివారికి ధనము, అనారోగ్యులకు ఆరోగ్యము ఇలా ఏమి కోరుకున్నా అవి తప్పక నెరవేరును. శ్రీస్వామి సమర్థుల ఆశీర్వచనములు తప్పక లభించును.

సర్వే జనా సుఖినో భవన్తు

జై శ్రీ స్వామి సమర్థ

కోటంరాజు శ్రీనివాసరావు
1-9-129/16/1/బి/3,
రాంనగర్
హైద్రాబాద్
సెల్ : 9346823570
9848438884